సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 13

శుక్రవారం 5-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



శశాంక్ కిర్రాక్...

గుజరాత్‌పై మూడు వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్ విజయం - 13లో



ప్లాంట్ ఏర్పాటు దిశగా టెస్లా

భారత్‌లో స్థల అన్వేషణ కోసం ఈ నెలాఖరుకు రానున్న బృందం -13లో



కవితకు బెయిల్‌పై 8న తీర్పు

ఢిల్లీ మద్యం స్కాం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మధ్యంతర బెయిల్‌పై ఈనెల 8న తీర్పు వెల్లడిస్తామని ప్రత్యేక కోర్టు తెలిపింది.

వివరాలు 11లో ▸



క్షిపణి పరీక్ష విజయవంతం

దేశీయంగా అభివృద్ధి చేసిన నూతన తరం 'అగ్ని ప్రైమ్' బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది.

వివరాలు 6లో ▸



సీబీఎస్‌ఈ కొత్త సిలబస్

సీబీఎస్‌ఈ స్కూళ్లలో 3, 6వ తరగతుల సిలబస్ మారింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుంది.

వివరాలు 6లో ▸



ఈ చిన్నారి మృత్యుంజయుడు

కర్ణాటకలో బోరుబావిలో పడిపోయిన రెండేళ్ల చిన్నారిని 20 గంటలు శ్రమించి 16 అడుగుల లోతు నుంచి సురక్షితంగా బయటకు తీశారు.

వివరాలు 6లో ▸



'ఫ్యాన్' ప్రభంజనమే

21 - 22 ఎంపీ సీట్లు కైవసం చేసుకోవడం ఖాయం

టైమ్స్ నౌ-ఈటీజీ సర్వేలో వెల్లడి

2 లో



తిరుపతి జిల్లా నాయుడుపేటలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

వలంటీర్ల సేవలు ఆగవు

మళ్లీ మన ప్రభుత్వంలో ఆ ఫైల్‌పైనే నా తొలి సంతకం: సీఎం జగన్

- వలంటీర్ వ్యవస్థతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు
- అందుకే నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించి అడ్డగింత
- బాబు తీరుతో 2 రోజుల్లో 31 మంది వృద్ధులు మృత్యువాత
- ఇలా చేసిన బాబును హంతకుడు అందామా?
- రాబోయే ఐదేళ్లలో మన తలరాతను మార్చనున్న ఓటు
- నాడు జన్మభూమి కమిటీలు.. లంచాలు ఇస్తేనే పథకాలు
- 14 ఏళ్లలో చెప్పుకోదగిన ఒక్క పథకమైనా చేశావా బాబూ?
- ఈ 58 నెలల్లో ఇంటింటికీ మంచి చేశాం..
- మీ బిడ్డ అబద్ధాలు చెప్పడు.. మోసం చెయ్యడు
- లీడర్ అంటే కార్యకర్త కాలర్ ఎగరేసేలా ఉండాలి
- జగన్ చేయలేని స్కీమును బాబు జేజమ్మ కూడా చేయలేదు
- నాయుడుపేట బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్

7 లో



చట్టసభల్లోకి సామాన్యులు 8 లో



శ్రీ సిమెంట్ ఉత్పత్తి షురూ

- దాచేపల్లిలో రూ.2,500 కోట్లతో యూనిట్ ఏర్పాటు
- 6 నెలల ముందుగానే ఉత్పత్తి ప్రారంభించిన శ్రీ సిమెంట్
- ఏటా 3 మిలియన్ టన్నుల ఉత్పత్తి.. 2 వేల మందికి ఉపాధి
- దేశంలోనే తొలి పర్యావరణహిత సిమెంట్ యూనిట్

5 లో

పురందేశ్వరి బరితెగింపు!



22 మంది ఐపీఎస్‌లను బదిలీ చేయాలంటూ ఈసీకి లేఖ

వారి స్థానంలో ఎవరెవరిని నియమించాలో కూడా సూచన

ఎన్నికల ప్రక్రియకు సంబంధం లేని అధికారులపైనా ఆరోపణలు

బెదిరింపు ధోరణిలో లేఖ రాయటం వెనక బాబు పాత్ర స్పష్టం

చంద్రబాబు కేసులు విచారిస్తున్న సీఐడీ అధికారిపైనా కక్ష ధోరణి

ఆయనకు ఎన్నికలతో సంబంధం లేకున్నా.. బదిలీ చేయాలని లేఖ

మరిది కోసం పూర్తిగా దిగజారిన తీరు; పదవి తాకట్టుపై బీజేపీలోనే విస్మయం

సాక్షి, అమరావతి: ఎన్నికల వేళ... తన మరిది చంద్రబాబు నాయుడి కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బరితెగించేశారు. ఒకేసారి ఏకంగా 22 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాయటమే కాక... ఆ 22 మంది స్థానంలో ఎవరెవరిని నియమించాలో పేర్లతో సహా సూచించారు. ఒకరకంగా అనధికారిక సిఫారసు చేశారు. నిజానికిలా ఎవరెవరిని నియమించాలో కూడా సూచిస్తూ లేఖ రాయటమనేది అనూహ్యం. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండటం... తాను ఆ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలిగా కొనసాగుతుండటం వల్లే ఆమె ఇంతకు బరితెగించారని..

మిగతా 9వ పేజీలో ▸

ఆమెది శిఖండి పాత్ర



- మరిది కళ్లలో ఆనందమే ఆమె లక్ష్యం
- పురందేశ్వరి తీరుపై మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం
- 22 మంది ఐపీఎస్ అధికారుల బదిలీకి ఆదేశాలివ్వడం విడ్డూరం
- బదిలీ స్థానాల్లో ఎవర్ని నియమించాలో ఏ హోదాలో సిఫార్సు చేస్తారు?
- బరితెగింపు రాజకీయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం

9 లో

ఇళ్లు.. ఇవ్వాల్సిందే

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం అమలు కావాల్సిందే

స్వార్థ, నిగూఢ ప్రయోజనాల కోసం పథకాన్ని అడ్డుకోవడానికి వీల్లేదు

- సంక్షేమ రాజ్యంలో పేదలకు గృహ వసతి కల్పించాల్సిన రాజ్యాంగ బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- ఒకసారి పరిహారం చెల్లించి భూమి తీసుకున్న తర్వాత అది ప్రభుత్వానిదే
- ఆ భూమిపై పరిహారం తీసుకున్న వారు యాజమాన్య హక్కులు కోరజాలరు.. ఆ భూమిని ప్రభుత్వం ఏ ప్రజా ప్రయోజనం కోసమైనా వినియోగించవచ్చు
- కర్నూలు జిల్లాలో ఎస్‌ఆర్‌బీసీ వద్ద 130.86 ఎకరాల భూమిని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించడం సరైనదే
- హైకోర్టు జడ్జి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ 89 పేజీల తీర్పు



సాక్షి, అమరావతి: పేదలకు ఓ గూడు కల్పించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' సంక్షేమ పథకం అమలు కావాల్సిందేనని హైకోర్టు తేల్చి చెప్పింది. స్వార్థ, నిగూఢ ప్రయోజనాలు, ఇతర కారణాలతో ఈ పథకం అమలు కాకుండా నిరోధించడం, అడ్డుకునేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. సంక్షేమ రాజ్యంలో భాగంగా నిజమైన పేద లబ్ధిదారులను గుర్తించి గృహ వసతి కల్పించాల్సిన

మిగతా 2వ పేజీలో ▸



మొదలైన ధాన్యం సేకరణ

గోదావరి జిల్లాల్లో వరి కోతలు ప్రారంభం.. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టు సేకరించేందుకు ప్రణాళిక

25 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని ప్రాథమిక అంచనా

జీఎల్టీ చార్జీలు సైతం చెల్లించడంతో ప్రభుత్వ కేంద్రాల వైపే రైతుల మొగ్గు

2 లో

ఇదండీ జగత్



'పొత్తు' ప్రచారమట!!

శ్రీకాకుళంలోని వార్డు సచివాలయంలో పింఛన్ డబ్బులు తీసుకుంటున్న లబ్ధిదారులు



88.03 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

ఒకటిన్నర రోజుల్లోనే 57.83 లక్షల మందికి రూ.1,749.53 కోట్లు

నేడు కూడా సచివాలయాల వద్ద ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు పంపిణీ

9 లో

అయ్యో.. అవ్వాతాతలు!

చంద్రబాబు కుట్రలతో విలవిల

పింఛన్లకు వెళ్లి ఎండ దెబ్బ తాళలేక మృత్యువాత.. గురువారం 19 మంది మృతి

2 రోజుల్లో మొత్తం 39 మంది కన్నుమూత

టీడీపీ కుట్రల వల్లే తమకీ దుర్గతి పట్టిందని బాధితుల ఆక్రందన

చంద్రబాబే ప్రధాన నిందితుడు

రెండో నిందితుడు అచ్చెన్నాయుడు

పక్కా పథకం ప్రకారమే 'స్కిల్' కుంభకోణం



- న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీఐడీ
- సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ సంస్థ పేరుతో ఒప్పందం చేశారు
- రూ.330 కోట్ల విలువైన ప్రాజెక్టును రూ.3,300 కోట్లకు పెంచారు
- సీమెన్స్ కంపెనీ వాటా 90 శాతం నిధుల్లో ఒక్క రూపాయి వెచ్చించలేదు
- ప్రభుత్వ వాటా కింద జీఎస్టీతోసహా రూ.371 కోట్లు చెల్లించేశారు
- ఇలా చెల్లించడం నిబంధనలకు విరుద్ధం
- అందులో రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు కొల్లగొట్టారు

- వివరాలు 10లో



డీఆర్‌ఐ అధికారిపై దౌర్జన్యం చేస్తున్న బీజేపీ నేత సీఎం రమేష్

నా సంగతి మీకు తెలీదు.. తనిఖీలు ఆపి వెంటనే వెళ్లండి

- టైల్స్‌షాప్‌లో తనిఖీ చేస్తున్న డీఆర్‌ఐ అధికారులపై బీజేపీ నేత సీఎం రమేష్ దౌర్జన్యం
- వెళ్లకపోతే తాను అక్కడి నుంచి కదిలేది లేదని హూంకరింపు.. షాపు యజమాని ఇచ్చిన సమాచారంతో అనుచరులతో వచ్చి హల్‌చల్
- ఫైళ్లు లాక్కుని తనిఖీ అధికారులపై గూండాయిజం చెలాయించిన వైనం
- విధి నిర్వహణకు అడ్డురావద్దని అధికారులు చెప్పినా ఆగకుండా దందా
- పోలీసులకు ఫిర్యాదు చేసిన డీఆర్‌ఐ అధికారులు.. ప్రశాంతమైన అనకాపల్లి జిల్లాలో రౌడీయిజంపై భయభ్రాంతులైన స్థానికులు
- ఎన్నికల సమయంలోనే ఇలా చేస్తే ఇక గెలిపిస్తే బతకనిస్తారా అంటూ వ్యాఖ్యలు

5 లో

మూడు జిల్లాలకు నూతన కలెక్టర్లు

- ఐదు జిల్లాలకు ఎస్పీలు, గుంటూరు ఐజీ కూడా నియామకం
- కేంద్ర ఎన్నికల సంఘం సూచనలతో నియమించిన సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల రాష్ట్రంలోని ముగ్గురు ఐఏఎస్ అధికారులు, ఆరుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన కేంద్ర ఎన్నికల సంఘం... వారి స్థానంలో కొత్త అధికారుల నియామకానికి అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన వారిని మూడు జిల్లాలకు కలెక్టర్లుగా, ఐదు జిల్లాలకు ఎస్పీలుగా, గుంటూరు రేంజ్ ఐజీగా నియమిస్తూ సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. కొత్తగా నియమితులైన అధికారులు గురువారం రాత్రి 8 గంటల్లోపు బాధ్యతలు స్వీకరించాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

కొత్తగా నియమితులైన అధికారుల వివరాలు

డీకే బాలాజీ	కృష్ణా జిల్లా కలెక్టర్
వి.వినోద్ కుమార్	అనంతపురం జిల్లా కలెక్టర్
ప్రవీణ్‌కుమార్	తిరుపతి జిల్లా కలెక్టర్
సర్వశ్రేష్ఠ త్రిపాఠి	గుంటూరు రేంజ్ ఐజీ
సుమిత్ సునీల్	ప్రకాశం జిల్లా ఎస్పీ
బిందు మాధవ్	పల్నాడు జిల్లా ఎస్పీ
మణికంఠ చందోలు	చిత్తూరు జిల్లా ఎస్పీ
అమిత్ బర్దార్	అనంతపురం జిల్లా ఎస్పీ
ఆరీఫ్ హఫీజ్	ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఎస్పీ







మొదలైన ధాన్యం సేకరణ

గోదావరి జిల్లాల్లో వరి కోతలు ప్రారంభం

- వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టు సేకరించేందుకు ప్రణాళిక
- 25 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని ప్రాథమిక అంచనా
- జీఎల్టీ చార్జీలు సైతం చెల్లించడంతో ప్రభుత్వ కేంద్రాల వైపే రైతుల మొగ్గు
- ఫలితంగా మద్దతు ధర కంటే ఎక్కువ ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రబీ ధాన్యం సేకరణ ప్రారంభమైంది. ప్రతి రైతుకు సంపూర్ణ మద్దతు ధర చెల్లింపే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రాథమికంగా ఈ సీజన్‌లో 25 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు భావిస్తున్నారు. కల్లాల్లో పంట కొనుగోలు దగ్గర నుంచి మిల్లుకు తరలించేంత వరకు ఎక్కడా జాప్యం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) స్థాయిలో ధాన్యం రవాణాకు వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. అకాల వర్షాలు, అనుకోని విపత్తులు సంభవిస్తే తక్షణం ధాన్యాన్ని తరలించే విధానంపై ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ యంత్రాంగానికి దిశానిర్దేశం చేసింది. గోదావరి జిల్లాల్లో కోతలు మొదలవడంతో వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టు కొనుగోలు చేస్తోంది.

విప్లవాత్మక మార్పులతో..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధాన్యం సేకరణలో విప్లవాత్మక మార్పులు చేసింది. దళారులు, మిల్లర్ల దోపిడీని పూర్తిగా అరికట్టి రైతులను నష్టపోకుండా కాపాడింది. రైతుకు మద్దతు ధర దక్కాలన్న ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా ఈ–క్రాప్ ఆధారిత ధాన్యం సేకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఫలితంగా టీడీపీ హయాంలో కంటే ఎక్కువ మంది రైతులకు మద్దతు ధర దక్కింది. ఏటా దిగుబడుల్లో సగటున 50 శాతంపైనే కొనుగోళ్లు చేస్తూ రైతులకు అండగా నిలిచింది. ఇప్పటివరకు ఏకంగా 37.68 లక్షల మంది రైతుల నుంచి రూ.65,142.29 కోట్ల విలువైన 3.40 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం విశేషం. అదే టీడీపీ ఐదేళ్లలో కేవలం 17.94 లక్షల మంది రైతుల నుంచి రూ.40,236.91 కోట్ల విలువైన 2.65 కోట్ల టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించింది. అంటే టీడీపీ హయాంలో కంటే 20 లక్షల మంది రైతులకు అదనంగా మద్దతు ధర అందించింది.

జీఎల్‌టీ లబ్ధి అదనం

టీడీపీ హయాంలో పేరుకే ప్రభుత్వం ధాన్యం సేకరణ చేసేది. కొనుగోలు కేంద్రాలకు పంటతో వచ్చిన రైతుల నుంచి ధాన్యం తీసుకోవడానికి ముప్పుతిప్పలు పెట్టేది. దీంతో రైతులు వచ్చినకాడికి దళారులు, మిల్లర్లకు ధాన్యాన్ని అప్పజెప్పాల్సి వచ్చేది. ఇలా సేకరించిన ధాన్యాన్ని దళారులు తిరిగి ప్రభుత్వానికి విక్రయించి రైతుల పేరుతో పూర్తి మద్దతు ధర కొట్టేసేవారు. ఇక్కడ రైతులు మద్దతు ధర కోల్పోవడంతోపాటు కల్లాల నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించేందుకు రూ.వేలకు వేలు వెచ్చించాల్సి వచ్చేది. గతంలో రైతులే ధాన్యాన్ని రవాణా చేస్తే ఆ ఖర్చులను ప్రభుత్వమే భరించినట్టు లెక్కల్లో చూపించి ఏటా రూ.కోట్లు దోచేసేవారు. ఇది గమనించిన సీఎం వైఎస్ జగన్ రైతులకే గన్నీ, హమాలీ, రవాణా (జీఎల్‌టీ) ఖర్చులను చెల్లించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గోనె సంచులు, హమాలీ కూలీ, ధాన్యం రవాణాకు టన్నుకు రూ.2,523 చొప్పున రైతులకు అదనంగా చెల్లిస్తోంది. ఈ పరిస్థితుల్లో మద్దతు ధర కంటే అధికంగా చెల్లించి ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

బొండాలు రకానికీ మార్కెట్‌లో మంచి ధర

గోదావరి జిల్లాల్లో సాగు చేసే జయ రకం (బొండాలు) ధాన్యానికి మార్కెట్‌లో మంచి రేటు లభిస్తోంది. గతేడాది నుంచి ప్రభుత్వం జయ రకం ధాన్యాన్ని కూడా సేకరించడం ప్రారంభించడంతో ప్రైవేట్ వ్యాపారుల దందాకు అడ్డుకట్ట పడింది. దీంతో దిగొచ్చిన వ్యాపారులు మద్దతు ధర కంటే రూ.100 నుంచి రూ.300 కంటే ఎక్కువ ఇచ్చి కల్లాల నుంచే ఆ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ఏడాది 3 లక్షల టన్నుల వరకు జయ రకం ధాన్యాన్ని సేకరించాలని పౌరసరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

రైతులకు సమస్య లేకుండా..

మిల్లుల్లో ధాన్యం నాణ్యత సమస్యలను రైతులతో సంబంధం లేకుండా పరిష్కరించేందుకు కస్టోడియన్ అధికారుల స్థానంలో ప్రతి మండలంలో మొబైల్ బృందాలను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఈ క్రమంలోనే పౌరసరఫరాల సంస్థ జాయింట్ కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులతో పాటు స్థానికంగా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించనున్నారు.

శ్రీశైలం, సాగర్‌లలో ఉన్న నీళ్లన్నీ మావే..

- 8వ తేదీ నుంచి సాగర్ కుడి కాలువకు 5 టీఎంసీలు విడుదల చేయండి
- నీటిని అధికంగా వాడుకోకుండా తెలంగాణను నియంత్రించండి
- గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడండి
- కృష్ణా బోర్డు చైర్మన్‌కు ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి లేఖ



సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో బోర్డు కేటాయించిన నీటి కంటే తెలంగాణ సర్కార్ 8.66 టీఎంసీలు అధికంగా వాడుకున్న నేపథ్యంలో.. ఇక ఆ రెండు ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లన్నీ తమవేనని కృష్ణా బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. నీటి కేటాయింపుల కోసం ఎలాంటి ప్రతిపాదనలు పంపకుండా.. కృష్ణా బోర్డు నీటిని కేటాయిస్తూ ఉత్తర్వులివ్వకున్నా.. తెలంగాణ సర్కార్ ఏకపక్షంగా శ్రీశైలం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల, నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాలువ, ఏఎమ్మార్పీ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా వాడుకుంటోందని ఫిర్యాదు చేసింది. తెలంగాణ సర్కార్ జలచౌర్యంపై పలుమార్లు ఫిర్యాదు చేశామని.. ఇప్పటికైనా స్పందించి నీటిని అక్రమంగా వాడుకోకుండా నియంత్రించాలని డిమాండ్ చేసింది. అక్టోబర్‌లో చేసిన కేటాయింపుల మేరకు ఈ నెల 8 నుంచి గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 11 రోజుల్లో 5 టీఎంసీలు విడుదల చేయాలని కోరింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి గురువారం లేఖ రాశారు.

8.66 టీఎంసీలు అధికంగా వాడుకున్న తెలంగాణ

త్రిసభ్య కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఉమ్మడి ప్రాజెక్టుల్లో ఏపీకి 45, తెలంగాణకు 35 టీఎంసీలు కేటాయిస్తూ అక్టోబర్ 9న నీటి విడుదల ఉత్తర్వులను కృష్ణా బోర్డు జారీ చేసింది. అయితే గురువారానికి తెలంగాణ సర్కార్ 43.66 టీఎంసీలు వాడుకుంది. అంటే.. కేటాయించిన నీటి కంటే 8.66 టీఎంసీలు అధికంగా వాడుకున్నట్టు స్పష్టమవుతోంది. తెలంగాణ సర్కార్ అక్రమంగా నీటిని వాడుకుంటూ ఏపీ హక్కులను కాలరాస్తోందంటూ పలుమార్లు కృష్ణా బోర్డుకు ఏపీ ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. కానీ.. బోర్డు ప్రేక్షక పాత్ర వహించడాన్ని ఈఎన్‌సీ ఆక్షేపించారు. ఉమ్మడి ప్రాజెక్టుల్లో లభ్యత ఉన్న జలాల్లో 66 శాతం ఏపీకి, 34 శాతం తెలంగాణకు చెందుతాయి. ఇదే అంశాన్ని ఏపీ ఈఎన్‌సీ గుర్తు చేస్తూ.. తెలంగాణ ఇప్పటిదాకా వాడుకున్న 43.66 టీఎంసీలను పరిగణనలోకి తీసుకుంటే ఏపీ వాటా 58.99 టీఎంసీలని స్పష్టం చేశారు. ఇప్పటిదాకా ఏపీ ప్రభుత్వం 42.457 టీఎంసీలు వాడుకుందని.. ఇంకా తమ వాటాలో 16.53 టీఎంసీలు మిగిలే ఉన్నాయని బోర్డుకు తెల్చి చెప్పారు. ఇదిలా ఉంటే ఏపీ వాటాలో ఇంకా 2.543 టీఎంసీలే మిగిలాయంటూ బోర్డు పేర్కొనడంపై ఈఎన్‌సీ అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీశైలం, సాగర్‌లలో తెలంగాణ సర్కార్ నీటి కోటా కంటే అధికంగా వాడుకుందని.. ఇకపై వాడుకోకుండా నియంత్రించడం ద్వారా ఏపీ హక్కులను పరిరక్షించాలని బోర్డును డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నీటిని వాడుకున్న తెలంగాణ సర్కార్‌పై జరిమానా విధించాలని కోరారు.

8న సాగర్ నుంచి 'తాగునీరు' విడుదల

- 6న ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల
- తాగునీటి చెరువులను నింపండి
- నీటిని ఇతర అవసరాలకు మళ్లించకుండా నిఘా ఏర్పాటు చేయండి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వేసవి తాగునీటి అవసరాల దృష్ట్యా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిగా నింపేందుకు ఈ నెల 6వ తేదీన ప్రకాశం బ్యారేజీ నుంచి ఏలూరు కాలువ, బందరు కాలువ, రైవస్ కాలువల ద్వారా ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు, అలాగే బకింగ్ హాం కాలువ ద్వారా గుంటూరు, బాపట్ల జిల్లాలకు నీటిని విడుదల చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకూ నీటిని విడుదల చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులు, ఉపాధి హామీ పథకం పనులపై గురువారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సీఎస్ సమీక్షించారు. ఈ నీటిని చేపల, రొయ్యల చెరువులు తదితర తాగునీటేతర అవసరాలకు మళ్లించకుండా చర్యలు తీసుకోవాలని, కాలువలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నీటి ఎద్దడి గల ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూస్ తదితర విభాగాల అధికారులను ఆదేశించారు.

ఉపాధి పనులు ఉదయం 10 గంటల్లోపు ముగించాలి

ఉపాధి హామీ పథకం అమలు తీరును సమీక్షిస్తూ వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలెవరు వడదెబ్బకు లోను కాకుండా ఉండేందుకు పనులను ఉదయం 10.గం.లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. పని ప్రదేశంలో కూలీలకు నీడ ఉండేలా చూడటంతో పాటు అత్యవసర మెడికల్ కిట్లను ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో రాష్ట్ర జలవనరులు, పంచాయతీరాజ్– గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కన్నబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ గాయిత్రీ, భూగర్భ జల వనరుల శాఖ డైరెక్టర్ జాన్ సత్యరాజ్ పాల్గొన్నారు.

ఇళ్లు.. ఇవ్వాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపింది. తద్వారా రాజ్యాంగం పేదలకు కల్పించిన హక్కులను పరిరక్షించినట్లవుతుందని పేర్కొంది. ఒకసారి పరిహారం చెల్లించి భూమిని సేకరించిన తరువాత ఆ భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికే సంపూర్ణ హక్కులుంటాయంది. పరిహారం అందుకున్న వారు ఆ భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులను, ప్రయోజనాలను కోరలేరని పేర్కొంది. పరిహారం చెల్లించి సేకరించిన భూమిని ఏ ప్రజా ప్రయోజనం కోసమైనా వినియోగించవచ్చని హైకోర్టు తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయం రాజ్యాంగ విరుద్ధంగా, చట్ట విరుద్ధంగా ఉన్నప్పుడు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పుడు, అధికార పరిధిని దాటి తీసుకున్న నిర్ణయమైనప్పుడు, విస్తృత ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే న్యాయ సమీక్షకు ఆస్కారం ఉంటుందని స్పష్టం చేసింది. కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం భానుముక్కాల, బాతులూరుపాడు, యనకండ్ల, బనగానపల్లె గ్రామాల పరిధిలో 130.86 ఎకరాల భూమిని నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలకు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. భూ పంపిణీ విషయంలో అధికారులు జారీ చేసిన ప్రొసీడింగ్స్ అన్నీ సక్రమమేనని ప్రకటించింది. శ్రీశైలం కుడి కాలువ (ఎస్‌ఆర్‌బీసీ) రక్షణ నిమిత్తం మిగిలిన భూమికి ఫెన్సింగ్ వేసి ఆక్రమణల నుంచి, అక్రమ సాగు నుంచి పరిరక్షించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాలువ నిర్వహణ, భద్రత, మరమ్మతుల కోసం తక్షణమే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించింది. ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేయదలచిన స్థలాల్లో నిర్మించే ఇళ్లను నిబంధనలకు అనుగుణంగా పటిష్టంగా నిర్మించాలని ఆదేశించింది. ఎస్‌ఆర్‌బీసీ కాలువ సమీపంలో ఉన్న భూములను నవరత్నాల కింద ఇళ్ల పట్టాల నిమిత్తం సేకరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ గురువారం 89 పేజీల కీలక తీర్పు వెలువరించారు.

ఆ భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించడం సరికాదు..

కర్నూలు జిల్లాలో పలు సర్వే నెంబర్లలో 130.86 ఎకరాల భూమిని ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలకు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది కె.రతంగపాణిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఎస్‌ఆర్‌బీసీ చుట్టు పక్కల ఇళ్ల నిర్మాణం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. నీటిపారుదల కోసం ఉద్దేశించిన భూముల్లో ఇళ్ల నిర్మాణం వల్ల భవిష్యత్తులో వరదలు సంభవిస్తే పెద్ద సంఖ్యలో ప్రజల ప్రాణాలు ప్రశ్నార్థకంగా మారుతాయన్నారు. కాలువ భవిష్యత్ అవసరాల కోసం కేటాయించిన భూమిని నిరుపయోగంగా ఉందన్న కారణంతో తీసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేయాలని కోర్టును కోరారు.

అన్యాక్రాంతం చేసేందుకే ఆ వ్యాజ్యాలు..

అయితే ఈ వాదనలను అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తోసిపుచ్చారు. పిటిషనర్లు సదరు భూములను ఆక్రమించుకుని అక్రమంగా సాగు చేస్తున్నారని, అందుకే ఈ వ్యాజ్యాలు దాఖలు చేశారన్నారు. కాలువ, బఫర్ జోన్‌లోని భూమి జోలికి వెళ్లలేదని తెలిపారు. 130 ఎకరాలను తీసుకోవడం వల్ల ఎస్‌ఆర్‌బీసీకి వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. పిటిషనర్లు సాంకేతిక పరిజ్ఞానం లేకుండా కేవలం ఆందోళనతోనే వాదనలు వినిపిస్తున్నారని తెలిపారు. ఆ భూములు నివాసయోగ్యమైనవేనని అధికారులు నివేదిక ఇచ్చిన తరువాతనే ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు నివేదించారు. ఆ భూములు జీవో 510 పరిధిలోకి రావని తెలిపారు. ఇప్పటికే ఆ భూముల్లో లేఔట్లు సిద్ధం చేశారని, అంతర్గత రోడ్లు కూడా వేశారని, హద్దు రాళ్లు నాటడం పూర్తయిందని సుధాకర్‌రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. కాలువకు ఇరువైపులా 30 మీటర్ల బఫర్ జోన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసేందుకే ఈ పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. ఈ వ్యాజ్యాలకు విచారణార్హతే లేదన్నారు.

ఎస్‌ఆర్‌బీసీ రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది..

'ఏ ప్రయోజనం కోసం గతంలో భూములను తీసుకున్నారో అందుకోసం ఉపయోగించనందున అలాంటి భూములను వెనక్కి తీసుకుని పేదలకు ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేయాలన్నది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. ఎస్‌ఆర్‌బీసీ రక్షణకు ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు తీసుకుంది. నిబంధనలు నిర్దేశించిన దూరాన్ని పాటించారు. ఎస్‌ఆర్‌బీసీ నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు గోరకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్‌కు 800 నుంచి 1,000 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలైంది. అది కూడా ఆగస్టు – మార్చి నెలల మధ్యలోనే. మిగిలిన సమయంలో కాలువలో ఎలాంటి నీరు ఉండదు. మిగిలిన సమయంలో కాలువను తనిఖీ చేసి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టానికి తావు లేకుండా మరమ్మతులు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి ఈ వ్యాజ్యాల్లో పిటిషనర్లు పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న ప్రభుత్వ విధాన నిర్ణయాన్ని సవాలు చేయలేదు. స్వార్థ, నిగూఢ ప్రయోజనాల కోసం, ఇతర ఏ కారణాలతోనూ సంక్షేమ పథకాలు అమలు కాకుండా నిరోధించడం, ఆటంకపరిచేందుకు వీల్లేదు' అని జస్టిస్ కృష్ణమోహన్ తన 89 పేజీల తీర్పులో పేర్కొన్నారు.

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రమాణ స్వీకారం

- వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు, మేడా రఘునాథ రెడ్డితో ప్రమాణం చేయించిన రాజ్యసభ చైర్మన్
- రాజ్యసభలో 11కు చేరిన వైఎస్సార్‌సీపీ సభ్యుల సంఖ్య
- నాలుగో అతిపెద్ద పార్టీగా వైఎస్సార్‌సీపీ



రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌తో రాజ్యసభ సభ్యులు



ప్రమాణస్వీకారం చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు, మేడా రఘునాథరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వైఎస్సార్‌సీపీ సభ్యులు యర్రం వెంకట సుబ్బారెడ్డి(వైవీ సుబ్బారెడ్డి), గొల్ల బాబురావు, మేడా రఘునాథరెడ్డితో గురువారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి ఇంగ్లిష్‌లో, గొల్ల బాబురావు హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ముగ్గురి ఎన్నికతో రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 11 సీట్లూ వైఎస్సార్‌సీపీ ఖాతాలో చేరాయి. అలాగే రాజ్యసభలో నాలుగవ అతిపెద్ద పార్టీగా వైఎస్సార్‌సీపీ అవతరించింది. 97 మంది రాజ్యసభ సభ్యులతో బీజేపీ మొదటి స్థానంలో, 29 మంది సభ్యులతో కాంగ్రెస్ పార్టీ రెండో స్థానంలో, 13 మంది సభ్యులతో టీఎంసీ 3వ స్థానంలో నిలవగా.. 11 మంది సభ్యులతో వైఎస్సార్‌సీపీ నాలుగో స్థానంలో నిలిచాయి. టీడీపీ మొట్టమొదటిసారిగా సున్నాకు పడిపోవడం విశేషం.

సీఎం జగన్ వల్లే రాజ్యసభలో అడుగుపెట్టా..

ఆంధ్రప్రదేశ్‌లోని పేద ప్రజలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నారంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వల్లేనని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు అన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. అట్టడుగువర్గానికి చెందిన తనలాంటి వారు రాజ్యసభలో అడుగుపెట్టడం గొప్ప విషయమని.. ఇది సీఎం జగన్ వల్లే జరిగిందని చెప్పారు. సీఎం జగన్ మరో రెండు, మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉంటే.. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, ఇతర వర్గాల ప్రజలు మరింత అభివృద్ధి చెందుతారని చెప్పారు. రాష్ట్ర సమస్యలను సభలో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

'ఫ్యాన్' ప్రభంజనమే

సాక్షి, అమరావతి: సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజురోజుకూ ప్రజల మద్దతు పెరుగుతోంది. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని ప్రముఖ జాతీయ మీడియా ఇంగ్లీష్ న్యూస్ ఛానల్ టైమ్స్ నౌ–ఈటీజీ తాజాగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దేశంలో అన్ని రాష్ట్రాలతోపాటు ఏపీలోనూ ప్రజల అభిప్రాయాన్ని టౌమ్స్ నౌ సంస్థ నెల రోజులపాటు విస్తృతంగా సర్వే చేసింది. ఈ సర్వే ఫలితాలను గురువారం రాత్రి టైమ్స్ నౌ ఛానల్ ప్రసారం చేసి చర్చ నిర్వహించింది. అత్యంత శాస్త్రీయంగా నిర్వహించిన ఈ సర్వేలో రాష్ట్రంలో 21 నుంచి 22 లోక్‌సభ స్థానాలను వైఎస్సార్‌సీపీ దక్కించుకుంటుందని వెల్లడైంది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కట్టి జట్టుగా వచ్చినప్పటికీ ఘోర పరాభవం తప్పదని సర్వేలో తేలింది. బీజేపీకి రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా రాదని తేల్చింది. టీడీపీ, జనసేన కూటమి మూడు నుంచి నాలుగు ఎంపీ స్థానాలతో ఒకింత ఉనికి చాటుకునే అవకాశం ఉందని పేర్కొంది.

విశ్వసనీయతకు పట్టం..

టైమ్స్ నౌ తాజా సర్వే ఫలితాలు ఇలా..

పార్టీ	గెలిచే లోక్‌సభ స్థానాలు
వైఎస్సార్‌సీపీ	21 నుంచి 22
టీడీపీ, బీజేపీ, జనసేన	3నుంచి 4
ఇతరపక్షాలు	0

సర్వే ఫలితాలు ఆంధ్రప్రదేశ్‌లో తాజా రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టాయని చర్చలో పాల్గొన్న విశ్లేషకులు స్పష్టం చేశారు. గత ఎన్నికలతో పోల్చితే వైఎస్సార్‌సీపీ తిరుగులేని శక్తిగా అవతరించడానికి కారణాలపై ప్రధానంగా చర్చ సాగింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం వాగ్దానాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసి ''చెప్పాడంటే.. చేస్తాడంతే..'' అనే నమ్మకాన్ని ప్రజల్లో పెంచుకున్నారు. మీ బిడ్డగా మీ ఇంటికి మంచి చేశానని నమ్మితే ఓటేయాలంటూ సీఎం జగన్ ఇచ్చిన పిలుపు ప్రజల్లోకి బలంగా వెళ్లింది. రాష్ట్రంలో ప్రతి ఇంటా.. ప్రతి గ్రామం.. ప్రతి నియోజకవర్గంలో సాకారమైన మార్పులు కళ్లెదుటే కనిపిస్తుండటంతో ప్రజలంతా సంక్షేమ సర్కారుకు జై కొడుతున్నారు. కూటమిగా చేరిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు నైతిక స్థైర్యం కోల్పోయి ఉనికి కోసం కుట్రలు చేస్తున్నాయి.

- నేడు, రేపు అసాధారణ సెగలు
- ఉత్తర కోస్తాపై అధిక ప్రభావం
- 42నుంచి 45 డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశం
- 109 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

భగ్గుమంటున్న భానుడు



సాక్షి, విశాఖపట్నం: అదుపు తప్పుతున్న ఉష్ణోగ్రతలతో భానుడు భగ్గుమంటున్నాడు. రానున్న రెండు రోజులు మరింతగా ఉగ్రరూపం దాల్చనున్నాడు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో కొన్నిచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరువలో నమోదవుతున్నాయి. ఇన్నాళ్లు రాయలసీమలోనే ఉష్ణోగ్రతలు అత్యధికంగా రికార్డయ్యాయి. శుక్ర, శనివారాల్లో ఉత్తర కోస్తాలో అంతకు మించి నమోదు కానున్నాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం శుక్ర, శనివారాల్లో రాయలసీమలోని వైఎస్సార్, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో గరిష్టంగా 41 నుంచి 43 డిగ్రీలు, దక్షిణ కోస్తాలోని పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో 41నుంచి 44, ఉత్తర కోస్తాలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో 41నుంచి 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయి. శుక్రవారం రాష్ట్రంలోని 109 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 206 మండలాల్లో వడగాడ్పులు, శనివారం 115 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 245 మండలాల్లో వడగాడ్పులు వీయనున్నాయి.

చాగలమర్రిలో 44.1 డిగ్రీలు

కాగా, గురువారం నంద్యాల జిల్లా చాగలమర్రిలో 44.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. చిన్నచెప్పల్లి (వైఎస్సార్)లో 43.9, లద్దగిరి (కర్నూలు)లో 43.8, దరిమడుగు (ప్రకాశం)లో 43.6, తెరన్నపల్లి (అనంతపురం)లో 43.5, మనుబోలు (నెల్లూరు), చియ్యవరం (తిరుపతి)లలో 43.2, కుటగుల్ల (శ్రీసత్యసాయి)లో 43.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 18 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. 21 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 97 మండలాల్లో వడగాడ్పులు వీచాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ఆర్.కూర్మనాథ్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో రానున్న మూడు రోజులు వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం నెలకొంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

జనసేనకు గాజు గ్లాసు గుర్తు ఇవ్వడం సరికాదు

- హైకోర్టుకు నివేదించిన రాష్ట్రీయ కాంగ్రెస్ పార్టీ
- తీర్పు రిజర్వ్ చేసిన న్యాయస్థానం

సాక్షి, అమరావతి: జనసేన పార్టీకి గాజు గ్లాసు గుర్తు కేటాయింపులో ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ దాఖలు చేసిన వ్యాజ్యంలో గురువారం వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది ఎంవీ రాజారాం వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్, జనసేన గుర్తింపు లేని రిజిస్టర్డ్ పార్టీ నిర్వచనం పరిధిలోకి వస్తాయన్నారు. గాజు గ్లాసు గుర్తు కోసం తాము గత ఏడాది డిసెంబర్ 20న దరఖాస్తు చేశామన్నారు. ముందు ఎవరు వస్తే వారికే గుర్తు కేటాయింపు అన్న ప్రాతిపదికన తమకే ఆ గుర్తు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం అందుకు విరుద్ధంగా వ్యవహరించిందన్నారు. జనసేన తరఫున సీనియర్ న్యాయవాది వి.వేణుగోపాలరావు వాదనలు వినిపిస్తూ.. నిబంధనలకు అనుగుణంగానే తాము గాజు గ్లాసు గుర్తు కోసం దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఎవరు ముందు వస్తే వారికే అన్న ప్రాతిపదికన ఎన్నికల సంఘం గాజు గ్లాసు గుర్తును తమకు కేటాయించిందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున న్యాయవాది శివదర్శన్ వాదనలు వినిపిస్తూ.. జనసేన పార్టీకి నిబంధనలకు అనుగుణంగానే గాజు గ్లాసు గుర్తును కేటాయించామని తెలిపారు. జనసేన దరఖాస్తు చేసుకున్న కొద్దిరోజుల తరువాత రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ గాజు గ్లాసు గుర్తు కోసం దరఖాస్తు చేసుకుందని వివరించింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా ఆయనకే చెందుతుంది. మరియు పరలోకంలో కూడా సర్వస్తోత్రాలకు అర్హుడు ఆయనే! ఆయన మహా వివేకవంతుడు, సర్వం తెలిసిన వాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 5 ఏప్రిల్ 2024

వృద్ధ జంబూకం 'నాటో'

రెండు ఖండాలను కలుపుతూ ప్రపంచానికి శాంతినీ, సుస్థిరతనూ, రక్షణనూ వాగ్దానం చేస్తూ బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో ఏర్పడిన నాటో కూటమి గురువారం తన 75 వసంతాల సంబరాలను జరుపుకొంది. అయితే ప్రకటిత సంకల్పానికీ, దశాబ్దాల దాని ఆచరణకూ ఎక్కడా పొంతన కనబడదు. నాటో నేపథ్యం, దాని ఉద్దేశాలు పూర్తిగా కొట్టిపారేయదగ్గవి కాదు. ఎందుకంటే రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ నియంత అడాల్ఫ్ హిట్లర్ సైన్యాన్ని మట్టికరిపించిన సోవియెట్ యూనియన్ సేనలు తూర్పు యూరప్ దేశాల్లో తిష్ఠవేసి కదల్లేదు. అవి తమవైపు చొచ్చుకు రావొచ్చన్న సందేహం పశ్చిమ యూరప్ దేశాలకుంది. తాము ఒక్కటై ఎదిరించకపోతే దురాక్రమణకు బలి కావటం ఖాయమన్న భయం వాటికి పట్టుకుంది. నాటి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ దీన్ని చక్కగా వినియోగించుకుని ఉత్తర అమెరికా ఖండంలో తన పొరుగు దేశమైన కెనడాను కలుపుకొని పశ్చిమ యూరప్ దేశాలతో జతకట్టి పటిష్ఠమైన సైనిక కూటమి నాటోకు అంకురార్పణ చేశారు. సోవియెట్ సేనలకు వ్యతిరేకంగా దృఢమైన సైనిక కుడ్యం ఏర్పర్చటమే దీని ప్రధాన ధ్యేయం. నాటో దేశాలు రోజూ పరస్పరం సంభాషించుకుంటాయని, పరిస్థితులను సమీక్షించుకుంటూ నిరంతర సంసిద్ధతలో వుంటాయని, తగిన నిర్ణయాలు తీసుకుంటాయని నాటో వెబ్‌సైట్ ఘనంగా చెబుతోంది. మంచిదే. కానీ ఇన్నేళ్ల దాని ఉనికిలో ఒక్కసారైనా సోవియెట్ యూనియన్ నుంచీ లేదా దాని ప్రస్తుత రూపమైన రష్యా నుంచీ ప్రత్యక్షంగా కావొచ్చు... పరోక్షంగా కావొచ్చు ఏనాడూ సవాళ్లు ఎదురు కాలేదు. సైనిక కూటమి ఆవిర్భావం దానికదే ప్రత్యర్థిని హద్దు మీరకుండా చేసివుండొచ్చన్న వాదన కూడా కొట్టి పారేయలేం. కానీ నాటో హడావిడి గమనించాక 1955లో సోవియెట్ యూనియన్ సైతం తన ఆధ్వర్యంలోని తూర్పు యూరప్ దేశాలను కలుపుకొని వార్సా కూటమి పేరుతో మరో సైనిక కూటమి నిర్మించింది. ఇరుపక్షాలూ అణ్వాయుధాలనూ, ఇతర భారీ ఆయుధ సామగ్రిని మోహరించటంతో ప్రచ్ఛన్న యుద్ధ దశలో యూరప్ ఖండం మొత్తం నిరంతర యుద్ధ భయంతో వణికింది. మరి ప్రపంచ శాంతి, సుస్థిరతల జాడెక్కడ?

పరస్పర మోహరింపులతో నెలకొన్న ఒక రకమైన స్తబ్దతను శాంతిగా భావించటం సాధ్యమేనా? నాటో అంచనాకు తగ్గట్టు సోవియెట్ సేనలు దండయాత్రలు చేయకపోలేదు. 1956లో హంగరీ, 1968లో జెకొస్లోవేకియా, 1979లో అఫ్గానిస్తాన్ దేశాలను అవి దురాక్రమించాయి. కానీ యూరప్ ఖండంలోని తటస్థ దేశాలు ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, స్వీడన్, యుగోస్లేవియా, ఆస్ట్రియా వైపుగానీ... నాటో దేశాలవైపుగానీ చొచ్చుకొచ్చే ఆలోచన చేయలేదు. నిజానికి తాను కూడా నాటోలో చేరతానన్న సోవియెట్ యూనియన్ వినతిని 1954లో తోసిపుచ్చాకే వార్సా కూటమి ఏర్పడింది. 1989లో సోవియెట్ పతనం, అంతకుముందే తూర్పు యూరప్ దేశాలు ఒక్కొక్కటిగా దాన్నుంచి దూరం జరగటం, వార్సా కూటమి కనుమరుగవటం వంటి పరిణామాల తర్వాత వాస్తవానికి నాటో అవసరం ఎంతమాత్రం లేదు. చిత్రం ఏమంటే... సోవియెట్ పతనానికి బాటలు పరిచిన నాటి అధ్యక్షుడు గోర్బచెవ్, ఆ తర్వాతకాలంలో ప్రస్తుత రష్యా అధ్యక్షుడు పుతిన్ సైతం నాటోలో చేరటానికి సిద్ధపడ్డారు. కానీ ఆ ప్రతిపాదనను నాటో తోసిపుచ్చింది. అంతేకాదు... ఉభయ జర్మనీల విలీనానికి సహకరించాలంటూ పశ్చిమ యూరప్ దేశాల నేతలు గోర్బచెవ్‌ను అర్థించినప్పుడు ఆయనకొక హామీ ఇచ్చారు. నాటోను ఒక్క అంగుళం కూడా విస్తరించబోమన్నదే ఆ హామీ సారాంశం. కానీ జరిగిందంతా అందుకు విరుద్ధం. సోవియెట్ పతనం నాటికి నాటో సభ్య దేశాలు 16 కాగా, రష్యా అభ్యంతరాలనూ బేఖాతరు చేస్తూ మరో 15 దేశాలను చేర్చుకున్నారు. ఇందులో పూర్వపు వార్సా కూటమి దేశాలున్నాయి. కనీసం తన ఇరుగు పొరుగు దేశాలకు సభ్యత్వం ఇవ్వొద్దన్న రష్యా ప్రతిపాదన సైతం బుట్టదాఖలా అయింది. పొరుగునున్న కెనడా, మెక్సికో దేశాలకు వార్సా కూటమి సభ్యత్వం ఇస్తే అమెరికా చూస్తూ ఊరుకుంటుందా? నాటో పుట్టుకకు దారితీసిన మూలకారణమే మాయమైనప్పుడు విశాల యూరప్ భద్రత కోసం ఒక నూతన వ్యవస్థ ఏర్పాటు చేయటానికి బదులు రష్యాను ఏకాకి చేయాలన్న వ్యూహం వెనకున్న విజ్ఞతేమిటో ఆ కూటమి నేతలు చెప్పగలరా? నిజానికి నాటో చిత్తశుద్ధితో విశాల యూరప్ భద్రతపై దృష్టి సారించివుంటే పుతిన్ ఉక్రెయిన్ దురాక్రమణకు సాహసించేవారు కాదు. యూరప్ ఖండంలో అణ్వాయుధాల బెడద పూర్తిగా సమసిపోయేది.

అసలు ప్రపంచ శాంతి, సుస్థిరతలకు దోహదం కలగటం మాట అటుంచి నాటో వల్ల ప్రపంచానికి వచ్చిన సమస్యలే అధికం. ప్రపంచవ్యాప్తంగా ఇంతవరకూ 200 సైనిక ఘర్షణలు చోటు చేసుకోగా అందులో 20 వరకూ విస్తృతమైనవి. వెళ్లినచోటల్లా విధ్వంసమే తప్ప నాటో సాధించిందేమీ లేదు. ఇందుకు లిబియా, సిరియా, అఫ్గానిస్తాన్, సూడాన్, సోమాలియా వగైరాలను ఉదాహరించవచ్చు. స్థానిక ప్రభుత్వాలను కూలదోసేందుకు విచ్చలవిడిగా మిలిటెంట్ సంస్థలకు నాటో ఆయుధాలందించటం పర్యవసానంగా ఐసిస్ అనే భయంకర ఉగ్రవాద సంస్థ పురుడుపోసుకుంది. కనిపించని శత్రువుపై కత్తి ఝుళిపించటం కోసం నాటో సభ్యదేశాల్లో ప్రతి ఒక్కటీ తమ జీడీపీల్లో 2 శాతం నాటోకు అర్పిస్తున్నాయి. తన ఉనికి కోసం శత్రువును 'సృష్టించుకునే' ధోరణి నుంచి నాటో బయటపడనంతకాలం ఈ పరిస్థితి మారదు. ప్రపంచంలో శాశ్వత శాంతి కోసం ప్రయత్నించటమా... నిరంతరం యుద్ధ భయంతో అణ్వాయుధాల నీడలో మనుగడ సాగించటమా అన్నది యూరప్ దేశాల ప్రజలే తేల్చుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.9.55 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ధనిష్ఠ ప.3.05 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.9.49 నుండి 11.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.21 నుండి 9.09 వరకు,తదుపరి ప.12.28 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.5.56 నుండి 6.47 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

రాజ్యాంగ స్ఫూర్తికి ప్రమాదం

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

ఎన్నికల వేళ దేశంలో అధికార–ప్రతిపక్ష కూటములు పోటాపోటీగా ప్రకటనలు చేస్తూ తమ విధానాలను ప్రజలకు చెప్పే ప్రయత్నం చేస్తున్నాయి. ఇదే సమయంలో అధికార బీజేపీ ఏకంగా బలమైన ప్రతిపక్ష నాయకులపై కేసులు బనాయించి జైళ్లలోనూ పెడుతోంది. ఇందుకు కేజ్రీవాల్ అరెస్ట్ ఉదంతం తాజా ఉదాహరణ. దీనిపై ప్రతిపక్ష కూటమి భగ్గుమంటోంది. బీజేపీ ఈ సారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దుచేసినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని వారు అంటున్నారు. ఉత్తరప్రదేశ్‌తో సహా దేశంలో అనేక చోట్ల దళితులపై జరుగుతున్న దాడులూ, కర్ణాటక బీజేపీ నాయకుడు అనంత కుమార్ హెగ్డే 'బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తాం' అని ప్రకటించడం వంటివన్నీ చూస్తుంటే ఆందోళన కలుగుతోంది.

ప్రతిపక్షాల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే క్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కేంద్రం అరెస్టు చేసింది. ఎన్నికల ముందు ఇలా ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం గురించి ప్రపంచ దేశాలు విస్తుబోయాయి. ఇది కేవలం రాజకీయ కక్షతో చేసిన అరెస్టేనని ప్రపంచ దేశాలు ముఖ్యంగా అమెరికా, జపాన్‌లు వ్యాఖ్యానించటం గమనార్హం. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ ఢిల్లీ ర్యాలీలో మాట్లాడుతూ 'దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాలకు మేలు చేయబట్టే నా మీద బీజేపీ దాడులకు దిగింద'ని వక్కాణించారు. కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ ఢిల్లీ రామ్ లీలా మైదానంలో జరిగిన సభలో మాట్లాడుతూ... నిర్విరామ విద్యుత్ సరఫరా, పేదలకు ఉచిత విద్యుత్తు, ప్రభుత్వ బడులు బలోపేతం, మొహల్లా క్లినిక్‌లు, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, రైతులకు కనీస మద్దతు ధర, ఢిల్లీకి రాష్ట్ర హోదా వంటి అనేక హామీలతో కేజ్రీవాల్ జైలు నుంచి ఒక లేఖ పంపినట్టు ప్రకటించారు. ఇటువంటి హామీలను బీజేపీ ప్రభుత్వం ఇవ్వగలదా అని ప్రశ్నించారు. బీజేపీ 400 సీట్లు వస్తాయని బీరాలు పలుకుతుందనీ, 180 సీట్లన్నా తెచ్చుకోగలదా? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని రద్దు చేసే కుతంత్రంలో భాగంగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయని, మాట్లాడే స్వేచ్ఛను కాలరాయడం, నియంతృత్వ రాజ్యాన్ని తీసుకురావడం, ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు పరచడం వంటివి బీజేపీ వ్యూహమనీ ఆయన అన్నారు. నియంతలను గద్దె దించటం ఎలాగో ప్రజలకు తెలుసనీ పేర్కొన్నారు.

నిజానికి బీజేపీ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా దక్షిణాది రాష్ట్రాల మీద... ముఖ్యంగా తమిళనాడు సామాజిక సాంస్కృతిక అస్తిత్వం మీద దాడిచేస్తోంది. కులాంతర వివాహాలకు రక్షణ కల్పించడం, 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం మీద బీజేపీ అసహనంగా ఉంది. సనాతన ధర్మాన్ని నిరాకరించి అధునాతన ధర్మానికీ, రాజ్యాంగ పరిరక్షణకూ పూనుకునే కార్యక్రమాలు నిర్వహించడం మీద బీజేపీ ఆగ్రహంగా ఉంది.

ఎన్నికల వేళ నరేంద్ర మోదీ 'కచ్చతీవు' అంశాన్ని ప్రస్తావించడంపై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జయరాం రమేష్‌లు తగిన విధంగా స్పందించారు. 1974లో కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చతీవు (దీవి)ని శ్రీలంకకు అప్పగించిందని మోదీ ఆరోపించారనీ, మరి 2015లో బంగ్లాదేశ్‌తో ఎన్డీఏ ప్రభుత్వం చేసుకున్న భూమి సరిహద్దు ఒప్పందంలో భాగంగా 1051 ఎకరాల భారత భూభాగం కోల్పోవాల్సి వచ్చింది కదా అని జయరాం రమేష్ గుర్తు చేశారు. మొత్తం 17,161 ఎకరాల భారత భూభాగంలో 7,110 ఎకరాలు మాత్రమే మనకు వచ్చాయి అన్నారు. ఆ సమయంలో మోదీపై ఆరోపణలు చేయకుండా పార్లమెంటు ఉభయసభల్లో బిల్లుకి కాంగ్రెస్ మద్దతునిచ్చిందని వెల్లడించారు. తమిళనాడులో వారికి ఒక్క సీటు కూడా రాకపోవడం బీజేపీ వర్గాలను కలవరపెట్టిందని విమర్శించారు. తమిళనాడులో వస్తున్న సామాజిక ఆర్థిక పరిణామాలను తట్టుకోలేక మోదీ 'కచ్చతీవు' ప్రస్తావన తెచ్చారని అన్నారు. 1974లో సిరిమావో బండారు నాయకే– ఇందిరా గాంధీ మధ్య కుదిరిన ఒప్పందం కారణంగా శ్రీలంక నుండి ఇందిరా గాంధీ చాతుర్యం వల్ల ఆరు లక్షల మంది తమిళ భారతీయులు స్వదేశానికి రాగలిగారని ఆయన వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం దక్షిణ భారతదేశంలో వస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల చైతన్యానికి బెదిరి ఎప్పటివో సరిహద్దు విషయాలను ముందుకు తెచ్చి లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. బిహార్ ఓబీసీ రాజకీయ నాయకులు తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఓబీసీ నాయకుల్ని బతకనివ్వటం లేదనీ, తన తల్లి, తండ్రి, తోబుట్టువులపై కేసులు పెట్టి వేధిస్తున్నారనీ, ఆర్ఎస్ఎస్ భావజాలం ప్రకారం ఓబీసీలు అంటే శూద్ర బానిసలనీ, వారు రాజ్యపాలనకు పనికిరారనేది వారి భావ జాలం అన్నారు.



బీజేపీ ప్రభుత్వం ఏ గిరిజనుల, దళితుల, బీసీల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తోందో, మాట్లాడుతోందో వారే నిజానికి సామాజిక ఉత్పత్తి శక్తులు. భారతీయ గిరిజనులు మన ప్రకృతినీ, సంస్కృతినీ రక్షించినవారు. దళితులు నదీ నాగరికతను సృష్టించినవారు. వీరి శ్రమ లేనిదే భారతదేశ సంపద లేదు. ఎవరు సంపద సృష్టిస్తున్నారో వారి రక్షణ కోసమే భారత రాజ్యాంగం రాయబడింది.

ప్రధాని దేశంలో సామాజిక, సాంస్కృతిక, పారిశ్రామిక, విద్యా వ్యవస్థలను విస్తృతం చేయాలనే పథకాలను రూపొందించుకోలేక పోతున్నారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా విభాగం సీట్లన్నీ తగ్గించేశారు. ఎస్సీలకు ఇస్తున్న ఉపకార వేతనాలను తగ్గించేశారు. ఇకపోతే మహిళా సంక్షేమ పథకాల అమలులో మోదీ ప్రభుత్వం ఈ పదేళ్ళ కాలంలో ఘోరంగా విఫలమయ్యింది. బడ్జెట్‌లోనూ మోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమ పథకాల కేటాయింపును తగ్గించింది. 5 కీలక మహిళల సమస్యల పరిష్కారంలో విఫలమైంది. 2023 – 24 కేంద్ర బడ్జెట్‌లో అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళల భద్రత, శిశు సంరక్షణ సంస్థలకు బీజేపీ ప్రభుత్వం కేవలం 0.55 శాతం నిధులు మాత్రమే కేటాయించింది.

వాచాలత్వం నుండి, ఆధిపత్యం నుండి, అణచివేత నుండి, హింస నుండి ఉత్పత్తి జరగదు. ఉత్పత్తి జీవులు అయిన గిరిజనులు, దళితులు చెట్టును ప్రేమిస్తారు, నదిని ప్రేమిస్తారు, భూమిని ప్రేమిస్తారు, గాలిని ప్రేమిస్తారు. భారతదేశం ప్రకృతి జీవులది. పెట్టుబడి దారీ సామ్రాజ్యవాద శక్తులు వీరి శ్రమను దోపిడీ చేసి అభివృద్ధి చెందుతున్నాయి. ఎవరి శ్రమ దోచుకుంటున్నారో వారిపై అరాచకాలు చేస్తున్నారు. బీజేపీ పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల ఆరుగురు యువకులు ఒక దళిత బాలికపై (16 ఏళ్ళు) లైంగిక దాడి చేశారు. వారిపై కేసు పెట్టినందుకు ఆమెను వారు అగ్నిలో దహించారు. ఇటు వంటి పాలకులను అందిస్తున్న బీజేపీకి చెందిన కర్ణాటక నాయకుడు అనంత కుమార్ హెగ్డే 'బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తాం' అని ప్రకటించడం ముందు ముందు ఏమి జరగను న్నదనే సంగతిని సూచిస్తోంది.

ఇకపోతే ఇండియా కూటమి కూడా అంబేడ్కర్‌ని ముందు పెట్టుకోకుండా వెళితే రాజ్యాంగాన్ని రక్షించలేదు. భావ ప్రకటనా స్వేచ్ఛ ఇక ప్రజలకు ఉండదు. రాజ్యాంగంలోని 'ప్రవేశిక' 'భారత దేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం'గా ప్రకటించింది. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ దూకుడు చూస్తుంటే ఈ లౌకిక, ప్రజాస్వామ్య భావనలు ప్రమాదంలో పడబోతున్నట్లనిపిస్తోంది. రాజ్యాంగం ప్రాథమిక హక్కులను మనకు ప్రసాదించింది. ఇప్పుడు అవీ ప్రమాదంలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. రాజ్యాంగ 11వ అధికరణం ప్రాథమిక హక్కులను హరించే ఏ శాసనం చెల్లదని చెప్పడం కొంత ఊరటనిస్తోంది. అంబేడ్కర్ ఈ రాజ్యాంగాన్ని రూపకల్పన చేయడానికి తన జీవితాన్ని అంకితం చేశారు. ఈ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి దళిత, బహుజన, ఆదివాసీ మీదా ఉంది.

ఇప్పుడు బీజేపీ పార్టీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన కులతత్వ, మత తత్వవాది. ఇవాళ దక్షిణ భారతదేశం మొత్తం తన అస్తిత్వం కోసం పోరాడుతోంది. ఈ దశలో అంబేడ్కర్ ఆలోచనలతో లౌకిక భారత పునరుజ్జీవనం కోసం బడుగు వర్గాలు, లౌకికవాదులం ఏకమై రాజ్యాంగ స్ఫూర్తినీ, చైతన్యాన్నీ, ప్రతిష్ఠనూ, వ్యక్తిత్వాన్నీ కాపాడే పోరాటంలో భాగస్వాములమవుదాం. విజయం సాధిద్దాం!

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



చిన్నవైతేనే...



స్క్రీన్ ఎంత పెద్దదిగా ఉన్నప్పటికీ, ఫోన్‌లో ఎక్కువ మ్యాటర్ టైప్ చేయాలంటే నాకు ఇబ్బందిగా ఉంటుంది. ఇక అది ఇంగ్లీష్ కాని అక్షరాలైతే ఇంకా కష్టం.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

వాళ్ల అభిప్రాయలే ముఖ్యం



అసహనం అని ఎక్కువగా అరిచేవాళ్లే, ఇతరుల అభిప్రాయాల పట్ల ఎక్కువగా అసహనంగా ఉంటారని 'ఎక్స్' వేదికగా జరిగే వాదనలు మరోసారి పునరుద్ఘాటిస్తుంటాయి.

– నందితా అయ్యర్, రచయిత్రి

అరుదే కదా!



పోలీస్ స్టేషన్‌లో కూర్చుని ఉండగా, ఒక అధికారి నేనెవరినని అడిగారు. మహిళలు అక్రమంగా బనాయించిన కేసుల్లో మగవాళ్ల తరఫున పోరాడుతానని చెప్పగానే, దాదాపుగా కుర్చీలో ఎగిరిపడి, వెంటనే నా నంబరు అడిగి తీసుకున్నారు. 'మేడమ్! మహిళల కోసం పోరాడేవాళ్లను ఎందరినో చూశాను గానీ, మగవాళ్ల కోసం పోరాడేవాళ్లను మొదటిసారి చూస్తున్నా' అన్నారు.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, యాక్టివిస్ట్

స్నేహితులంటే...



మంచి స్నేహితులు దిండ్లవంటి వారు – మనం అలసిపోయినప్పుడు వాటి మీద విశ్రాంతి తీసుకోవచ్చు, బాధగా ఉన్నప్పుడు వాటి మీద కన్నీళ్లు జారవిడువొచ్చు, కోపంగా ఉన్నప్పుడు వాటిని కొట్టొచ్చు, సంతోషంగా ఉన్నప్పుడు హత్తుకోవచ్చు.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త


అదే రాజకీయం



ఐటీ పరిశ్రమలోని 35–45 వయసు వారిలో చాలామందిలో బీపీ, మధుమేహం, బరువు సమస్యలు, డిప్రెషన్ లాంటివి చూస్తుంటాను. 50 ఏళ్ల తర్వాత కూడా కొంతమందే చురుగ్గా ఉండగలుగుతారు. రాజకీయాలు చాలా కఠినతరమైనవి. ప్రయాణాలు, టెన్షన్, డబ్బులు, విచారణలు... అయినా చాలామంది 70ల దాకా బతుకుతారు. కొందరు 90ల దాకా కూడా! ఏంటి వాళ్ల రహస్యం?

– కిరణ్ కుమార్ ఎస్., వ్యాఖ్యాత

ప్రశ్నించే వైఖరి



రాజకీయ నాయకులు, రాజకీయాల మీద సామాన్య మానవుడి దృక్పథాన్ని సోషల్ మీడియా మార్చేసింది. కనీసం తమిళనాడు వరకు ఇది నిజం. జనాలు ఆగ్రహంతో ఉన్నారు. ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నారు. నాయకుల రిక్త వాగ్దానాలను నమ్మడానికి ఎంతమాత్రమూ సుముఖంగా లేరు. అన్ని పార్టీల మీద చాలాచోట్ల నిరసన కనబడుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

నియంత్రణ లేకుండానా?



ఎక్కువమంది పెద్దవాళ్లే తమ స్మార్ట్‌ఫోన్లనూ, సామాజిక మాధ్యమాల సంబంధ వ్యసనాలనూ, ఉద్వేగాలనూ నియంత్రించుకోలేరని అర్థమవుతున్నప్పుడు... ఏకంగా చిన్న పిల్లలకు వాటిని ఏ నియంత్రణలూ లేకుండా అందుబాటులో ఉంచడం అనే ఆలోచన నాకు పిచ్చితనంలా కనబడుతుంది.

– జూజీ, ర్యాపర్

వైజ్ఞానిక వేగుచుక్కలు

ఆధునిక భారత్‌లో తొలి వైద్యురాలు

బ్రిటిష్ సంతతికి చెందిన మేరీ స్కార్లీబ్ బ్రిటిష్ ఇండియాలో మొదటి వైద్యురాలుగా సేవలందించారు. 19 ఏళ్ల వయసులో విలియమ్ స్కార్లీబ్‌ను ప్రేమించి పెండ్లాడారు. భర్త ఇండియాలో ఉద్యోగం చేస్తుండడంతో 1865 డిసెంబర్‌లో మద్రాసు వచ్చేశారు. భారత్‌లో ప్రసూతి సమయంలో స్త్రీల అనారోగ్యం, పురిట్లో తల్లుల మరణాల వంటివాటిని చూసి మంత్రసానిగా శిక్షణ పొందాలని భావించారు. ఇంతలో 1875లో మద్రాసులో మెడికల్ కాలేజీ పెట్టారు. తొలుత అడ్మిషన్ పొందిన నలుగురు మహిళల్లో మేరీ ఒకరు. అలా మూడు సంవత్సరాల కోర్సు 'లైసెన్సియేట్ ఇన్ మెడిసిన్ సర్జరీ మిడ్ వైఫరీ' పూర్తి చేశారు.

తరువాత లండన్ తిరిగి వెళ్లి మెడిసిన్‌లో డిగ్రీ చేసి రావాలని ఆమె నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయం వెనక కీలకమైన విషయమేంటంటే తర్వాత కాలంలో భారతదేశంలో స్త్రీలు మాత్రమే వైద్య సేవలందించే వ్యవస్థల ఏర్పాటుకు దోహదం చేయాలనేది. అదే సమయంలో ఇతర ప్రాంతాల్లో, దేశాల్లో వైద్య సేవలు అందించే రీతిలో శిక్షణను ఇచ్చే సంస్థలు కూడా లండన్‌లో ప్రారంభమయ్యాయి. 1878లో లండన్ రాగానే మేరీ, డాక్టర్ ఎలిజబెత్ గ్యారెట్ ఆండర్సన్‌ను కలిశారు. 1877 దాకా ఈమె ఒక్కరే లండన్‌లో క్వాలిఫైడ్ వైద్యురాలు. అంతేకాదు అప్పటికే (1874) 'లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ వుమన్' ప్రారంభించి ఉన్నారు. 37 ఏళ్ల వయసులో మేరీ 1882 నవంబర్‌లో 'బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ సర్జరీ' ఆనర్స్ డిగ్రీ కోర్సును గోల్డ్ మెడల్‌తో పూర్తి చేశారు. అంతే కాకుండా అనతి కాలంలోనే సర్జరీకి సంబంధించి వియన్నా నగరంలో పురుషులు చేసే కోర్సును కూడా పూర్తి చేశారు. పిమ్మట భారతదేశానికి తిరిగి ప్రయాణం అవుతూ క్వీన్ విక్టోరియాను కలిసి భారత దేశంలో స్త్రీల ఆరోగ్యం, ప్రసూతి సమయంలో వారికి అందించాల్సిన తోడ్పాటు గురించి ఎలిజబెత్ బెల్బేతో కలిసి చర్చించారు. ఈ చర్చే తర్వాతికాలంలో ఇండియాలో 'డఫ్రిన్ ఫండ్' రావడానికి కారణమైంది.



మేరీ స్కార్లీబ్

1883లో మద్రాస్ తిరిగి వచ్చిన మేరీ స్కార్లీబ్ మద్రాస్ మెడికల్ కళాశాలలో 'మిడ్ వైఫ్రీ', 'గైనకాలజీ'లో లెక్చరర్‌గా బాధ్యతలు స్వీకరించి ఐదేళ్లపాటు ఆ విభాగాలలో ఎగ్జామినర్‌గా కూడా సేవలు అందించారు. 1888లో యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లో చేరి మెడిసిన్‌లో ఎమ్‌డీ చేయడమే కాకుండా, ఎలిజబెత్ గ్యారెట్ అండర్సన్ హాస్పిటల్ లో సీనియర్ సర్జన్‌గా 1889 నుంచి ఓ దశాబ్దిన్నర కాలంపాటు సేవ చేశారు. కృత్రిమ సంతాన నిరోధం, విడాకులకు సంబంధించి మేరీ స్కార్లీబ్ చాలా స్పష్టమైన అభిప్రాయాలు కలిగి ఉండేవారు. అలాగే ఫెమినిజానికి సంబంధించి కూడా ఆమె చాలా లోతైన కృషి చేశారు. 'రెమినిసెన్సెస్' పేరున 1924లో ఆటోబయోగ్రఫీ రాయడమే కాకుండా, 'ఏ ఉమెన్స్ వర్డ్స్ టు ఉమెన్', 'ది మదర్స్ గైడ్ టు ది హెల్త్ అండ్ కేర్ ఆఫ్ చిల్డ్రన్' వంటి రచనలు కూడా చేశారు. 85 ఏళ్ల వయసులో 1930 నవంబర్ 21న లండన్‌లో ఆమె కన్నుమూశారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి । 94407 32392

పేదలు పణంగా బాబు రాజకీయం

రాజకీయాల్లో వ్యూహాలు – ప్రతి వ్యూహాలు, ఎత్తుకు పైఎత్తులు వేయటం, ప్రత్యర్థిని దెబ్బతీసి తాము అధికార పగ్గాలు చేపట్టాలనుకోవటం సహజం. దీని కోసం కొంతమంది స్ట్రైట్ పాలిటిక్స్ చేస్తే మరి కొంతమంది నాయకులు వెన్నుపోట్లు, కుట్రలు, కుతంత్రాలతో రాజకీయం చేస్తారు. ఇవి కూడా చర్చనీయాంశమే అయినా... పవర్ కోసం కొట్లాట రాజకీయ పార్టీలు, రాజకీయ ప్రత్యర్థుల మధ్య ఉండటం వరకు సమర్థించవచ్చు. కాని స్వార్థం హద్దులు దాటి అధికారం కోసం, ప్రత్యర్థిని దొంగ దెబ్బ తీయటం కోసం ప్రజల ప్రాణాలను సైతం పణంగా పెట్టాలనుకోవటం, బలహీన వర్గాల ప్రజలతో చెలగాటం ఆడే కుట్రలు... ఏ మాత్రం సహించదగినవి కాదు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కూటమి ఇప్పుడు ఇటువంటి ప్రమాదకర రాజకీయ క్రీడకు తెర తీశారు.

వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, తీవ్ర అనారోగ్యగ్రస్థులకు వారి ఇంటి దగ్గరే వాలంటీర్లు పెన్షన్ అందించే విధానాన్ని చంద్రబాబు అడ్డుకున్నారు. తన జేబులోని మనిషి, తన సామాజిక వర్గానికి చెందిన నిమ్మగడ్డ రమేష్ కుమార్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి వాలంటీర్లు పెన్షన్లను లబ్ధిదారులకు పంచకూడదని ఫిర్యాదు చేయించారు. వీరి ఫిర్యాదుకు అనుగుణంగా ఈసీ ఆదేశాలు ఇవ్వటంతో ఇప్పుడు 66 లక్షల మంది పెన్షనర్లు మూడు నెలల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి వచ్చింది.

రాష్ట్ర చరిత్రలో, బాబు హయాంలో పెన్షన్ల కోసం ప్రభుత్వ ఆఫీసుల వద్ద పండుటాకులు ఎలా పడిగాపులు పడేవారో పత్రికల్లో ఫోటోలతో సహా వార్తలు నిత్యం వస్తూ ఉండేవి. వారం, పది రోజుల పాటు చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేది ఆ రెండు వందల రూపాయల పెన్షన్ కోసం. పూట గడవని స్థితిలో బడుగు బలహీన వర్గాలకు చెందిన అవ్వా తాతలు అలానే అంతటి కష్టాన్నీ భరించేవారు. కాస్త కాలు చేయి బాగానే ఉన్నవారు సరే. మరి మంచాన పడిన వారు, నాలుగడుగులు కూడా వేయలేని వారు, ఆసరా లేకుండా నిలబడ



లేని వారి పరిస్థితిని ఊహించగలమా?

జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత లక్షలాది మంది నిస్సహాయులను ఇటువంటి దుస్థితి నుంచి బయటపడేశారు. పెన్షన్ కోసం మంచం దిగాల్సిన అవసరం రాకుండా సగౌరవంగా వాలంటీర్లే లబ్ధి దారుల ఇళ్ళకు వెళ్ళి అవ్వా, తాతల చేతుల్లో పెట్టే విధంగా వాలంటీర్–సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చారు. అది కూడా ఫస్ట్ తేదీనే, కోడి కూయక ముందే! ఇప్పుడు అక్షరాల 3 వేల రూపాయల పెన్షన్ 66 లక్షల మందికి అందుతోంది. వృద్ధులనే కాదు వికలాంగులు, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్థులు, క్యాన్సర్ వంటి తీవ్ర రోగాల పాలైన వారిని కూడ ప్రభుత్వం పెన్షన్ ఇచ్చి ఆదుకుంటోంది. గంటల కొద్దీ క్యూ లైన్లలో నిలబడేందుకు వీరి ఆరోగ్యం సహకరించదు. ఓ వైపు మండుతున్న ఎండలను తట్టుకునే శక్తీ ఉండదు. చంద్రబాబు చేసిన కుట్ర వల్ల మంచాన పడిన వారు కూడా పెన్షన్ కోసం సచివాలయం చుట్టూ తిరిగాల్సిన దుస్థితి ఏర్పడింది.

వాలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు ఉన్న భయం, ఆక్రోశం ఇవాళ్టిది కాదు. గత రెండు, మూడేళ్ల నుంచి రాష్ట్ర ప్రజలు చూస్తూనే ఉన్నారు. పట్టుమని పాతికేళ్ల నిండని ఈ పిల్లలను రెడ్ లైట్ ఏరియాకు మహిళలను సరఫరా చేసే బ్రోకర్లుగా, హ్యూమన్ ట్రాఫికర్లుగా, దొంగలుగా పవన్, చంద్రబాబు మొన్నటి వరకు చిత్రించిన విషయాన్ని ఎవరూ మరచిపోలేదు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి చేసిన మంచి వల్ల ప్రజలంతా జగన్‌కే మళ్లీ పట్టం కడతారన్న ఆందోళనతోనే చంద్రబాబు ఇంతటి క్రూరమైన క్రీడకు తెర తీశారు. దీని ద్వారా చంద్రబాబు రెండు విషయాలపై స్పష్టత ఇచ్చారు. రెండున్నర లక్షల మందికి పైగా ఉన్న వాలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయటం మొదటి లక్ష్యం. బడుగు బలహీన వర్గాలకు చెందిన పండుటాకులనూ, నిస్సహాయులనూ మళ్లీ రోడ్డున పడవేసి పెత్తందారీ, దురహంకారపూరిత ఆనందాన్ని పొందటం రెండో లక్ష్యం. వృద్ధులు, నిస్సహాయులను క్షోభ పెడితే ఆ పాపం ఊరకనే పోదు. ఇది నిజం!

– ఆర్ఎస్

ఉండాల్సిన శుద్ధి

ఈ వ్యాపార యుగంలో మనసు ఒకలా చెప్తుంటే, మాటను మరోలా వ్యక్త పరుస్తాం. చెప్పిన మాటకు కూడా విరుద్ధంగా పని చేస్తాము. ఇలా కాకుండా మనసు, మాట, పని ఒకే విధంగా ఉండటాన్ని త్రికరణ శుద్ధి అంటారు. అంటే మనసులో ఏముందో అదే మాటల్లోనూ చెప్పాలి; మాటల్లో ఏది వ్యక్తం చేశామో అదే మన చేతల్లో కూడా ఉండాలి.

జ్యోతిర్మయం

ఇప్పటి ఈ సమాజంలో ఇలా బతకడం చాలా కష్టంగానే ఉందని చాలామంది భావిస్తుంటారు. కానీ–

యథా చిత్తం తథా వాచో యథా వాచస్తథా క్రియా!
చిత్తే వాచి క్రియాయాం చ సాధూ నామేకరూపతా!!

సజ్జనులు మనసా వాచా కర్మణా ఒకే భావాన్ని కలిగి ఉంటారు అని పూర్వీకులు చెప్పారు. కానీ మనం లౌకిక వ్యవహారాల్లో మన మనసుపై ముసుగు వేసి మెలుగుతాము. ఉన్నది ఉన్నట్టు చెపితే బంధాలు పోతాయి అని భయపడతాము. మనసుపై, మాటలపై, పనులపై మనం వేసుకున్న ముసుగులు అవతలి వారికి తెలిసీ వారూ అలాగే ఉండటం దౌర్బల్యం. త్రికరణ శుద్ధి లేకుండా స్వార్థంతో జీవించడమే సమాజ పతనానికి కారణం.

– ధనిష్ఠ

ముస్లింలకు 'కూటమి' అన్యాయం

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్ మీరా



సాక్షి, అమరావతి: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి రాష్ట్రంలో ముస్లింలకు తీవ్ర అన్యాయం చేశాయనే విషయాన్ని గమనించాలని ఏపీ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా ముస్లిం సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలతో ఆయన గురువారం లేఖ విడుదల చేశారు. చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్ కలిసి ముస్లింలకు చేసిన రాజకీయ అన్యాయానికి మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఈ మూడు పార్టీల కూటమి కలిసి పోటీ చేస్తున్న 25 ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా ముస్లింలకు కేటాయించలేదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ముస్లింలకు రాజ్యసభ సీటు ఇస్తామనే హామీని కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పోటీచేస్తోన్న 144 అసెంబ్లీ స్థానాల్లో 3 మాత్రమే ముస్లింలకు కేటాయించిందని, జనసేన, బీజేపీలు ఒక్కటి కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. 4శాతం ఉన్న కమ్మ సామాజిక వర్గానికి 32 సీట్లు ఇచ్చి, 10 శాతం పైగా ఉన్న ముస్లింలకు 3 అసెంబ్లీ సీట్లు మాత్రమే ఇవ్వడం సామాజిక అన్యాయమేనన్నారు.

శ్రీ సిమెంట్ ఉత్పత్తి షురూ

దాచేపల్లిలో రూ.2,500 కోట్లతో యూనిట్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో భారీ పరిశ్రమ వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించింది. ప్రభుత్వ సహకారంతో నిర్దేశించుకున్న లక్ష్యం కంటే 6 నెలల ముందుగానే ఉత్పత్తి ప్రారంభించడం ద్వారా శ్రీ సిమెంట్ రికార్డు సృష్టించింది. గతేడాది విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఒప్పందం చేసుకున్న శ్రీ సిమెంట్ రికార్డు సమయంలోనే యూనిట్‌ను సిద్ధం చేసింది. పల్నాడు జిల్లా దాచేపల్లి వద్ద రూ.2,500 కోట్లతో ఏర్పాటు చేసిన సిమెంట్ పరిశ్రమ వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించినట్టు శ్రీ సిమెంట్ మేనేజింగ్ డైరెక్టర్ నీరజ్ అకోరే ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించకుండానే ఉత్పత్తిని ప్రారంభించినట్టు కంపెనీ అధికారులు వెల్లడించారు. ఏటా 3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన దాచేపల్లి యూనిట్‌తో శ్రీ సిమెంట్ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 56.4 మిలియన్ టన్నులకు చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర అవసరాలను తీర్చేవిధంగా దాచేపల్లిలో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు శ్రీ సిమెంట్ ప్రకటించింది. ఈ యూనిట్ రాకతో మొత్తం 2,000 మందికి ఉపాధి లభించిందని, ఇందులో అత్యధికంగా స్థానిక యువతకే ప్రాధాన్యతను కల్పించామని పేర్కొంది.

దేశంలోనే తొలి పర్యావరణహిత యూనిట్

పూర్తిగా పర్యావరణహితంగా అత్యంత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి దాచేపల్లి యూనిట్ నిర్మించినట్టు నీరజ్ తెలిపారు. ఈ యూనిట్‌కు అవసరమయ్యే ఇంధన వినియోగంలో 30 శాతం మునిసిపల్ వ్యర్థాలు, బయోమాస్‌తో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించి 30 శాతం విద్యుత్‌ను మాత్రమే వినియోగిస్తున్న తొలి సిమెంట్ యూనిట్‌గా దాచేపల్లి రికార్డులకు ఎక్కింది. అదేవిధంగా సున్నపురాయి తవ్వకాన్ని కూడా ప్రయోగాత్మకంగా చేపట్టడం ద్వారా ఇంధన పొదుపు చేస్తున్నట్టు తెలిపారు. భూ మట్టానికి 40 అడుగుల దిగువన సున్నపురాయి క్రషింగ్‌ను చేపట్టడం ద్వారా డీజిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించగలిగినట్టు వివరించారు.



భారీగా విస్తరణ

భంగర్‌బ్రాండ్ పేరుతో శ్రీ సిమెంట్ భారీ విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా మరో 13 యూనిట్లను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం ఏడాదికి 56.4 మిలియన్ టన్నులుగా ఉన్న సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 2028 నాటికి 80 మిలియన్ టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా 2025 నాటికి మరో 5 యూనిట్లను వాణిజ్యపరంగా ఉత్పత్తిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.



నా సంగతి మీకు తెలీదు.. తనిఖీలు ఆపి వెంటనే వెళ్లండి

టైల్స్‌షాప్‌లో తనిఖీ చేస్తున్న డీఆర్ఐ అధికారులపై సీఎం రమేష్ దౌర్జన్యం

చోడవరం: 'ఎవరు మీరు? ఎందుకొచ్చారు? ఎవరు పంపిస్తే వచ్చారో నాకు తెలుసు. అసలు ఇలాంటి షాపుల్లో తనిఖీలు చేయాలని మీకు ఎవరు చెప్పారు? పెద్ద పెద్ద మాల్స్‌ను వదిలేసి ఇలాంటివాటిపై పడతారా? వెంటనే ఇక్కడి నుంచి వెళ్లకపోతే బాగుండదు. నా సంగతి మీకు తెలీదు' అంటూ అనకాపల్లి టీడీపీ, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి సీ.ఎం. రమేష్ విధి నిర్వహణలో ఉన్న అధికారులపై తన అనుచరులతో కలసి దౌర్జన్యానికి దిగారు. వారి చేతిలో ఉన్న ఫైళ్లు లాక్కుని వారిపై విరుచుకుపడి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. ఒక దశలో అధికారుల చేతులను తోసేసి గూండాయిజం చేశారు. ఏక వచనంతో సంబోధించి అధికారులపై బెదిరింపులకు తెగబడ్డారు. తానేంటో... తన సహజ ధోరణి ఏంటో ఈ సంఘటన ద్వారా ఆయన స్థానికులకు రుచిచూపించారు. ప్రశాంతమైన అనకాపల్లి జిల్లాలో ఇలాంటి సంఘటనలు గతంలో ఎన్నడూ చూడని అక్కడి ప్రజలు ఆయన రౌడీయిజం చూసి భయభ్రాంతులకు లోనయ్యారు. ఇప్పుడే ఈయన ప్రవర్తన ఇలా ఉంటే ఇక ఆయన్ని గెలిపిస్తే ఇక తమను బతకనిస్తారా అంటూ అక్కడివారు గుసగుసలాడుకోవడం వినిపించింది. చోడవరం మండలం గాంధీ గ్రామంలో గురువారం చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

జీఎస్టీ రికార్డులు తనిఖీ చేస్తుండగా...

గాంధీ గ్రామంలో బుచ్చిరాజు అనే టీడీపీ సానుభూతిపరుడు హోల్‌సేల్ టైల్స్, మార్బుల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. దానిపై డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం(డీఆర్ఐ) అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆరుగురితో కూడిన ఓ బృందం గురువారం తనిఖీలు నిర్వహిస్తోంది. జీఎస్టీ సక్రమంగా కట్టడం లేదంటూ షాపు రికార్డులన్నీ వారు తనిఖీ చేస్తుండగా టైల్స్ వ్యాపారి బుచ్చిరాజు స్థానిక టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు, అనకాపల్లి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు ఫోన్ చేశారు. వెంటనే వారిద్దరూ తమ అనుచరులతో టైల్స్ షాపు దగ్గరకు చేరుకున్నారు. అధికారుల దగ్గర్నుంచి రికార్డులను సీఎం రమేష్ లాక్కున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా తనిఖీలు చేస్తారంటూ వారిపై దౌర్జన్యానికి దిగారు. అంతేనా అధికారులని కూడా చూడకుండా పరుషపదజాలంతో వారిపై విరుచుకుపడ్డారు.

టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు

తన వెంట తీసుకొచ్చిన కార్యకర్తలను రెచ్చగొట్టి, దౌర్జన్యానికి మరింత పురిగొల్పేలా ప్రవర్తించారు. రాష్ట్ర ప్రభుత్వంపైనా, స్థానిక ఎమ్మెల్యేపైనా విమర్శలు చేయడంతో అక్కడి వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది. ఇంతలో సమాచారం అందుకున్న స్థానిక పోలీసు సీఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో వచ్చి పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు వచ్చాక కూడా సీఎం రమేష్ అధికారులను బెదిరించడం మానలేదు. దాడులు ఆపే వరకూ ఇక్కడే ధర్నా చేస్తామంటూ హెచ్చరించారు. తమ షాపు అద్దాలను అధికారులు పగలగొట్టారని, కౌంటర్‌లో ఉన్న రూ.25 లక్షలు నగదు తీసుకున్నారంటూ షాపు యజమాని బుచ్చిరాజు సీఎం రమేష్‌కు చెప్పడం, ఆయన అధికారులపై మరింత రెచ్చిపోయి ఆ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడం మరింత ఉద్రిక్తతకు దారితీసింది. అధికారులు మాత్రం తనిఖీలు ఆపబోమని చెప్పగా.. పరిస్థితి అదుపు తప్పేట్టు వుందని స్థానిక పోలీసులు చెప్పడంతో డీఆర్ఐ అధికారుల బృందం అక్కడ నుంచి వెళ్లిపోయింది.

పోలీసులకు ఫిర్యాదు

జరిగిన సంఘటనపై డీఆర్ఐ అధికారులు చోడవరం పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి, చోడవరం పోలీసు స్టేషన్‌లో డీఆర్ఐ అధికారులతో మాట్లాడారు. వారి ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. కాగా ఎన్నడూ ఇలాంటి దౌర్జన్యకర సంఘటనలు చూడని స్థానికులు సీఎం రమేష్ ప్రవర్తనపై ఏవగించుకున్నారు.


డీఆర్ఐ అధికారులతో వాగ్వాదం చేస్తున్న కూటమి అభ్యర్థులు సీఎం రమేష్, రాజు

డ్యూటీకి అడ్డురావద్దని కోరినా..

తమ డ్యూటీ తమను చేసుకోనివ్వాలని డీఆర్ఐ అధికారులు ఎంత చెప్పినా వినిపించుకోకుండా వారిపై గూండాగిరీ ప్రదర్శించారు. అసలు 'మిమ్మల్ని ఎవరు పంపించారు' అంటూ అధికారులపై రుబాబు చేశారు. ఒక దశలో డీఆర్ఐ అధికారి చేయిని సీఎం రమేష్ తోసేసి మరీ హెచ్చరించారు. దాడులు ఆపేసి వెనుదిరిగి వెళ్లే వరకూ తాము ఇక్కడ నుంచి వెళ్లబోమంటూ భీష్మించుకొని కూర్చున్నారు. అక్కడకు వచ్చిన టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ అధికారులను నానా దుర్భాషలాడారు. తమ డ్యూటీని అడ్డుకోవడం సరికాదని, ఎవరి ఒత్తిళ్లతో తాము తనిఖీలకు రాలేదని, తమ విధి నిర్వహణలో భాగంగానే వచ్చామని అధికారులు ఎంత చెబుతున్నా వినకుండా అధికారులను బెదిరించి పెద్దపెద్దగా అరుస్తూ వారిపై దౌర్జన్యానికి దిగారు. ఆయన ప్రవర్తనతో హతాశులైన అధికారులు భయభ్రాంతులకు గురయ్యారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేశ్ రెడ్డి, జస్టిస్ మన్మథరావు, జస్టిస్ రఘునందన్‌రావు, జస్టిస్ హరినాథ్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈఓ ఎస్.రమేశ్ బాబుఅమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.


జస్టిస్ సురేశ్ రెడ్డి, జస్టిస్ మన్మథరావుకు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న ఈఈ కోటేశ్వరరావు


ఆశీర్వచన మండపంలో జస్టిస్ హరినాథ్, జస్టిస్ రఘునందన్‌రావు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, సినీనటి రుక్సర్ ధిల్లాన్ కూడా శ్రీవారి సేవలో పాల్గొన్నారు.


ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో జస్టిస్ గోపాలకృష్ణ

అగ్ని ప్రైమ్ బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: దేశీయంగా అభివృద్ధి చేసిన నూతన తరం 'అగ్ని ప్రైమ్' బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ), స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్(ఎస్‌ఎఫ్‌సీ) సహకారంతో భారత సైన్యం అగ్ని ప్రైమ్ మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా సముద్ర తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి బుధవారం రాత్రి ఈ క్షిపణిని పరీక్షించినట్లు రక్షణ శాఖ ప్రకటించింది. అగ్నిప్రైమ్ నిర్దేశిత అన్ని లక్ష్యాలను చేరుకుందని వెల్లడించింది. ఈ మిస్సైల్ అణ్వాయుధాలను మోసుకెళ్లగలదు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద దేశీయంగా అభివృద్ధి చేశారు. ఇది మీడియం రేంజ్ క్షిపణి. దీని స్ట్రైక్ రేంజ్ 1,000 కిలోమీటర్ల నుంచి 2,000 కిలోమీటర్ల దాకా ఉంటుంది. లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించడం అగ్నిప్రైమ్ ప్రత్యేకత. 1,500 నుంచి 3,000 కిలోల దాకా వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లగలదు. బరువు దాదాపు 11,000 కిలోలు. అగ్ని క్షిపణుల శ్రేణిలో ఇది ఆరో క్షిపణి కావడం విశేషం. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే పృథ్వీ, అగ్ని, త్రిశూల్, నాగ్, ఆకాశ్ తదితర క్షిపణులను అభివృద్ధి చేశారు. అగ్ని ప్రైమ్ పరీక్ష విజయవంతం కావడం పట్ల రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఓ, ఎస్‌ఎఫ్‌సీతోపాటు భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. అగ్ని ప్రైమ్ రాకతో మన భద్రతా బలగాలకు మరింత బలం లభిస్తుందని పేర్కొన్నారు. సైంటిస్టులకు ప్రధాన నరేంద్ర మోదీ కూడా అభినందనలు తెలిపారు.

సీబీఎస్ఈ 3, 6వ తరగతులకు కొత్త సిలబస్

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ పాఠశాలల్లో 3, 6వ తరగతుల పాఠ్యప్రణాళిక మారింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుంది. 3, 6వ తరగతులకు కొత్త సిలబస్‌తో పాఠ్య పుస్తకాలను త్వరలో విడుదల చేయనున్నట్లు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) ప్రకటించింది. 3వ తరగతికి సంబంధించిన కొత్త పుస్తకాలను ఏప్రిల్ చివరి వారంలో, 6వ తరగతికి సంబంధించిన కొత్త పుస్తకాలను మే మూడో వారంలో విడుదల చేయనున్నట్లు తెలియజేసింది. పుస్తకాల విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది. 4, 5, 9, 11వ తరగతుల పుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. అన్ని పాఠ్య పుస్తకాల డిజిటల్ కాపీలు ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌తో పాటు దీక్షా, ఈ–పాఠశాల పోర్టల్, యాప్‌లలో అందుబాటులో ఉంటాయి.

ఎన్నికల్లో పోటీకి ఎంత కావాలి?

నిర్మల వ్యాఖ్యలతో ఎన్నికల వ్యయంపై చర్చ

- అంత డబ్బు తన వద్ద లేదన్న కేంద్ర మంత్రి
- లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు వేర్వేరు పరిమితులు
- పాటించకుంటే అభ్యర్థులపై అనర్హత వేటే



లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవసరమైన డబ్బులు తన వద్ద లేవని, అందుకే పోటీకి దూరంగా ఉంటున్నానని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల చేసిన ప్రకటన సంచలనమైంది. రాజ్యసభ ఎంపీగా ఉన్న ఆమె గతంలోనూ లోక్‌సభకు పోటీ చేయలేదు. అందుకు బాగా ధన బలం కావాలని తన వ్యాఖ్యల ద్వారా చెప్పకనే చెప్పారు. దాంతో ఎన్నికల వ్యయం మరోసారి చర్చనీయాంశంగా మారింది...

2016లో కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నికైన నిర్మల 2014 నుంచి 2016 దాకా ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. గత రాజ్యసభ ఎన్నికల అఫిడవిట్‌లో ఆమె తన నికర ఆస్తుల విలువను రూ.2.5 కోట్లుగా ప్రకటించారు. అయినా ఎన్నికల్లో పోటీకి సరిపడా డబ్బుల్లేవని స్వయంగా దేశ ఆర్థిక మంత్రే అనడంతో అసలు ఒక అభ్యర్థికి ఎంత డబ్బుండాలన్నది ఆసక్తికరంగా మారింది.

ఎంత కావాలి?

ఎన్నికల ప్రచారానికి పార్టీలు ఎంతయినా ఖర్చు పెట్టొచ్చు. వాటికి పరిమితులేమీ లేవు. కానీ అభ్యర్థులు చేసే వ్యయాలకు మాత్రం పరిమితులున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఒక అభ్యర్థి రూ.95 లక్షలకు మించి ఖర్చు పెట్టకూడదు. అసెంబ్లీ ఎన్నికల్లో గరిష్ఠ వ్యయ పరిమితి రూ.40 లక్షలు. కేంద్రపాలిత ప్రాంతాలు, చిన్న రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలకు రూ.75 లక్షలు, అసెంబ్లీకి రూ.28 లక్షల పరిమితిని కేంద్ర ఎన్నికల సంఘం విధించింది.

ఈ ఎన్నికల వ్యయం రూ.లక్ష కోట్ల పై మాటే!

2019 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రూ.1,264 కోట్లు ఖర్చు చేసినట్టు నాడు బీజేపీ ప్రకటించగా, కాంగ్రెస్ వ్యయం రూ.820 కోట్లుగా ఉంది. వాస్తవానికి ఆ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పార్టీలు, అభ్యర్థులు చేసిన ఖర్చు రూ.60,000 కోట్లు దాటి ఉంటుందని సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ (సీఎంఎస్) అధ్యయనం పేర్కొంది! ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇది ఏకంగా రూ.1.2 లక్షల కోట్లకు చేరుతుందని సంస్థ అంచనా. అంటే ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి సగటున రూ.221 కోట్లు!

ఎందుకు పరిమితి?

ఎన్నికల్లో పోటీ చేసి, గెలిచే అవకాశాలు అందరికీ సమానంగా కల్పించాలన్నదే వ్యయ పరిమితుల్లోని ఉద్దేశ్యం. తద్వారా ధన బలం కలిగిన అభ్యర్థులది పైచేయి కాకుండా ఉంటుంది. నామినేషన్ వేసినప్పటి నుంచి, పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అభ్యర్థి చేసే వ్యయాలను ఈసీ పరిగణనలోకి తీసుకుంటుంది. అభ్యర్థుల బ్యాంక్ లావాదేవీలను, ఖాతా స్టేట్‌మెంట్లను ఈసీ పరిశీలిస్తుంది. వ్యయాలపై ఎన్నికల పరిశీలకుల నిఘా కూడా ఉంటుంది.

ఈసీ గైడ్‌లైన్స్ ఇవీ..

ఎన్నికల వ్యయ పరిమితి అభ్యర్థి ప్రచారానికి సంబంధించినది. ఓటర్లకు చేరువయ్యేందుకు చేసే ఖర్చు ఆ పరిమితిని మించరాదు. ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, ప్రచారం, సభలు, సమావేశాలు, వాహనాల వినియోగం వంటివన్నీ ఇందులోకి వస్తాయి. ద్రవ్యోల్బణం, పెరిగిన ప్రచార ఖర్చు తదితరాలను పరిగణనలోకి తీసుకుంటూ ఎన్నికల వ్యయ పరిమితులను ఈసీ ఎప్పటికప్పుడు సవరిస్తుంటుంది. నియోజకవర్గంలో పెరిగిన ఓటర్ల సంఖ్యను కూడా పరిశీలనలోకి తీసుకుంటుంది. ఎన్నికల వ్యయ పరిమితిని చివరిసారి 2022లో సవరించింది.

పరిమితి దాటితే..?

ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత అసెంబ్లీ ఎన్నికలు అయితే 30 రోజుల్లోపు, లోక్‌సభ ఎన్నికలు అయితే 90 రోజుల్లోపు వ్యయాలకు సంబంధించిన అన్ని ఆధారాలను అభ్యర్థులు ఎన్నికల అధికారులకు అందించాల్సి ఉంటుంది. ఇలా చేయకపోతే ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 10ఏ కింద అభ్యర్థిని మూడేళ్ల పాటు అనర్హుడిగా ప్రకటిస్తారు. ఈసీ నిర్ణయించిన పరిమితికి మించి ఎవరైనా ఖర్చు చేసినట్టయితే వారికి వ్యతిరేకంగా ఎవరైనా ఈసీ ముందు పిటిషన్ దాఖలు చేయవచ్చు. పరిమితికి మించి ఖర్చు చేయడాన్ని ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(6) కింద అవినీతి చర్యగా ఈసీ పరిగణిస్తుంది. అలాంటప్పుడు సెక్షన్ 10ఏ కింద సదరు అభ్యర్థిపై మూడేళ్లపాటు అనర్హత వేటు పడుతుంది.

తొలుత తక్కువే

1952 తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి రూ.25వేల ఖర్చుకే అనుమతించారు. చిన్న రాష్ట్రాల్లోనైతే రూ.10 వేలే. తర్వాత దీన్ని సవరిస్తూ వచ్చారు. చట్టబద్ధమైన వ్యయ పరిమితితో పోలిస్తే, ఒక్కో అభ్యర్థి చేసే వాస్తవ ఖర్చు కోట్లలో ఉంటుందన్నది తెలిసిందే. వందలాది కోట్లు ఖర్చు చేసేవాళ్లూ ఉన్నారు. నగదు, ఇతర కానుకల రూపంలోనూ ఓటర్లను ప్రలోభపెడుతుంటారు. ఇదంతా అనధికారికంగా నడిచే వ్యవహారం.

ఎన్నికల వ్యయ పరిమితి

సంవత్సరం	వ్యయ పరిమితి (రూ.ల్లో) పెద్ద స్థానాలు	చిన్న స్థానాలు
1952	25,000	10,000
1971	35,000	-
1980	1,00,000	-
1984	1.3 లక్షలు-1.5లక్షలు	50 వేలు-లక్ష
1996	4,50,000	-
1998	15,000,00	-
2004	25,00,000	-
2014	70,00,000	-
2022	95,00,000	75,00,000

– సాక్షి, నేషనల్ డెస్క్



ఎన్నికల విచిత్రం

వినూత్న ప్రచారంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. తిరువనంతపురం కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ శశీ థరూర్ గురువారం ఇలా ఆటోలో ఎన్నికల ప్రచారం చేశారు.

ఎలక్షన్ బీట్

రాహుల్ గాంధీకి రూ.20 కోట్ల ఆస్తులు

వయనాడ్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తనకు సుమారు రూ.20 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు వెల్లడించారు. కేరళలోని వయనాడ్ సిట్టింగ్ ఎంపీ అయిన ఈయన మరోమారు అక్కడి నుంచే పోటీ చేస్తున్నారు. బుధవారం రిటర్నింగ్ అధికారికి అందజేసిన నామినేషన్ పత్రాల్లో రాహుల్ తన ఆస్తుల వివరాలను పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.9.24 కోట్ల విలువైన చరాస్తులు, సొంతంగా సంపాదించుకున్న స్థిరాస్తులు మార్కెట్ విలువ ప్రకారం రూ.9 కోట్లని కూడా ఆయన వెల్లడించారు. వారసత్వంగా సంక్రమించిన ఆస్తుల విలువ రూ.2.10 కోట్లని తెలిపారు. తన వద్ద రూ.55 వేల నగదు ఉండగా, రూ.49,79,184 అప్పు ఉందని వెల్లడించారు.

సరైన నిర్ణయం తీసుకోండి

న్యూఢిల్లీ: దేశం కీలక దశలో ఉందని రాహుల్ పేర్కొన్నారు. దేశాన్ని నిర్మించింది ఎవరో, దాన్ని నాశనం చేసింది ఎవరో తెలుసుకోవాలంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజల భవిష్యత్తులో వారి చేతుల్లోనే ఉందని తెలిపారు. ఆలోచించండి.. అర్థం చేసుకోండి.. సరైన నిర్ణయం తీసుకోండి అన్నారు.

కుమారస్వామి ఆస్తులు రూ.217 కోట్లు

బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఆయన భార్య అనిత మొత్తం రూ.217.21 కోట్ల ఆస్తులున్నాయి. మాండ్య లోక్‌సభ స్థానానికి గురువారం కుమారస్వామి నామినేషన్ వేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో తన వ్యక్తిగత వివరాలను పొందుపరిచారు. తమకు రూ.82.17 కోట్ల అప్పులు కూడా ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కుమారస్వామికి రూ.54.65 కోట్ల విలువైన ఆస్తులుండగా ఆయన భార్య అనితకు రూ.154.39 కోట్ల ఆస్తులున్నాయి. తమ ఉమ్మడి కుటుంబంలో తన పేరిట మరో రూ.8.17 కోట్ల ఆస్తులు కూడా ఉన్నట్లు మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కుమారుడైన కుమారస్వామి వెల్లడించారు.

మోదీ విజయం జాతీయ బాధ్యత: నడ్డా

డెహ్రాడూన్: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా నెగ్గడానికి సహకరించడం ప్రజల జాతీయ బాధ్యత అని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలంటే మోదీని మూడోసారి గెలిపించుకోవాలని సూచించారు. నడ్డా గురువారం ఉత్తరాఖండ్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించారు. ఉత్తరాఖండ్‌లోని మొత్తం ఐదు లోక్‌సభ స్థానాలకు బీజేపీకి కట్టబెట్టాలని కోరారు. మోదీని మళ్లీ గెలిపిస్తే దేశాన్ని మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఓటు బ్యాంకు రాజకీయాలు, కుల రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి రాజకీయాలకు శ్రీకారం చుట్టిన ఘనత నరేంద్ర మోదీదే అని నడ్డా ప్రశంసించారు.

అబద్ధాల సర్దార్ మోదీ: ఖర్గే

జైపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముమ్మాటికీ అబద్ధాల సర్దార్ అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మన దేశ భూభాగంలోకి చైనా ప్రవేశిస్తుంటే మోదీ నిద్రపోతున్నారని ధ్వజమెత్తారు. గురువారం రాజస్తాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీలో ఖర్గే మాట్లాడారు. దేశ క్షేమం గురించి ఏమాత్రం పట్టించుకోని ప్రధానమంత్రి.. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని దూషించడంలో తీరిక లేకుండా ఉంటున్నారని ధ్వజమెత్తారు. 56 అంగుళాల ఛాతీ అని చెప్పుకుంటున్న మోదీ మన దేశ భూభాగాన్ని చైనాకు అప్పగించారని ఖర్గే ఆరోపించారు. మోదీ గ్యారంటీల డ్రామా సార్వత్రిక ఎన్నికల దాకా కొనసాగుతుందని చెప్పారు. ఆ తర్వాత ఏమీ ఉండదన్నారు. ఓటమి భయంతోనే విపక్షాలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు.

పామునైనా నమ్మగలం గానీ..: మమత

కూచ్‌బెహార్/మాల్‌బజార్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బీజేపీ పాటించడం లేదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. విషపూరిత పామునయినా నమ్మొచ్చేమోగానీ, కాషాయదళాన్ని మాత్రం విశ్వసించరాదన్నారు. ఆవాస్ యోజన కింద పేర్లు నమోదు చేసుకోవాలని కేంద్రం కోరితే గుడ్డిగా నమ్మొద్దని ప్రజలను కోరారు. బీజేపీ దేశాన్ని నాశనం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీకి ఒకే దేశం, ఒకే పార్టీ సిద్ధాంతంపై మాత్రమే నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థలతోపాటు బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్‌లు కూడా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి వాటికి తాము తలొంచబోమని తెగేసి చెప్పారు. అన్ని పార్టీలనూ సమానంగా చూడాలని ఈసీని కోరతామన్నారు.

బీజేపీని ఓడించండి: ఎస్‌కేఎం

చండీగఢ్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని శిక్షించాలని ప్రజలకు పిలుపు ఇస్తామని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) తెలిపింది. బీజేపీకి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో భాగంగా మే 21వ తేదీన పంజాబ్‌లోని జగ్రావ్‌లో ర్యాలీ చేపడతామంది. బీజేపీని ఓడించండి..కార్పొరేట్లను తరమండి'అనేదే తమ నినాదమని గురువారం ఎస్‌కేఎం నేత బల్బీర్ సింగ్ రాజేవాల్ మీడియాకు తెలిపారు. ఇటీవల ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో జరిగిన కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరుతూ పలు ప్రశ్నలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంచిపెడతామన్నారు. వివాదాస్పద మూడు వ్యవసాయ చట్టాల రద్దు కోసం పోరాటానికి ఎస్‌కేఎం సారథ్యం వహించిన విషయం తెలిసిందే.

ఎన్డీఏ హ్యాట్రిక్ ఖాయం

లోక్‌సభ ఎన్నికల్లో 383 స్థానాలు • టైమ్స్ నౌ సర్వే వెల్లడి

బీజేపీకి ఒంటరిగానే 344

- ఇండియా కూటమికి 118
- కాంగ్రెస్‌కు కేవలం 37 స్థానాలు
- తెలంగాణలో కాంగ్రెస్‌కు 9, బీజేపీకి 5, బీఆర్ఎస్‌కు 2
- వైఎస్సార్‌సీపీకి 22 స్థానాలు
- డీఎంకేకు 22, టీఎంసీకి 19

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని టైమ్స్ నౌ–ఈటీజీ సర్వే పేర్కొంది. ఎన్డీఏకు 383 స్థానాలొస్తాయని, విపక్ష ఇండియా కూటమి 118 సీట్లకే పరిమితం అవుతుందని అంచనా వేసింది. అధికార బీజేపీ ఏకంగా 344 సీట్లు సాధిస్తుందని, కాంగ్రెస్ తన చరిత్రలోనే అత్యల్పంగా కేవలం 37 లోక్‌సభ స్థానాలతో కుదేలవనుందని పేర్కొంది. ఎన్డీఏ కూటమి ఏకంగా 49 శాతం ఓట్లు ఒడిసిపడుతుందని, ఇండియా కూటమికి 34 శాతం వస్తాయని తేల్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 25 స్థానాలకు గాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏకంగా 22 సీట్లు సాధించి లోక్‌సభలో మూడో అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందని వెల్లడించింది. తమిళనాట డీఎంకేకు కూడా 22 స్థానాలొస్తాయని, పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్‌కు 19, ఒడిశాలో బిజూ జనతాదళ్‌కు 11 సీట్లొస్తాయని తెలిపింది. కేజ్రీవాల్ అరెస్టుతో సంక్షోభంలో పడ్డట్టు కన్పిస్తున్న ఆప్ 6 స్థానాలతో మెరుగైన ప్రదర్శన చేస్తుందని సర్వే పేర్కొనడం విశేషం. ఇక అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న తెలంగాణలో 17 స్థానాలకు గాను కాంగ్రెస్‌కు 9 దక్కుతాయని, బీజేపీ 5, మజ్లిస్ ఒక స్థానం గెలుచుకుంటాయని వివరించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమికి తోడు నేతల వలస తదితరాలతో కుంగిపోయిన బీఆర్ఎస్ 2 స్థానాలకు పరిమితమవుతుందని తెలిపింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏకు 353 స్థానాలు రావడం తెలిసిందే. అందులో ఒక్క బీజేపీయే ఏకంగా 303 స్థానాలు సాధించింది. కాంగ్రెస్ కేవలం 52 సీట్లతో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయింది. యూపీఏకు 91, ఇతరులకు 98 సీట్లొచ్చాయి.

సోరెన్ భూమి అటాచ్

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆయన సన్నిహితులపై నమోదైన మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సోరెన్‌కు చెందిన రూ.31 కోట్ల విలువైన 8.86 ఎకరాల భూమిని అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తెలిపింది. సోరెన్‌తోపాటు భాను ప్రతాప్ ప్రసాద్, రాజ్ కుమార్ పహన్, హిలరియాస్ కచ్చప్, బినోద్ సింగ్‌లపై మార్చి 30వ తేదీన రాంచీలోని మనీ లాండరింగ్ నిరోధక(పీఎంఎల్ఏ) ప్రత్యేక కోర్టులో ఈడీ ఈమేరకు చార్జిషీట్ వేసింది. ఈ చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకున్నట్లు ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది.

అవినీతిపరులు ఒక్కటవుతున్నారు

విపక్షాలపై మోదీ ధ్వజం



గురువారం జముయి సభలో మోదీ, చిరాగ్ నవ్వులు

జముయి/కూచ్‌బెహార్: అవినీతి కేసుల్లో ఇరుక్కున్నవారంతా మోదీపై యుద్ధం పేరిట ఒక్కటవుతున్నారని ప్రతిపక్ష 'ఇండియా' కూటమిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. ఆ కూటమిలో ఉన్న భాగస్వాములంతా పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకున్నవారేనని గుర్తుచేశారు. అవినీతిపరులను జైలుకు పంపించాలా? వద్దా? అని ప్రశ్నించారు. తాను అవినీతి నిర్మూలన గురించి మాట్లాడుతుండగా, ప్రతిపక్షాలు మాత్రం మోదీని ఓడించాలని ప్రజలకు పిలుపునిస్తున్నాయని తప్పుపట్టారు. గురువారం బిహార్‌లోని జముయి జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. మన దేశానికి ముప్పుగా మారిన సీమాంతర ఉగ్రవాదాన్ని అరికట్టడంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు దారుణంగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చి దాడులు చేస్తున్నా పట్టించుకోలేదని విమర్శించారు. చిన్నదేశాల నుంచి ముష్కరులు వచ్చిపడుతున్నా చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ఇతర దేశాల జోక్యాన్ని అనుమతించారని మండిపడ్డారు. దీనివల్ల భారత్‌కు బలహీన దేశమన్న చెడ్డ పేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియాను సులువుగా టార్గెట్ చేయొచ్చన్న అభిప్రాయం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్వాకం వల్ల ప్రపంచం దృష్టిలో భారత్ పేద దేశంగా ముద్రపడిందని అన్నారు. యూపీఏ ప్రభుత్వ పాలనలో 26/11 ముంబై ఉగ్రవాద దాడుల కేసులో అమెరికా జోక్యాన్ని అనుమతించడాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

సీఏఏపై విపక్షాల తప్పుడు ప్రచారం

పౌరసత్వ సవరణ చట్టంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మోదీ మండిపడ్డారు. భరతమాతపై విశ్వాసం ఉన్నవారికి భారత పౌరసత్వం కల్పిస్తామని, ఇది మోదీ గ్యారంటీ అని వ్యాఖ్యానించారు. ఆయన పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్‌లో ప్రచారంలో పాల్గొన్నారు. అవినీతిపరులను కాపాడేందుకు ప్రతిపక్షాలు ఆరాటపడుతున్నాయని విమర్శించారు.

ఒపీనియన్ పోల్‌లో ట్రంప్ ముందంజ

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో విజయం ఎవరిదన్న దానిపై ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ ఏర్పడింది. మాజీ ప్రత్యర్థులు డొనాల్డ్ ట్రంప్, జో బైడెన్ మళ్లీ పోటీ పడుతున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అభిప్రాయం ఏమిటన్న దానిపై వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక ఓపీనియన్ పోల్ నిర్వహించింది. ఏడు కీలక రాష్ట్రాల్లో సర్వే చేయగా, ఏకంగా ఆరు రాష్ట్రాల్లో ట్రంప్ వైపు మొగ్గు కనిపించింది. తదుపరి అధ్యక్షుడిగా ట్రంప్‌ను ఎన్నుకోవడానికి ప్రజలు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ విధానాల పట్ల జనం అసంతృప్తిగా ఉన్నట్లు సర్వేలో వెల్లడయ్యింది.

ఈ చిన్నారి మృత్యుంజయుడు!

విజయపుర: ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిపోయిన రెండేళ్ల చిన్నారిని 20 గంటల పాటు శ్రమించి, 16 అడుగుల లోతు నుంచి సురక్షితంగా బయటకు తీశారు. ఎంతో ఉత్కంఠ రేపిన ఈ ఘటన కర్ణాటకలోని విజయపుర జిల్లా ఇండి తాలూకా లచియానా గ్రామంలో చోటుచేసుకుంది. చిన్నపాటి గాయమైనా కాకుండానే బాలుడిని రక్షించిన సహాయక సిబ్బందిని గ్రామస్తులు ప్రశంసల్లో ముంచెత్తారు. లచ్యాణ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన రైతు శంకరప్ప మంగళవారం తన భూమిలో బోరుబావిని తవ్వారు. నీళ్లు పడకపోవడంతో దాన్ని వదిలేసి, మరో బోరు వేశారు. బుధవారం మధ్యాహ్నం శంకరప్ప మనవడు సాత్విక్ సతీశ్ ముజగోండ్ ఖాళీగా ఉన్న బోరుబావి వద్దకు ఆడుకుంటూ వెళ్లి అందులో పడిపోయాడు. బోరు బావి నుంచి ఏడుపు వినిపించడంతో గ్రామస్తులు సాయంత్రం 6.15 గంటల సమయంలో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు, ఫైర్, వైద్య, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ ఫైర్ సిబ్బంది తాడును లోపలికి వేసి, బాలుడి కాలికి గట్టిగా బిగుసుకునేలా చేశారు. బాలుడు మరింత లోతుకు జారిపోకుండా నివారించగలిగారు. పైపు సాయంతో ఆక్సిజన్‌ను సరఫరా చేశారు. 16 అడుగుల లోతులో చిన్నారి బండరాళ్ల మధ్య చిక్కుకున్నట్లు గుర్తించారు. బండరాళ్లు అడ్డురావడంతో నిట్టనిలువుగా, అర్ధరాత్రి దాటాక 2 గంటలకల్లా 21 అడుగుల లోతు మేర గుంత తవ్వారు. 20 గంటల తర్వాత గురువారం మధ్యాహ్నానికి చిన్నారిని బయటికి తెచ్చారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు పండుగ చేసుకున్నారు.

సోనియా ప్రమాణం

రాజ్యసభ సభ్యులుగా 14 మంది ప్రమాణం



సోనియాతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా 14 మంది రాజ్యసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ గురువారం వారితో ప్రమాణం చేయించారు. ప్రమాణం చేసిన వారిలో కాంగ్రెస్ నేతలు అజయ్ మాకెన్, సయ్యద్ నాసర్ హుస్సేన్, బీజేపీ నేతలు ఆర్‌పీఎన్ సింగ్, మదన్ రాథోడ్, సామిక్ భట్టాచార్య, జేడీయూ నేత సంజయ్ కుమార్ ఝా, బీజేడీకి చెందిన సుభాశీష్ ఖుంటియా, దేబాశీష్ సామంతరాయ్, ఆంధ్రప్రదేశ్ నుంచివైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గొల్ల బాబూరావు, మేడా రఘునాథ రెడ్డి, యెర్రం వెంకట సుబ్బారెడ్డి, తెలంగాణ నుంచి బీఆర్ఎస్ నేత రవి చంద్ర వద్దిరాజు ఉన్నారు. ఒడిశా, రాజస్తాన్‌ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వారి పదవీ కాలం గురువారం నుంచి మొదలవుతుందని, మిగతా వారి పదవీ కాలం బుధవారం నుంచే ప్రారంభమవుతుందని రాజ్యసభ సెక్రటేరియట్ తెలిపింది. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్యసభ నేత పీయూశ్ గోయెల్, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, సెక్రటరీ జనరల్ పీసీ మోదీ పాల్గొన్నారు. 25 ఏళ్లుగా ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ ఎంపీగా కొనసాగుతున్న సోనియా, తొలిసారి రాజస్తాన్ నుంచి రాజ్యసభకు ఎంపికైన విషయం తెలిసిందే. ఆమె ప్రమాణ స్వీకారంపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే స్పందిస్తూ, 'రాజ్యసభలో ప్రమాణ స్వీకారం చేయడం ద్వారా సోనియా గాంధీ కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. ఆమెకు శుభాకాంక్షలు. ప్రస్తుత ప్రతికూలతల నేపథ్యంలో ఆమె సాహసోపేతమైన నిర్ణయాలు మా పార్లమెంటరీ వ్యూహానికి మార్గదర్శకంగా ఉంటాయి. ఎగువసభలో ఆమె రాక కోసం నాతోపాటు మిగతా ఎంపీలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆమె పదవీకాలం ఫలప్రదం కావాలని కోరుకుంటున్నా' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

టార్గెట్ 50 శాతం

వ్యూహాలకు పదును పెడుతున్న బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగానే 370కి పైగా స్థానాలను లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ, ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుకుని దాన్ని సాధించేలా వ్యూహరచన చేస్తోంది. మోదీ కరిష్మాకు తోడు పదేళ్ల పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. గతంలో కాస్త తేడాతో ఓడిన స్థానాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

కఠిన సవాలే

స్వతంత్ర భారత చరిత్రలో 17 లోక్‌సభ ఎన్నికల్లో ఏడుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు బీజేపీ, ఒకసారి జనతాపార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించాయి. కానీ ఏ పార్టీకీ 50 శాతం ఓట్లు రాలేదు! 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 48.1 శాతమే ఇప్పటిదాకా రికార్డు. ఆ తర్వాత ఏ లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు మెజారిటీ కానీ, 40 శాతం ఓట్లు కానీ రాలేదు. ఇక బీజేపీ 2014లో 31.4 శాతం ఓట్లతో 282 సీట్లు, 2019లో 37.7 శాతం ఓట్లతో 303 స్థానాలు సాధించింది. ఈసారి మరో 12 శాతం ఓట్ల కోసం చిన్నా పెద్దా పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకుంది.

ఆ 100 స్థానాలపై గురి

50 శాతం ఓట్లు, 370 ప్లస్ సీట్ల సాధనకు బీజేపీ రెండంచెల వ్యూహం పన్నింది. 2014లో నెగ్గి 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన 35 స్థానాలపై ఫోకస్ పెంచింది. వీటిలో ఒక్క ఉత్తర్‌ప్రదేశ్‌లోనే 14 స్థానాలున్నాయి. బిహార్‌లో 6, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో రెండేసి చొప్పున ఉన్నాయి. వీటిని తిరిగి కైవసం చేసుకునేందుకు స్థానిక పార్టీలతో పొత్తులు పెట్టుకుంది. అక్కడ బలమైన అభ్యర్థులను బరిలో దింపుతోంది. ఇక కేవలం 2 నుంచి 3 శాతం ఓట్ల తేడాతో ఓడిన మరో 72 స్థానాలనూ బీజేపీ గుర్తించింది. అక్కడ సొంతంగా బలం పెంచుకునే యత్నాలకు పదును పెట్టడంతో పాటు జేడీ(ఎస్), జేడీ(యూ), ఎల్జేపీ, పీఎంకే, ఆరెఢీ, తమిళ మానిల కాంగ్రెస్ వంటివాటితో పొత్తులు పెట్టుకుంది. పైరవీలు, సీనియార్టీలను పక్కన పెట్టి గెలుపు అవకాశాలున్న వారికే టికెట్లిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు ఇప్పటికే ఏకంగా 103 మందికి పైగా సిట్టింగులను తప్పించింది. వారిలో కేంద్ర మంత్రులు మీనాక్షి లేఖీ, అశ్వినీకుమార్ చౌబే తదితరులు, హర్షవర్ధన్, సదానందగౌడ వంటి మాజీలున్నారు. వరుణ్‌గాంధీ వంటి నేతను కూడా మొహమాటం లేకుండా పక్కన పెట్టేశారు. అనంత్‌కుమార్ హెగ్డే, సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ వంటి వివాదాస్పదులకూ మొండిచేయి చూపారు.


నాయుడుపేటలో సభా ప్రాంగణానికి వెళుతున్న సీఎం వైఎస్ జగన్‌పై పూలవర్షం కురిపిస్తున్న స్థానికులు


నాయుడుపేటలో సభకు హాజరైన జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వలంటీర్ల సేవలు ఆగవు

నాయుడుపేట బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్

> చంద్రబాబు దుర్మార్గం వల్ల నిన్న, ఈరోజు (బుధ, గురువారాల్లో) ఏకంగా 31 మంది అవ్వాతాతలు పెన్షన్‌ను అందుకునే క్రమంలో నడవలేక, అవస్థ పడలేక ప్రాణాలు విడిచారు. 31 మందిని చంపిన ఈ చంద్రబాబు నాయుడును హంతకుడు అందామా? లేక అంతకన్నా దారుణమైన పదం ఏమైనా ఉంటే అది అందామా? ఆలోచించండి. అయ్యా చంద్రబాబూ.. మీ హయాంలో జన్మభూమి కమిటీలు పెట్టుకున్నారు. పెన్షన్, రేషన్‌కార్డు, సర్టిఫికెట్, చివరకు మరుగుదొడ్లు కావాలన్నా లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఉండింది. ఈరోజు వలంటీర్ వ్యవస్థ వల్ల ఆ కష్టాలు లేవు. అందుకే కదా మీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.
>
> అయ్యా చంద్రబాబూ.. నువ్వు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశావు.. మూడుసార్లు ముఖ్యమంత్రి అని చెప్పకుంటావు కదా.. మరి నీ పేరు చెబితే కనీసం ఒక్కటంటే ఒక్కటైనా నువ్వు చేసిన మంచి పని, స్కీము గుర్తుకు వస్తుందా? పైగా చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చేది వెన్నుపోట్లు, మోసాలు, అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు. అందుకే చంద్రబాబుకు నా అనే వాళ్లు ఈ రాష్ట్రంలో కరువు. పక్క రాష్ట్రంలో కూడా ఎవరూ లేరు. ఎవరైనా ఉన్నారా అంటే అది ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, వీరందరికీ తోడు ఓ దత్తపుత్రుడు. వీళ్లందరూ కలిసి గ్రామ గ్రామాన ఏర్పాటు చేసుకున్న జన్మభూమి దొంగల ముఠా. వీరంతా మన రాష్ట్రాన్ని దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం. ఇదీ వీళ్లకు తెలిసిన రాజకీయం.
>
> - సీఎం వైఎస్ జగన్


ప్రసంగిస్తున్న సీఎం జగన్

సాక్షి, తిరుపతి

'రాష్ట్రంలో 66 లక్షల మంది పెన్షన్లు తీసుకుంటున్నారు. వీరిలో అవ్వాతాతలు, వితంతు అక్కచెల్లెమ్మలు, దివ్యాంగులు ఉన్నారు. అయ్యా.. చంద్రబాబు నాయుడూ.. ఇలాంటి వాళ్లను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదు. ఇబ్బంది పడిన వారందరికీ ఒకేమాట చెబుతున్నా. కొంచం ఓపిక పట్టండి. జూన్ 4వ తారీఖున మళ్లీ మీ బిడ్డ ప్రభుత్వం వస్తుంది. మళ్లీ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి ఇంటికీ సేవలందించే ఫైల్‌పైన నా మొట్ట మొదటి సంతకం చేస్తాను' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. 'మేమంతా సిద్ధం' ఎనిమిదవ రోజు బస్సు యాత్ర గురువారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో సాగింది. ఈ సందర్భంగా నాయుడుపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మంచి చేసిన మనందరి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తూ.. అడ్డు తగులుతున్న దుష్ట చతుష్టయంపై యుద్ధం ప్రకటించడానికి వచ్చిన ఆత్మబంధువులైన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు, సోదరులు, స్నేహితులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికలు కేవలం ఎంపీ, ఎమ్మెల్యేలను ఎన్నుకునేవి మాత్రమే కావని, మీ తల రాతలు మార్చే ఎన్నికలని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

రెండు భావజాలాల మధ్య సంఘర్షణ

- రెండు భావజాలాల మధ్య సంఘర్షణగా జరుగుతున్న ఎన్నికలివి. జగన్‌ను ఓడించాలని వారు.. పేదల్ని గెలిపించాలని, ఇంటింటి అభివృద్ధిని కొనసాగించాలని మనం.. పెత్తందారీ భావజాలానికి, మన పేదల అనుకూల భావజాలానికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది.
- గవర్నమెంట్ బడిలో ఇంగ్లిష్ మీడియం వద్దన్న వారికి, అదే గవర్నమెంట్ బడిని నాడు-నేడుతో మొదలు పెట్టి.. ఇంగ్లిష్ మీడియం, పిల్లల చేతుల్లో ట్యాబులు, డిజిటల్ బోధన, సీబీఎస్ఈ, ఐబీ దాకా ప్రయాణం సాగిస్తున్న మనకు మధ్య పోరాటం ఈ ఎన్నికలు.
- పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి వీల్లేదని, ఒక వేళ ఇస్తే కులాల మధ్య సమతుల్యం దెబ్బతింటుందని నిస్సిగ్గుగా కోర్టుల్లో వాదించిన వారికి, నా అక్కచెల్లెమ్మల పేరిట 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చిన మనకు మధ్య ఈ యుద్ధం.
- నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, పేద సామాజిక వర్గాలకు పెద్దపీట వేయడానికి మనసు లేని గత టీడీపీ పాలనకు.. ఏకంగా చట్టం చేసి మరీ 50 శాతం పదవులు ఇస్తూ నా.. నా.. నా.. నా.. అంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను గుండెల్లో పెట్టుకున్న మనందరి ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న యుద్ధం.
- 650 హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిన వారికి, రూ 2.70 లక్షల కోట్లు.. అందులో 75 శాతానికి పైగా నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే లబ్ధి పొందిన పరిస్థితి. డీబీటీగా నేరుగా మీ బిడ్డ బటన్ నొక్కడం, నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లిపోయేలా చేసిన మన ప్రభుత్వం మధ్య జరుగుతున్న యుద్ధం.
- పెన్షన్, రేషన్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, ఎరువులు, ఇలా ఏ స్కీమైనా, ఏ పౌర సేవ అయినా క్యూల్లో నిలబడి.. వివక్షకు లోనై, లంచాలు సమర్పించుకుంటేనే పేదలకు అందాలనే అహంకార భావజాలానికి, ఆ సేవలన్నీ పేదవాడి ఇంటి వద్దకే వచ్చి తలుపుతట్టి చిరునవ్వుతో గుడ్ మార్నింగ్ చెప్పి, డోర్ డెలివరీ చేసి వారి ఆత్మగౌరవానికి విలువ ఇస్తున్న మనందరి ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న యుద్ధం.


ర్యాంప్‌పై నడుస్తూ అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

ఇంటికొచ్చి పెన్షన్ ఇస్తే జీర్ణించుకోలేక..

- ఇంటికే వచ్చి పెన్షన్ సొమ్ము అవ్వాతాతల చేతుల్లో పెట్టడం మొన్నటి దాకా చూశాం. 58 నెలలుగా ప్రతి నెలా 1వ తారీఖున ఆదివారమైనా, సెలవుదినమైనా తెల్లవారక మునుపే వలంటీర్లు నేరుగా ఇంటికి వచ్చి చిక్కటి చిరునవ్వుతో గుడ్ మార్నింగ్ చెబుతూ ఆ అవ్వాతాతలకు ఒక మంచి మనవడిగా, మనవరాలుగా తోడుగా ఉంటూ పెన్షన్ చేతిలో పెట్టారు. ఎన్నికలు వచ్చేసరికే ఇది జీర్ణించుకోలేక అసూయతో చంద్రబాబు తన మనిషి నిమ్మగడ్డ రమేష్ చేత ఎన్నికల కమిషన్‌కు పిటిషన్ పెట్టించి అడ్డుకున్నారు.
- గతంలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు కేవలం రూ.1,000 ఇస్తున్న పెన్షన్‌ను మీ బిడ్డ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3 వేలకు పెంచుకుంటూ పోయాం. ఇది వారికి గిట్టలేదు. రాజకీయాలు నిజంగా చెడిపోయాయి. దిగజారిపోయాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు.. రాజమండ్రిలో టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు లాంటి వారు ఏకంగా ప్రెస్‌మీట్లు పెట్టి మేమే వలంటీర్లతో పింఛన్ల పంపిణీని ఆపించామని చెప్పడం మీరంతా కూడా చూశారు. వీళ్ల అహంకార ధోరణిని ఏరకంగా నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారో మీరంతా గమనించారు.
- ఇంత మందికి అండగా నిలబడ్డాం కాబట్టే ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో 5 కోట్ల మంది ప్రజలు జగన్‌కు అండగా నిలిచారని సంతోషంగా చెబుతున్నా. నా పేద అక్కచెల్లెమ్మలు నన్ను తోబుట్టువుగా భావిస్తున్నారని గర్వంగా చెబుతాను. నన్ను మనసారా ఆశీర్వదించే నా పేద అవ్వాతాతలు, జగన్ మామ అని ప్రేమగా పిలిచే చిన్నారులు.. ఇలా వీళ్లంతా నా బంధువులు. వీరి భవిష్యత్తు మార్చడం కోసమే ఈ 58 నెలలుగా తపన, తాపత్రయంతో అడుగులు వేశాం.



పేదల భవిష్యత్తును కాపాడుకునే ఈ యుద్ధానికి మీరంతా సిద్ధంగా ఉన్నారా... ఉంటే మీ సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ ఆన్ చేసి ఆ విషయాన్ని గట్టిగా చెప్పాలని పిలుపునిస్తున్న సీఎం జగన్

డబుల్ సెంచరీ కొట్టాలి

'175 అసెంబ్లీ స్థానాలకు 175, 25 ఎంపీ సీట్లుకు 25 మొత్తం రెండు వందల సీట్లు.. ఎక్కడా తగ్గేందుకు వీల్లేదు. డబుల్ సెంచరీ కొట్టేందుకు నేను సిద్ధం.. మీరంతా సిద్ధమేనా? ఎన్నికల సంగ్రామంలో అబద్ధాన్ని, మోసాన్ని మట్టి కరిపించడానికి నేను సిద్ధం. మరి మీరంతా కూడా సిద్ధమా.. (సిద్ధమే అని కేకలు). అలాగైతే సెల్ ఫోన్లు బయటకు తీసి.. టార్చ్ లైట్ బటన్ ఆన్ చేయండి. (ప్రజలందరూ సెల్‌లో టార్చ్ లైట్ ఆన్ చేసి పైకి ఎత్తి చూపించారు). ఓటు అడిగే నైతికత ఇంటింటికీ మంచి చేసిన మనకు మాత్రమే ఉంది. ఈ 58 నెలల్లో ఇంటింటికీ మేలు జరిగి ఉంటే మీ జగన్‌కు, మీ బిడ్డకు, మీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తోడుగా నిలవాలి.



మన అభ్యర్థులకు ఓటేసి ఆశీర్వదించండి

మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు మన అభ్యర్థులపై ఉంచాలని సవినయంగా కోరుతున్నా. తిరుపతి ఎంపీ అభ్యర్థిగా గురుమూర్తి, సూళ్లూరుపేట నుంచి సంజీవయ్య, తిరుపతి నుంచి అభినయ్, గూడూరు నుంచి మురళి, సత్యవేడు నుంచి రాజేష్, కాళహస్తి నుంచి మధుసూదన్, వెంకటగిరి నుంచి రామ్, ఈ పార్లమెంటుకే సంబంధించిన సర్వేపల్లి శాసనసభ్యుడు, మంత్రి, నా సహచరుడు గోవర్ధన్‌లకు మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు అందివ్వాలి. మన గుర్తు ఫ్యాన్ అని మరచిపోవద్దు.

చంద్రబాబుది కిచిడీ మేనిఫెస్టో..

ఏ ఒక్కరూ తన కులం, మతం, ఆర్థిక పరిస్థితి వల్ల మంచి చదువులు చదువుకోవడానికి అడ్డంకులు లేని ఓ సొసైటీని క్రియేట్ చేసే కార్యక్రమం కోసం ఈ 58 నెలలుగా మీ బిడ్డ కష్టపడ్డాడు. ధనికులకు ఒకరకమైన చదువు, పేదలకు ఇంకొక రకమైన చదువు ఉండటానికి వీల్లేదని క్వాలిటీ ఎడ్యుకేషన్ తీసుకొచ్చాడు. మీ బిడ్డ వేసిన ఈ విత్తనాలు మరో 10-15 సంవత్సరాల్లో ఏ స్థాయి వృక్షాలు అవుతాయంటే.. మన పేదింటిలో పుట్టిన మన పిల్లలు.. ఏ లెవల్లో అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడతారంటే, పెద్దింటి పిల్లలకు కూడా అసూయ పుట్టే విధంగా వాళ్లు మాట్లాడే పరిస్థితి వస్తుంది. ఇంటింటికీ మంచి చేయగలిగాం కాబట్టే, మనకు వారి మాదిరిగా కుట్రలు, పొత్తులు, ఎత్తులు, జిత్తులతో పని లేదు.

- మీ బిడ్డ మోసం చేయలేదు. మంచి చేశాను కాబట్టే మళ్లీ ఒంటరిగా ఆత్మవిశ్వాసంతో ప్రజల ఆశీస్సుల కోసం వచ్చాను. 2024 ఎన్నికల్లో కూడా మీ బిడ్డ అబద్ధాలు చెప్పడు. మోసాలు చేయడు. చేయలేని వాగ్దానాలను సాధ్యం కాని వాగ్దానాలను మేనిఫెస్టోలో పెట్టడు. ఒక్కటే గుర్తుంచుకోండి. జగన్‌కు పేదలపై ఉన్న ప్రేమ ఈ దేశ రాజకీయ చరిత్రలో మరే నాయకుడికీ లేదు.. ఉండదు. జగన్ చేయలేని ఏ స్కీమైనా చంద్రబాబు కాదు కదా.. ఆయన జేజమ్మ కూడా అమలు చేయలేదు.
- చంద్రబాబు అబద్ధాల కిచిడీ మేనిఫెస్టోతో పోటీ పడాలని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే చంద్రబాబు మనస్తత్వం ఎలాగూ చేసేది లేదు కాబట్టి, ప్రజల్ని ఎలాగూ మోసమే కదా చేసేది కాబట్టి నోటికి ఏదొస్తే అది చెబుతాడు. అందుకే చంద్రబాబు నాయుడుతో, ఆయన అబద్ధాలతో, ఆయన మోసాల కిచిడీ మేనిఫెస్టోతో పోటీ పడాలని మీ బిడ్డ అనుకోవడం లేదు. నిజాలకు, నిజాయితీకి, నిబద్ధతకు ప్రజలు విలువ ఇస్తారన్న నమ్మకం మీ బిడ్డకు ఉంది.

లీడర్ అంటే కార్యకర్త కాలర్ ఎగరేసేలా ఉండాలి

- మీకు ఎలాంటి నాయకుడు కావాలి అని అడుగుతున్నా. తనను ప్రేమించే ప్రతి అభిమాని, ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు, ప్రతి వలంటీర్.. ప్రతి ఒక్కరూ కాలర్ ఎగరేసి అదిగో మా నాయకుడు.. మనసున్న నాయకుడు, మాట ఇస్తే తప్పడు అని చెప్పుకునేలా ఉండాలి. విలువలకు, విశ్వసనీయతకు మా నాయకుడు ప్రతీక అని చెప్పే మీ బిడ్డలాంటి నాయకుడు కావాలా, లేక చంద్రబాబు మాదిరిగా ఎన్నికలు వచ్చేసరికే ప్రతి ఒక్కరినీ మోసం చేసేందుకు రంగు రంగుల హామీలతో మేనిఫెస్టోలు ఇచ్చే నాయకుడు కావాలా ఆలోచించండి.


టీడీపీ 2014 ఎన్నికల మేనిఫెస్టోను చూపిస్తున్న సీఎం జగన్

- చంద్రబాబు కేజీ బంగారం అంటాడు.. బెంజ్ కారు అంటాడు.. సూపర్ సిక్స్ అంటాడు, సూపర్ సెవెన్ అంటాడు. మేనిఫెస్టోను ఎన్నికలు అయిపోయిన తర్వాత చెత్తబుట్టలో పడేసి ప్రజలతో పని లేదని మోసం చేస్తాడు. చంద్రబాబును నమ్ముకుని, ఆయన పార్టీకి సంబంధించిన ఏ కార్యకర్త అయినా గ్రామాల్లోకి వెళ్లి ఓటు అడిగే నైతిక హక్కు ఉంటుందా?
- మన ఐదేళ్ల పాలనలో మేనిఫెస్టోలో చెప్పనివి కూడా చాలా చేశాం. భవిష్యత్తులో కూడా వెనులుబాటును బట్టి మేనిఫెస్టోలో చెప్పినా, చెప్పకపోయినా ప్రతి ఇంటికీ చేయగలిగిన మంచి అంతా చేస్తాను.

ఒక్క హామీ అయినా నెరవేర్చారా?

- ఇదే చంద్రబాబు 2014లోనూ ఇదే మాదిరి పొత్తులు పెట్టుకున్నాడు. ఈ మూడు పార్టీలూ కలిసి ఇంటింటికీ ముఖ్యమైన హామీలు అంటూ పాంప్లెట్ పంపించారు. చంద్రబాబు, దత్తపుత్రుడు, మోదీ ఫొటోలు.. కింద చంద్రబాబు నాయుడు సంతకంతో ఈ పాంప్లేట్ (చూపిస్తూ) పంపించాడు.
- ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5లో అడ్వర్‌టైజ్‌మెంట్లతో హోరెత్తించారు. రైతులకు రుణ మాఫీపై మొదటి సంతకం చేస్తా అన్నాడు. రూ.87,612 కోట్లు రుణ మాఫీ చేశాడా? పొదుపు సంఘాల డ్వాక్రా రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకు అకౌంట్లో డిపాజిట్ చేశాడా? ఇంటింటికీ ఉద్యోగం.. లేదా నెలనెలా రూ.2 వేల నిరుద్యోగభృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లు.. అంటే 60 నెలలకు నెలకు రూ.2000 చొప్పున లెక్కిస్తే.. ప్రతి ఇంటికీ రూ.1.20 లక్షలు ఇచ్చారా? అర్హులైన వాళ్లందరికీ 3 సెంట్ల స్థలం ఇచ్చారా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలన్నీ మాఫీ అన్నాడు.. చేశాడా?
- మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు జరిగిందా? రాష్ట్రాన్ని సింగపూర్‌ను మించి అభివృద్ధి చేస్తానన్నాడు. ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి మన నాయుడుపేటలో ఏమన్నా కనిపించిందా? ఇలా 650 హామీలు ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ అదే మోసం. అవే పొత్తులు. ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడు. ఈ ముగ్గురూ కలిసి ఇంటింటికీ కేజీ బంగారం అంటున్నారు. ఇంటింటికీ బెంజ్ కారు కొనిస్తామంటున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి


విష్ణువర్ధన్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి/కావలి: టీడీపీ సీనియర్ నేత, నెల్లూరు జిల్లా కావలి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, అనుచరులతో కలిసి గురువారం ఎద్దల చెరువు వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ పార్టీ కండువా కప్పి విష్ణువర్ధన్‌రెడ్డిని సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. 2019లో నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున విష్ణువర్ధన్‌రెడ్డి పోటీ చేశారు. కాగా, ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటా

భవనంపై నుంచి పడిన తమ కుమారుడిని ఆదుకోవాలని కోరిన తల్లిదండ్రులు

మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలిచ్చిన సీఎం జగన్

పెళ్లకూరు (తిరుపతి జిల్లా): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం దిగువచావలి గ్రామం వద్ద వైఎస్సార్ జిల్లా త్రిపురవరం ప్రాంతానికి చెందిన ప్రభావతి, వీరాంజనేయులరెడ్డి కుమారుడు మహానంది వినోద్‌కుమార్‌రెడ్డి కలిశారు. తమ కుమారుడు వినోద్ గతేడాది భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో వెన్నెముక విరిగిందని చెప్పారు. ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మెరుగైన వైద్యం చేయించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి తమ కుమారుడు మంచానికే పరిమితమయ్యాడని.. తమను ఆదుకోవాలని సీఎం జగన్‌ను కోరారు. సీఎం వైఎస్ జగన్ వారిని ఓదార్చి.. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వినోద్‌కు పూర్తి స్థాయిలో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.




ఏర్పేడు: వృద్ధుల సమస్యలను వింటున్న సీఎం జగన్


అంజివేడు: సీఎం జగన్‌కు పల్లీలు తినిపిస్తున్న మహిళా వ్యవసాయ కూలీ

గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చారు..



గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, అంబేడ్కర్ కలలు కన్న సమ సమాజం, శ్రీశ్రీ వంటి కవులు కలలు కన్న మరో ప్రపంచం.. ఈ కలలన్నీ నిజం చేస్తూ నవశకాన్ని నిర్మిస్తున్న నిర్మాత, సంక్షేమదాత, అభివృద్ధి ప్రదాత సీఎం వైఎస్ జగన్. జగనన్న అంటే జనం. జగనన్న వెంటే ఈ జనం. ఆయన పిలుపు ఒక ప్రభంజనం. ఆయన పేరే ఒక రణ నినాదం. పేద దళిత కుటుంబంలో పుట్టి, సాధారణ ప్రభుత్వ ఉద్యోగినైన నన్ను రెండు సార్లు ఎమ్మెల్యే చేశారు. ఇప్పుడు మూడోసారి నన్ను పోటీలో నిలిపారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు అంటూ అందరినీ ఆదరించి, మీ అందరి చేతుల్లో ఉండాల్సింది పనిముట్లు కాదు, రాజ్యాధికారం అని చాటారు. మా వర్గాల నుంచి డిప్యూటీ సీఎంలను, మంత్రులను చేసి సామాజిక సాధికారత కల్పించిన ఏకైక నాయకుడు జగనే. నన్నే తీసుకుంటే ఆలయ ప్రవేశంలేని సామాజిక వర్గం నాది. అలాంటిది టీటీడీ బోర్డులో నాకు చోటిచ్చిన గొప్ప నాయకులు. మా నియోజకవర్గంలో రూ.1,400 కోట్లతో అభివృద్ధి పనులు చేసాం. రూ.2,400 కోట్లు డీబీటీ ద్వారా, నాన్ డీబీటీ ద్వారా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత మీకే దక్కింది. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగేందుకు, స్వర్ణముఖి నదిలో సబ్ సర్ఫేజ్ డ్యామ్‌లు, నాయుడుపేట నడిబొడ్డులో పోతున్న వెన్నువాను కాలువ ఆధునికీకరణ, చెంబేడు రిజర్వాయిర్, తడలో మత్స్యకార సోదరులకు ఆశ్రమ పాఠశాల, ఎస్సీ ఎస్టీలకు ఆశ్రమ పాఠశాల నిర్మించాలని కోరుకుంటున్నా.

- కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి, సూళ్లూరుపేట

స్టార్ క్యాంపెయినర్‌లతో సీఎం వైఎస్ జగన్

8 వ రోజు

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా 8వ రోజైన గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు ఫొటోలను ట్వీట్ చేశారు. 'ఎనిమిదో రోజు మేమంతా సిద్ధం యాత్రలో స్టార్ క్యాంపెయినర్‌లతో నేను..' అంటూ పేదలతో మమేకమైన ఫొటోలను ముఖ్యమంత్రి విడుదల చేశారు. నెలల చిన్నారిని ఎత్తుకొని ఆప్యాయంగా ముద్దాడిన సీఎం జగన్.. తనను కలిసిన మహిళా కూలీలతో ఫొటో దిగి వారిని ఆనందపరిచారు. కల్లు గీత కార్మికుల కష్టాలను ఆరా తీసి.. ప్రభుత్వం నుంచి పథకాల రూపంలో జరిగిన మేలును అడిగి తెలుసుకున్నారు. ఇలా.. అన్ని వర్గాల ప్రజలతో మమేకమై.. తాను అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. ఈ ఫొటోలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి. -సాక్షి, అమరావతి









చట్టసభల్లోకి సామాన్యులు



ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్



ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన టిప్పర్, లారీ, ఆటో డ్రైవర్లు, ప్రజలు

చిన్న సింగమాలలో డ్రైవర్లతో ముఖాముఖిలో సీఎం వైఎస్ జగన్

టిప్పర్ డ్రైవర్‌కు సీటిస్తే తప్పేమిటి చంద్రబాబూ?

నిజంగా నువ్వు చేయలేని పని మేం చేశాం

నీ హయాంలో ఉద్యోగం రాకున్నా సొంతకాళ్లపై నిలబడినందుకు హేళన చేస్తావా?

సాక్షి, తిరుపతి/శ్రీకాళహస్తి/రేణిగుంట(తిరుపతి జిల్లా): ''నేను ఒక టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు ఇచ్చానని చంద్రబాబు అవహేళనగా మాట్లాడారు. మీరు కోట్లున్న పెత్తందార్లకు టికెట్లు ఇస్తే నేను ఒక సామాన్యుడికి, పేదవాడికి చట్టసభల్లోకి ప్రవేశించే అవకాశం కల్పించినందుకు గర్వపడుతున్నా. టిప్పర్ డ్రైవర్‌ను చట్టసభలో కూర్చోబెట్టేందుకే శాసన సభ్యుడిగా నిలబెడుతున్నా. టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇస్తే తప్పేమిటి?'' అని సీఎం వైఎస్ జగన్ సూటిగా ప్రశ్నించారు. గురువారం తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం చిన్న సింగమాలలో టిప్పర్ డ్రైవర్లతో నిర్వహించిన ముఖాముఖిలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు.

మీలో ఒకరు..

ఆటోలు, ట్యాక్సీలు, టిప్పర్లు నడుపుతూ స్వయం ఉపాధితో జీవిస్తున్న అన్నదమ్ములందరికీ ఈ కార్యక్రమానికి స్వాగతం. మీ సమస్యలు వినిపించేందుకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం ఉండాలన్న వినతిపై స్పందించిన తొలి ప్రభుత్వం మనదే. మీలో ఒకరిని చట్టసభలో కూర్చోబెట్టేందుకు శింగనమల వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నిలబెడుతున్నాం. శింగనమల నుంచి ఒక టిప్పర్ డ్రైవర్‌ను పార్టీ తరపున అసెంబ్లీకి నిలబెడదామని నావద్ద ప్రస్తావించినప్పుడు వివరాలను ఆరా తీశా. మాదిగ సామాజిక వర్గానికి చెందిన వీరాంజనేయులు చాలా ఏళ్లుగా మన పార్టీ కార్యకర్తగా ఉన్నాడు. ఎంఏ ఎకనామిక్స్, బీఈడీ చేశాడు. చంద్రబాబు హయాంలో ఉద్యోగం దొరక్కపోయినా టిప్పర్ డ్రైవర్‌గా తన కాళ్ల మీద తాను నిలబడ్డాడు. కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అలాంటి వ్యక్తిని ఎవరైనా సరే భుజం తట్టి శభాష్ అంటారు. చంద్రబాబు మాత్రం హేళన చేశారు. ప్రతి సామాజిక వర్గం నుంచి, ప్రతి వృత్తి నుంచి అలాంటి వారు చట్టసభల్లోకి వస్తేనే వారి సమస్యలు వెలుగులోకి వస్తాయని తెలిసినా జగన్ ఒక ట్రిప్పర్ డ్రైవర్‌కు సీటు ఇచ్చాడని చంద్రబాబు అవహేళన చేశారు. అంతేకాకుండా వేలి ముద్రగాడు అని కూడా అన్నారు.

అవునయ్యా..! టిప్పర్ డ్రైవర్‌కే సీటిచ్చాం..

అవునయ్యా..! జగన్ టిప్పర్ డ్రైవర్‌కే సీటు ఇచ్చాడు. నువ్వు అవహేళన చేసేందుకు ఏం తప్పు చేశాడయ్యా జగన్ అని అడుగుతున్నా. నిజంగా నువ్వు చేయలేని పని మేం చేశాం. ఒక సామాన్యుడికి, పేదవాడికి పార్టీ టికెట్ ఇచ్చి గెలిపించే కార్యక్రమం చేస్తున్నా. నీకు, నాకు ఉన్న తేడా ఇదీ చంద్రబాబూ అని చెప్పేందుకు గర్వపడుతున్నా. సొంతంగా ఆటోలు, ట్యాక్సీలు కొనుక్కుని 3,93,655 మంది తమ కుటుంబాలను పోషించుకుంటున్నట్లు గమనించి వారికి అండగా నిలబడ్డాం. స్వయం ఉపాధితో అడుగులు ముందుకు వేస్తున్న ఆ కుటుంబాలకు మంచి చేస్తూ వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా ఏటా క్రమం తప్పకుండా రూ.10 వేలు చొప్పున అందిస్తున్నాం. ఐదేళ్లలో రూ.50 వేల వరకు లబ్ధి చేకూరుస్తూ మొత్తంగా రూ.1,296 కోట్లు అందించాం. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, మరమ్మతుల కోసం ఇబ్బంది పడకుండా సాయం అందిస్తున్నాం. ఈ జిల్లాలో 18,000 కుటుంబాలు వాహనమిత్రతో లబ్ధి పొందుతున్నాయి. ఈ జిల్లాలో 7 సెగ్మెంట్లలో రూ.61 కోట్లు అందచేశాం. ఈసారి మళ్లీ మన ప్రభుత్వం వచ్చిన తర్వాత సొంతంగా ట్రిప్పర్లు, లారీలు కొనుక్కుని వారి జీవనం వారు నడిపించుకుంటున్న వారిని కూడా ఈ జాబితాలోకి తెస్తాం. మీ సలహాలు, సూచనలు స్లిప్పులో రాసి బాక్సులో వేస్తే నావద్దకు వస్తాయి.

- ''శ్రీకాళహస్తిలో ఏడేళ్లుగా ఆటో నడుపుతున్నా. ఈ ప్రభుత్వంలో అన్ని పథకాలూ అందుకున్నా. నా పిల్లలను బాగా చదివించుకుంటున్నా. ఈ తడవ కూడా జయం మనదే జగనన్నా. కానీ ఆటో బాడుగ కట్టుకోలేకపోతున్నా. ఓ సొంత ఆటో ఇప్పించన్నా...'' అని జ్యోతి అనే ఆటో డ్రైవర్ కోరడంతో సీఎం స్పందిస్తూ ''సొంతంగా ఆటో, లారీ, ట్రిప్పర్ తక్కువ వడ్డీతో కొనుక్కునేందుకు వీలుగా బ్యాంకులతో మాట్లాడి పావలా వడ్డీ వర్తించేలా ఏదన్నా చేద్దాం తల్లీ'' అని చెప్పారు.
- ''జగనన్నా.. మీరు పెద్ద మనసుతో శింగనమల సీటు ఓ డ్రైవర్‌కు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. చంద్రబాబు అలా దూషించడం తప్పు. ఆ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపిస్తాం. మన ఎమ్మెల్యేలు 175 మందిని అసెంబ్లీకి పంపేందుకు ఐదు కోట్ల ఆంధ్రులు సిద్ధంగా ఉన్నారు. మా లారీ డ్రైవర్లకు ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగితే ఆర్థిక సాయం లభించేలా బీమా మార్గం చూడాలని కోరుతున్నా'' అని శ్రీకాళహస్తికి చెందిన లారీ డ్రైవర్ జయశంకర్ వినతిపై సీఎం స్పందిస్తూ ''నువ్వు చెప్పిన విషయాన్ని తప్పకుండా ఆలోచిస్తాం'' అని పేర్కొన్నారు.

'టిప్పర్' తడాఖా చూపిస్తాం



✔ నవరత్నాల ద్వారా మా అమ్మకి వృద్ధాప్య పింఛన్, అబ్బాయికి అమ్మ ఒడి వచ్చింది. నాన్నకు రైతు భరోసా అందుతోంది. ప్రతి పేదవాడి గుండెలో మీరు దేవుడిలా నిలిచారు. మీరు టిప్పర్ డ్రైవర్‌కి సీటు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.
– వెంకటేష్, ఆటో అసోసియేషన్ సభ్యుడు, తిరుపతి



✔ మా అమ్మకు ఆసరా, మా పాపకు అమ్మ ఒడి వచ్చాయి. ఆరోగ్యశ్రీ కూడా ఆదుకుంది. జగనన్నా మీతో మాట్లాడాలంటే మాటలు రావడం లేదు. డ్రైవర్‌కు ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. మరో 30 ఏళ్లు మీరే సీఎంగా ఉండాలి.
– వెంకటేష్, ఆటో డ్రైవర్, పూర్ణకుంభం సర్కిల్, తిరుపతి



✔ పదేళ్లుగా నిన్ను చూడాలని ఆశపడుతున్నా. మీరు ఇలాగే పేద ప్రజలకు అండగా ఉండండి జగనన్నా. మేమంతా నీ స్టార్ క్యాంపెయినర్లుగా ఉంటాం. నా బిడ్డకు అమ్మ ఒడి వస్తోంది. నాకు ఇంటి స్థలం వచ్చింది. పేద ప్రజలు నీవల్లే చల్లగా ఉన్నారు. దయ్యాలను తరిమి కొట్టి దేవుడి లాంటి నిన్ను మళ్లీ గెలిపించుకునేందుకు మా ఆటో డ్రైవర్లందరం సిద్ధంగా ఉన్నాం.
– పూర్ణేష్, శ్రీకాళహస్తి, ఆటో డ్రైవర్



✔ 22 ఏళ్లుగా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నా. వాహన మిత్ర అందుకున్నా. పొదుపు సంఘాల రుణాల మాఫీ వల్ల మా కుటుంబం లబ్ధి పొందింది. లైసెన్స్ తీసుకుని అద్దె ఆటోలు నడుపుకునే వారికి కూడా రూ.పదివేలు వాహన మిత్ర అందించాలని కోరుతున్నా.
– సుధాకర్, ఆటో డ్రైవర్, తిరుపతి



✔ అమ్మ ఒడి, వాహనమిత్ర, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో లబ్ధి పొందాం. నాకు గుండెపోటు వచ్చినప్పుడు ఆరోగ్యశ్రీ కాపాడింది. మీరు చేసిన మేలును నా జీవితంలో మరిచిపోలేను.
– అల్లాభక్ష్ శేషాద్రి టాక్సీ యూనియన్ సభ్యుడు,



అంజివేడులో..

సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో చిన్నారి



శ్రీకాళహస్తిలో..

సీఎం జగన్‌ను చూసేందుకు చెట్టు ఎక్కుతున్న యువతి

టిప్పర్ డ్రైవర్‌కు టికెటిచ్చానని చంద్రబాబు అవహేళన చేశాడు: సీఎం జగన్

సాక్షి, అమరావతి: చంద్రబాబు పెత్తందారులకు టికెట్ ఇస్తే.. తాను పేదవాడికి టికెట్ ఇచ్చి గెలిపించే ప్రయత్నం చేస్తున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. 'జగన్ ఒక టిప్పర్ డ్రైవర్‌కు సీటిచ్చాడంటూ చంద్రబాబు అవహేళన చేశాడు. అంతటితో ఆగలేదు, వేలిముద్రగాడంటూ వీరాంజనేయులును అవమానించాడు. నువ్వు రూ.కోట్లకు కోట్లు డబ్బులున్న పెత్తందారులకు టికెట్లు ఇచ్చావు చంద్రబాబూ.. నేను ఒక పేదవాడికి టికెట్ ఇచ్చి గెలిపించే కార్యక్రమం చేస్తున్నా. నాకు, నీకు ఉన్న తేడా ఇదీ చంద్రబాబు' అని గురువారం సీఎం జగన్ ట్వీట్ చేశారు.



శ్రీకాళహస్తిలో సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో అక్కచెల్లెమ్మలు



శ్రీకాళహస్తిలో సీఎం జగన్‌తో కరచాలనం చేస్తున్న విద్యార్థిని

సంక్షేమ సారథికి నీరాజనం

'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు బ్రహ్మరథం

తిరుపతి, నెల్లూరు జిల్లాల ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం



శ్రీకాళహస్తిలో రోడ్‌షోలో అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న సీఎం జగన్

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి) : సీఎం జగన్ తోబుట్టువులా నన్ను ఆదుకున్నారు. నా భర్త ఆటో డ్రైవర్. మాకు ఇద్దరు పిల్లలు. వారిని చదివించడానికి అమ్మ ఒడి ఇచ్చి అండగా నిలిచారు. కొన్నేళ్లుగా అద్దె ఇంట్లో జీవిస్తున్నాం. సొంతంగా మాకంటూ ఒక ఇల్లు సమకూర్చుకోవాలని ఎంతో ప్రయత్నించాం. అయినా మా వల్ల కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద మాకు ఇంటి స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి సాయం చేశారు. త్వరలో మాకంటూ ఓ సొంత ఇల్లు సమకూరుతుంది. వివిధ పథకాల రూపంలో మేం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కారణం అయ్యారు. నేను ఏ రోజూ పథకాలు పొందడానికి ఆఫీసుల చుట్టూ తిరగలేదు. ఎవరికీ రూపాయి లంచం ఇవ్వలేదు. అడగకుండానే ఇంత మేలు చేసిన ఆయన నిజంగా నాకు తోడబుట్టినవాడే. నాకే కాదు. రాష్ట్రంలోని లక్షలాది మంది ఆడబిడ్డలకు ఆయన ఒక అన్న, తమ్ముడు, బిడ్డ, మనువడు' అని శ్రీకాళహస్తికి చెందిన ఖదీరున్నీసా భావోద్వేగంతో చెప్పింది. 'కూలి పనులు చేసుకునే నేను గుండె జబ్బు బారినపడ్డాను. వైద్యులు బైపాస్ సర్జరీ చేయాలన్నారు. రూ.లక్షల్లో ఖర్చవుతుందన్నారు. అంత డబ్బు సమకూర్చడం నా వల్ల అసాధ్యం. అప్పుడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నన్ను ఆదుకుంది. రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఇదంతా సీఎం జగన్ ఘనతే. ఆయనకు ఏమిచ్చి రుణం తీర్చుకోవాలి?' అని గూడూరుకు చెందిన వెంకట్రావు ప్రశ్నించారు. ఇలా ఎంతో మంది 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో దారిపొడవునా తమకు ఈ ఐదేళ్లలో జరిగిన మేలు గురించి తలుచుకుంటున్నారు. వారంతా తరలి వచ్చి సీఎం జగన్‌కు పెద్ద ఎత్తున సంఘీభావం తెలుపుతున్నారు. సంక్షేమ సారథికి తిరుపతి, నెల్లూరు జిల్లాల ప్రజలు నీరాజనం పట్టారు. గురువారం ఈ రెండు జిల్లాల్లో ఎనిమిదో రోజు బస్సు యాత్ర విజయవంతంగా కొనసాగింది. తిరుపతి జిల్లా గురవరాజుపల్లెలో రాత్రి బస శిబిరం వద్ద సీఎం జగన్‌ను శ్రీకాళహస్తి, తిరుపతి, పూతలపట్టు, రైల్వేకోడూరు, పుంగనూరు నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి సీఎం దిశా నిర్దేశం చేశారు. అనంతరం 10 గంటలకు బస్సు యాత్ర ప్రారంభించారు.

కిక్కిరిసిన శ్రీకాళహస్తి

ఏర్పేడు నుంచి శ్రీకాళహస్తికి వచ్చే మార్గంలో మిట్టకండ్రిక, పనగల్లు సహా పలు గ్రామాల ప్రజలు రహదారికి ఇరువైపులా బారులు తీరి సీఎం యాత్రకు సంఘీభావం తెలిపారు. శ్రీకాళహస్తికి చేరుకునే సమయానికి రోడ్డుపైకి జనాలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. షెడ్యూల్ కన్నా ఆలస్యంగా యాత్ర సాగుతుండటంతో యాత్ర ఎంత వరకు వచ్చిందంటూ మహిళలు, వృద్ధులు ఆరా తీశారు. యాత్ర పట్టణానికి చేరుకోగానే కోలాహలం నెలకొంది. మహిళలు, వృద్ధులు మండుటెండను సైతం లెక్క చేయకుండా స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. పట్టణంలో బస్‌పైకి ఎక్కి సీఎం రోడ్‌షో నిర్వహిస్తూ ముందుకు కదిలారు. అనంతరం చిన్న సింగమలలో ఆటో, టిప్పర్, లారీ డ్రైవర్‌లతో సీఎం జగన్ ముఖాముఖి నిర్వహించారు. అనంతరం తిరిగి యాత్రను ప్రారంభించి, చావలి వద్ద భోజన విరామ శిబిరానికి చేరుకున్నారు.

నాయుడు పేటలో జన ప్రభంజనం

సాయంత్రం యాత్ర కొనసాగిస్తూ చిల్లకూరు మీదుగా నాయుడుపేటకు చేరుకున్నారు. చిల్లకూరు, నాయుడుపేటలో కేరళ వాయిద్యాలు, నృత్యాలతో, గజమాలతో సీఎంకు అపూర్వ స్వాగతం పలికారు. నాయుడుపేటలో రోడ్‌షో అనంతరం బైపాస్‌లో ఏర్పాటు చేసిన మేమంతా సిద్ధం బహిరంగ సభలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రజలు సభ ప్రాంగణంలోకి చేరుకున్నారు. ఎన్నికల కురుక్షేత్రంలో పేదల పక్షాన నిలిచిన సీఎం జగన్‌కు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని లక్షల గొంతుకలు గర్జించాయి. రంగు రంగుల మేనిఫెస్టోతో మోసపూరిత హామీలిచ్చే బాబును నమ్మబోమని.. చెప్పిందే కాకుండా చెప్పనివి కూడా చేసి మేలు చేసే జననేత జగనే తమకు కావాలని ప్రజలు నినదించారు.

నెల్లూరులోకి ప్రవేశించిన యాత్ర

సభ అనంతరం తిరిగి బస్సు యాత్ర ప్రారంభించిన సీఎం జగన్.. ఓజిలి, గూడురు బైపాస్ మీదుగా మనుబోలు వద్ద నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించింది. గూడురు బైపాస్‌లో పండ్లతో తయారు చేసిన భారీ గజమాలతో సీఎం జగన్‌ను ప్రజలు సత్కరించారు. బస్‌పైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం ముందుకు సాగారు. నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించిన సీఎంకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న గ్రామస్తులందరూ రోడ్డుపైకి చేరుకుని సంఘీభావం తెలిపారు. రాత్రి 8.15 గంటలకు నెల్లూరు బైపాస్ మీదుగా చింతరెడ్డిపాలెంలో రాత్రి బసకు సీఎం చేరుకున్నారు.

అవ్వా.. పింఛను తీసుకున్నావా..



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'అవ్వా.. పెన్షన్ వచ్చిందా.. ఎక్కడ ఇచ్చారు..?' అని ఏర్పేడు మండలం ఇసుకతాగేలి వద్ద వృద్ధురాలు పుత్తూరు మునెమ్మను సీఎం జగన్ ఆప్యాయంగా పలకరించారు. 'ప్రతి నెలా ఇంటికే వచ్చి ఇచ్చేటోళ్లు. వాళ్లను రావద్దని సెప్పినారంట. అందుకే ఆఫీసుకుపోయి తీసుకున్నా. ఇట్టా తీసుకోవాలంటే కష్టమయ్యా. ఇలా చేస్తే మాలాంటోళ్ల గతేంటి?' అని ఆ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అంజిమేడు వద్ద 'అన్ని పథకాలు అందుతున్నాయా..' అని అక్కడి మహిళలను సీఎం జగన్ పలకరించారు. సీతారాంపేట సమీపంలోని ఎఫ్‌సీఐ గోదాము వద్ద కొంతసేపు ఆగి కల్లుగీత కార్మికులు, మహిళలతో మాట్లాడారు. వ్యవసాయ కూలీలు వేరుశెనగ పంటను చేతో పట్టుకుని సీఎం జగన్ వద్దకు పరుగు పరుగున వచ్చారు. పథకాలు అందుతున్నాయా.. అని సీఎం అడిగారు. 'అన్నీ బాగా అందాయి. అందుకే మళ్లీ మీరే ముఖ్యమంత్రి కావాలి' అని మహిళలంతా ముక్త కంఠంతో చెప్పారు. ఓ మహిళ వేరుశనగ కాయను ఒలిచి ఇవ్వగా సీఎం జగన్ ఆనందంగా తిన్నారు. -ఏర్పేడు (తిరుపతి జిల్లా)

గ్రామ గ్రామాన అపూర్వ స్వాగతం

గురవరాజుపల్లె నుంచి నాయుడుపేట వైపు సాగుతున్న యాత్రలో సీఎం జగన్‌కు గ్రామ గ్రామాన ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మహిళలు హారతులు పట్టి, గుమ్మడి కాయలతో దిష్టి తీసి పూల వర్షం కురిపించారు. ఏర్పేడు మండలం ఇసుకతాగేలి వద్ద రోడ్డుపై బారులు తీరిన మహిళలతో సీఎం జగన్ బస్సు దిగి మాట్లాడారు. మహిళా రైతులు వేరుశెనగ పంటను సీఎం జగన్‌కు అభిమానంతో ఇవ్వగా, వారి యోగ క్షేమాలను కనుక్కున్నారు.



గూడూరులో రాత్రి సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న అశేష జనవాహినిలో ఓ భాగం

సినిమాలు తీసుకోవడానికి ఎమ్మెల్యే పదవి కావాలా?

- ప్రజలకు ఏం అందుబాటులో ఉంటావ్
- పాచిపోయిన లడ్డూలు ఇచ్చారని విమర్శించి.. ఇప్పుడెందుకు బీజేపీతో జత కట్టావ్
- పవన్‌కు ముద్రగడ సూటిప్రశ్న


పిఠాపురం నియోజకవర్గ ప్రజలతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: సినిమాలు తీసుకోవడానికి ఎమ్మెల్యే పదవి కావాలా అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం సూటిగా ప్రశ్నించారు. పిఠాపురం, రాజోలు నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు, మైనార్టీ మత పెద్దలు, కార్యకర్తలు ముద్రగడను గురువారం కిర్లంపూడిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. ఆరు నెలలకోసారి వచ్చి రాజకీయాలు చేసే పవన్‌కళ్యాణ్ పిఠాపురంలో గెలిచే అవకాశం లేదన్నారు. బౌన్సర్లను వెంట పెట్టుకుని ప్రచారం చేసే పవన్ పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు ఏం అందుబాటులో ఉంటారని ప్రశ్నించారు. ఆయన ఎప్పుడైనా స్థానిక నాయకులతో కనీసం ఫోన్‌లో అయినా మాట్లాడారా అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత నాణ్యమైన మద్యం అందిస్తానని పవన్ అంటున్నారని, పిఠాపురంలో ప్రజలకు మద్యం ఇవ్వడానికే ఆయనను గెలిపించాలా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు పాచిపోయిన లడ్డూలు ఇస్తారా అని బీజేపీని ప్రశ్నించిన పవన్ ఇప్పుడు ఆ పార్టీతో ఎలా జత కట్టారని నిలదీశారు.

చంద్రబాబు వ్యాఖ్యలు విడ్డూరం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఒక్కసారి సీఎం అవకాశం కల్పించారని చంద్రబాబు అనడం విడ్డూరంగా ఉందని ముద్రగడ విమర్శించారు. ప్రజలు వేసిన ఓట్లతో జగన్ ముఖ్యమంత్రి అయ్యారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తాననడం చంద్రబాబు చేతగానితనమని విమర్శించారు. జగన్ కన్నా అదనంగా మరో 10 సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చెప్పే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. పిఠాపురం ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించి, వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పిఠాపురం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తుందని చెప్పారు.

88.03% పింఛన్ల పంపిణీ పూర్తి

ఒకటిన్నర రోజుల్లోనే 57.83 లక్షల మందికి రూ.1,749.53 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఒకటిన్నర రోజుల్లోనే 88.03 శాతం మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ చేతివృత్తిదారులకు అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ కొనసాగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. ఎక్కువగా అనారోగ్య సమస్యలు ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి సచివాలయాల ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. గురువారం సాయంత్రం వరకు మొత్తం 57,83,325 మంది లబ్ధిదారులకు రూ.1,749.53 కోట్లను పంపిణీ చేసినట్టు అధికారులు వెల్లడించారు. శుక్రవారం కూడా ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు సచివాలయాల వద్ద పంపిణీ కొనసాగుతుంది.


విజయవాడ రామలింగేశ్వరనగర్ సచివాలయంలో పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారు


పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాపురంలో ఏసురత్నానికి పింఛన్ ఇస్తున్న డిజిటల్ అసిస్టెంట్


తిరుపతిలో పింఛన్ల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

అయ్యో.. అవ్వాతాతలు!

చంద్రబాబు కుట్రలతో విలవిల.. పింఛన్లకు వెళ్లి ఎండ దెబ్బ తాళలేక మృత్యువాత

- గురువారం ఒక్కరోజే 19 మంది మృతి
- రెండు రోజుల్లో మొత్తం 39 మంది కన్నుమూత
- టీడీపీ కుట్రల వల్లే తమకీ దుర్గతి పట్టిందని బాధితుల ఆక్రందన
- బాబుకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు


విజయనగరం జిల్లాలో పింఛను కోసం వచ్చి బయోమెట్రిక్ పనిచేయక నిరాశతో వెనుదిరుగుతున్న పెంటమ్మ


ఒంగోలులో పింఛను కోసం వచ్చి సొమ్మసిల్లి చెట్టు నీడన సేదతీరుతున్న పెద కోటయ్య

సాక్షి, నెట్‌వర్క్: టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలతో అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు గురువారం కూడా విలవిల్లాడారు. వలంటీర్లతో పింఛన్ల పంపిణీ చేయించకుండా చంద్రబాబు ముఠా పన్నిన పన్నాగాలతో లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఎండదెబ్బ తాళలేక కొందరు, వడదెబ్బతో మరికొందరు, అస్వస్థతకు గురై ఇంకొందరు మృత్యువాత పడ్డారు. బుధవారం 20 మంది అవ్వాతాతలు మరణించగా గురువారం మరో 19 మంది మృతి చెందారు. రెండు రోజుల్లోనే 39 పింఛన్ లబ్ధిదారులు చంద్రబాబు కుట్రలకు బలయ్యారు. తమకీ కష్టాలు రావడానికి చంద్రబాబే కారణమని లబ్ధిదారులు, మృతుల కుటుంబ సభ్యులు శాపనార్థాలు పెట్టారు. తమ ఉసురు అయనకు తగులుతుందన్నారు.

■ మండుటెండలో పింఛను కోసం నడుచుకుంటూ సచివాలయానికి బయలుదేరిన ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చీపురుగూడెంకు చెందిన మేకల తిరపతయ్య (80) ఎండకు తట్టుకోలేక రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వేగూరు వసంతపురం దళితవాడలో తుమ్మ నరసమ్మ (80) పింఛన్ కోసం వెళ్తూ వడదెబ్బ తగిలి మృతిచెందింది. నంద్యాల జిల్లా పాములపాడు మండలం మద్దూరులో కుమారుడి బైక్‌పై పింఛను కోసం వెళ్తూ మార్గమధ్యంలోనే సానె తిరుపాలు (74) ఎండదెబ్బకు ప్రాణాలు కోల్పోయాడు. అలాగే మద్దూరుకు చెందిన ముల్లా నూర్జహాన్ (54)కు వితంతు పింఛన్ వస్తోంది. పింఛను తీసుకునేందుకు సచివాలయానికి నడుచుకుంటూ బయలుదేరింది. ఎండ తీవ్రతకు మధ్యలోనే కుప్పకూలిపోయి మరణించింది. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం లగడపాడులో వేమవరపు రమేష్ (51)కు డప్పు కళాకారుడిగా ప్రభుత్వం పెన్షన్ ఇస్తోంది. ఈ క్రమంలో పింఛన్ తీసుకునేందుకు సచివాలయానికి వెళ్లిన ఆయన ఎండ దెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురై మృత్యువాత పడ్డాడు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చిన్నపొడమలకు చెందిన తలారి ఆదెమ్మ (74), తాడిపత్రి టైలర్స్ కాలనీకి చెందిన హుస్సేన్ మియా (65) కూడా సచివాలయాలకు వెళ్తూ వడదెబ్బతో మరణించారు. కణేకల్లు మండలం పులచెర్లలో వితంతువు హనుమక్క (49) ఎండను తాళలేక స్పృహ తప్పిపడిపోయింది. సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం కే గుండుమల పంచాయతీ పరిధిలోని డీ గొల్లహట్టికి చెందిన పింఛన్‌దారుడు తిమ్మన్న (65) గ్రామ సచివాలయానికి వెళ్లాడు. తిరిగొచ్చాక నీరసంతో పడుకున్నాడు. ఆ కాసేపటికే వడదెబ్బకు గురై మృత్యువాత పడ్డాడు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం చిన్నసానకు చెందిన తెలగవలస తవిటమ్మ (55) సచివాలయానికి బయలుదేరుతూ గుండెపోటుతో మృతి చెందింది. శ్రీకాకుళానికి చెందిన శిర్ల ప్రకాష్ (52) బధిరుడు. సచివాలయానికి పింఛన్ కోసం వెళ్లాడు. తిరిగొచ్చాక కుప్పకూలి ప్రాణాలు వదిలేశాడు. కృష్ణా జిల్లా బందరు మండలం కోన గ్రామానికి చెందిన నాయుడు వెంకట కృష్ణారావు (65) పింఛన్ కోసం సచివాలయానికి బయలుదేరుతూ బీపీ పెరిగి మృత్యువాత పడ్డాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట శివారు జయంతినగర్‌కు చెందిన దివ్యాంగురాలు నెల్లి సత్యవతి (65) గుండెపోటుకు గురై మృతి చెందింది. వైఎస్సార్ జిల్లా వేముల మండలం నారేపల్లిలో ఈశ్వరమ్మ పింఛన్ కోసం నల్లచెరువుపల్లె సచివాలయానికి వెళ్తూ వడదెబ్బ సోకడంతో అక్కడికక్కడే మరణించింది. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం రామభద్రాపురం పంచాయతీ చుక్కావారిపల్లెకు చెందిన మురుగేష్ (80) సచివాలయానికి వెళ్తూ మార్గంమధ్యలో సొమ్మసిల్లి బండరాయిపై పడిపోయాడు. బండరాయి తలకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆస్పత్రిగా తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరంలో జనపల అప్పల నర్సమ్మ (67) తనను పింఛన్ తీసుకునేందుకు సచివాలయానికి తీసుకువెళ్లాలని ఇద్దరు ముగ్గురిని అడిగింది. అయితే ఎవరూ రాలేదు. దీంతో గుండెపోటుతో మృత్యువాత పడింది. అలాగే కూనా రమణమ్మ (67) ఏలూరు ఆస్పత్రిలో 20 రోజులుగా చికిత్స పొందుతోంది. ఈసారి సచివాలయానికి వెళ్లి తీసుకునేందుకు అవకాశం లేకపోవడంతో ఆందోళనతో మృతి చెందింది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని గాజులనగరానికి చెందిన ఈశ్వరమ్మ(67) పెన్షన్ తీసుకునేందుకు సచివాలయం వద్దకు వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పింఛను కోసం కాకినాడ నుంచి విశాఖ వచ్చిన తీడ బాబూరావు వడదెబ్బతో మృతి చెందిన ఘటన గోపాలపట్నంలో చోటు చేసుకుంది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం జంగాలపల్లికి చెందిన మునెమ్మ (67) తన అల్లుడు ప్రభాకర్ బైక్‌పై పింఛన్ తీసుకునేందుకు నడింపల్లి సచివాలయానికి వెళ్ళింది. పింఛన్ తీసుకుని తిరిగి వస్తుండగా వాహనంపై నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో ఆమె కాలు విరిగింది.


పింఛన్ ఎప్పుడు ఇస్తారో అనుకుంటూ భోజనం క్యారేజీతో వెళుతున్న అన్నమయ్య జిల్లా శెట్టిపల్లికి చెందిన వృద్ధురాలు ఖాదర్ బీ


కాకినాడ జిల్లా తాళ్లూరులో పింఛన్ కోసం బారులు తీరిన వృద్ధులు, దివ్యాంగులు

ఎండకు ప్రాణం పోయినట్టైంది..



వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు ఇచ్చినప్పుడు హాయిగా ఇంత ముద్ద తిని ఇంటి వద్దే ఉండేవాడిని. చంద్రబాబు చేసిన పనితో సచివాలయానికి వెళ్లాల్సి వచ్చింది. ఈ ఎండకు ప్రాణం పోయినట్టయ్యింది. నాకు షుగర్, బీపీ ఉన్నాయి. ఈ ఎండలో అడుగు వేయాలంటేనే కష్టంగా ఉంది. ఇలాంటి పరిస్థితికి కారణమైన వారిని వదలకూడదు.

–గనగళ్ల నారాయణ, దేవునల్తాడ, శ్రీకాకుళం జిల్లా

అతి కష్టం మీద వచ్చా..



పింఛన్ కోసం నడుచుకుంటూ వచ్చాను. ఎండ ఎక్కువగా ఉండటంతో కళ్లు తిరిగాయి. గతంలో వలంటీర్లు మా ఇంటికే తెచ్చి ఇచ్చేవాళ్లు. చంద్రబాబు చేసిన పని వల్ల మాకీ కష్టాలు వచ్చాయి.

– అడ్డాడ లక్ష్మి, జక్కరపేట, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది

గత ఐదేళ్లుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇస్తే ఎంతో ఆనందంగా ఉన్నాం. ఇప్పుడు చంద్రబాబు చేసిన కుట్రలతో పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులమైన మేము సచివాలయం వద్దకు వెళ్లే పరిస్థితుల్లో లేము. ఇలాంటి పరిస్థితి తెచ్చిన చంద్రబాబుకు మా ఉసురు తప్పకుండా తగులుతుంది.

–మర్రి ఏసమ్మ, సంగీతరావు, మాచవరం, పల్నాడు జిల్లా

‘పసుపు’ దండు దడదడ

- ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు చుక్కలు
- అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న మాజీ ఎంపీ మాగంటి బాబు
- ఏలూరు నుంచి పోటీ చేసేది తానే అంటున్న బీజేపీ నేత తపన చౌదరి
- సత్యవేడులో ఆదిమూలంకు వ్యతిరేకంగా టీడీపీ నేతల సమావేశం
- అనంతపురం జిల్లాలో అన్ని స్థానాల్లోనూ అసమ్మతిగళం
- కడపలో మాధవిరెడ్డిపై భువనేశ్వరికి మహిళా కార్యకర్తల ఫిర్యాదు
- సుజనాకు జనసేన నుంచి వ్యతిరేకత


సత్యవేడులో ఆదిమూలం వద్దు అంటూ నిరసన తెలుపుతున్న టీడీపీ కార్యకర్తలు, నాయకులు


కడప విమానాశ్రయంలో నారా భువనేశ్వరితో టీడీపీ అసమ్మతి మహిళా కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/సత్యవేడు(తిరుపతి జిల్లా)/సాక్షి ప్రతినిధి, అనంతపురం/కడప రూరల్ /వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగుదేశం కూటమి అంతర్గత కుమ్ములాటలతో అట్టుడుకుతోంది. రాష్ట్రవ్యాప్తంగా టికెట్ల కేటాయింపుపై రేగిన నిరసన సెగలు ఎగసిపడుతున్నాయి. దీనికి తోడు ఇన్నాళ్లు నివురుగప్పిన నిప్పులా మౌనంగా ఉన్న సీనియర్లు ఆగ్రహజ్వాలతో రగిలిపోతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తీరుపై మండిపడుతున్నారు. బీజేపీ, జనసేనల్లోనూ అసమ్మతి తారస్థాయికి చేరడంతో పసుపు దండు దడదడలాడుతోంది. ఏలూరు ఎంపీ స్థానాన్ని టీడీపీ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్‌కు ఇవ్వడంపై స్థానికంగా నిరసన వ్యక్తమవుతోంది. ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు మహేష్ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై మాగంటి దంపతులు చంద్రబాబుతో భేటీయై తమ అక్కసును వెళ్లగక్కారు. చర్చలు అసంపూర్తిగా ముగిశాయని, మళ్లీ భేటీ ఉంటుందని, కార్యకర్తలు మంచి విషయం వింటారని బాబు సోషల్ మీడియాలో ఓ లేఖను పోస్టు చేయడం టీడీపీలో కలకలం రేపింది. సొంతపార్టీలోని ఇతర నేతలూ మహేష్‌కు దూరంగా ఉంటున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు అసలు కలిసి రావడం లేదు. దీనికితోడు కమల దళం కూడా టీడీపీ అభ్యర్థికి సహకరించడం లేదు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ బీజేపీ అధిష్టానం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గారపాటి చౌదరికి సీటు ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. ఎంపీ సీటు ఆశించిన తపన చౌదరి కూటమికి దూరంగా ఉంటున్నారు. తనకే బీజేపీ తరఫున టికెట్ వస్తుందని ధీమాగా చెబుతున్నారు. ఒకవేళ రాకపోయినా ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని స్పష్టం చేస్తున్నారు. దీంతో ఇక్కడ అభ్యర్థి మార్పు తప్పదనే వాదన వినిపిస్తోంది.

■ సత్యవేడు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోనేటి ఆదిమూలంను కొనసాగిస్తే ఓడిస్తామని పలువురు నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. గురువారం స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపం ఆవరణలో నియోజకవర్గస్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆదిమూలం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. అభ్యర్థిని మార్చకుంటే పార్టీకి ఓటమి తప్పదని హెచ్చరించారు.

■ అనంతపురం అర్బన్ సీటు కోసం యత్నించి విఫలమైన ప్రభాకర్ చౌదరి గురువారం అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్‌ను ప్రచారానికి రాకుండా అడ్డుకున్నారు. ప్రసాద్‌కు సహకరించేది లేదని చౌదరి వర్గీయులు తెగేసి చెప్పారు. గుంతకల్లులో గుమ్మనూరు జయరామ్‌కు బాబు సీటు ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనూ బడా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్ర బాబుకూ టీడీపీ నేతలు సహకరించడం లేదు. ఉరవకొండ టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్‌నూ ఓటమి భయం వెంటాడుతోంది. పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లిలో గురువారం హిందూపురం టీడీపీ పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వర్గాలు బాహాబాహీకి దిగాయి. అంతకు ముందు పార్థసారథి ఇంట్లో సవిత, బీకేలు సమావేశమైన సమయంలోనూ ఒకరిపైఒకరు చెప్పులు విసురుకున్నట్టు సమాచారం. సవిత, బీకే ఇద్దరూ రాజీపడినా.. కార్యకర్తలు ‘మేం తగ్గబోం’ అంటూ భీష్మించినట్టు తెలిసింది. కోడలికి పుట్టపర్తి సీటు ఇప్పించుకున్న పల్లె రఘునాథరెడ్డికీ వడ్డెర సామాజిక వర్గం నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. పల్లవు జయచంద్రమోహన్ చంద్రబాబు ఇంటి వద్దే ధర్నా చేయడం, టికెట్ కోసం యత్నించిన డీఎస్పీ వేణుగోపాల్ తాజాగా వైఎస్సార్ సీపీలో చేరడంతో పల్లెతోపాటు ఆయన కోడలు సింధూర రెడ్డి ఏం చేయాలో పాలుపోక తలలుపట్టుకుంటున్నారు.

■ తెలుగుదేశం పార్టీ కడప ఎమ్మెల్యే సీటును మాధవిరెడ్డికి కేటాయించినప్పటి నుంచి వర్గపోరు తారస్థాయికి చేరింది. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గురువారం కడప 44వ డివిజన్‌లోని చెంద్రాయుడు కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు స్వాగతం పలకడానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డితో పాటు ఆయన భార్య, కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవిరెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి, మాధవిరెడ్డి తీరుపై నగర మహిళా విభాగం అధ్యక్షురాలు మీనాక్షితోపాటు కార్యకర్తలు భువనేశ్వరికి ఫిర్యాదు చేశారు. మాధవిరెడ్డి తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థిని మార్చాలని కోరారు.

■ విజయవాడ పశ్చి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి వై.సుజనాచౌదరికి జనసేన నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పోతిన మహేష్ వర్గం సుజనాకు సహకరించేది లేదని బహిరంగంగానే హెచ్చరిస్తోంది. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ఇప్పటికే పోతిన అల్టిమేటం జారీ చేశారు. సుజనా చౌదరి గురువారం వినాయకుడి గుడి, దుర్గగుడి, భవానీపురం దర్గాల్లో పూజలు, ప్రార్థనలు చేశారు. భవానీపురంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కేశినేని చిన్ని, జలీల్‌ఖాన్, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమంలో పోతిన మహేష్, జనసేన నేతలు పాల్గొనలేదు. సుజనాచౌదరి నుంచి పోతిన మహేష్‌కు సరైన ఆహ్వానం లేదని ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే పోతిన మహేష్ అభిమానులు సుజనాకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. బ్యాంకులను దోచుకున్న సుజనకు సహకరించబోమని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల సుజనా.. పవన్‌ను కలిసి జనసేన నేతలు సహకరించేలా చూడాలని విజ్ఞప్తి చేసిన ఫొటోతోపాటు గతంలో పవన్ తన తల్లిని సుజనా బినామీగా ఉన్న కొన్ని చానల్స్ దూషించాయని ఆరోపించిన వీడియోను సోషల్‌మీడియాలో జనసైనికులు వైరల్ చేస్తున్నారు.

పురందేశ్వరి బరితెగింపు!

▶ మొదటి పేజీ తరువాయి

ఒకరకంగా రాజ్యాంగ వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చెయ్యటానికి దిగారని బీజేపీ వర్గాలే పేర్కొంటున్నాయి. ‘‘బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని అడ్డం పెట్టుకొని కేంద్ర ఎన్నికల సంఘాన్ని, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని రాజకీయంగా ప్రభావితం చేయటం... రాష్ట్రంలో ఇతర అధికారులందరినీ బెదిరించడం అనే ధోరణి ఈ లేఖలో కనిపిస్తోంది’’ అని బీజేపీలో మొదటి నుంచీ ఉంటున్న సీనియర్ నాయకుడొకరు అభిప్రాయపడ్డారు. తన మరిది, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడి ప్రయోజనాలే పరమావధిగా ఆమె పనిచేస్తున్నారని, ఈ క్రమంలో తన పదవిని దుర్వినియోగం చేస్తున్నారని మరో సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు. నిజానికి ఈ ఎన్నికల్లో బీజేపీ కేవలం ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తోంది. కానీ తాము అసలు పోటీలోనే లేని అనంతపురం, నెల్లూరు, చిత్తూరు, నంద్యాల , పల్నాడు, ప్రకాశం జిల్లాల ఎస్పీలను కూడా బదిలీ చేయాలంటూ పురందేశ్వరి లేఖ రాయటంతో... ఇది బీజేపీ ప్రయోజనాల కోసం కాదనేది స్పష్టంగా తేలిపోయింది. బీజేపీకున్న అధికార బలాన్ని తాకట్టు పెట్టయినా తెలుగుదేశానికి మేలు చేయాలనే దృఢ చిత్తంతో ఆమె పనిచేస్తున్నారని, చంద్రబాబు ప్రయోజనాల కోసం పూర్తిగా దిగజారిపోయారనేది కూడా స్పష్టమవుతోంది. 2019 ఎన్నికల సమయంలో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)తో పాటు డీజీపీని కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసినందున... ఇప్పుడు కూడా అలా చేయాలని ఒత్తిడి తెచ్చేందుకే చంద్రబాబు పురందేశ్వరితో ఈ లేఖ రాయించారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో పెద్ద ఎత్తున పోలీసు అధికారులను బదిలీ చేయించటం ద్వారా మిగిలిన వారిని భయపెట్టి తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలన్నది వీరి ఎత్తుగడన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బెదిరింపు ధోరణి

సాధారణంగా ఎవరిపైనైనా ఫిర్యాదు చేస్తే.. వారి వల్ల తామెదుర్కొంటున్న ఇబ్బందులు తెలుపుతూ వినతిపత్రాలు ఇస్తూ ఉంటారు. కానీ దగ్గుబాటి పురందేశ్వరి 22 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ కోరుతూ.. ఆయా స్థానాల్లో ఎవరిని నియమించాలో కూడా సూచిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారంటే... బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని అడ్డం పెట్టుకొని పురందేశ్వరి– చంద్రబాబులు అధికారులను ఎలా బెదిరించాలని ఆలోచన చేస్తున్నారో అర్థమైపోతుందని అటు రాజకీయ, ఇటు అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. సాధారణ ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి సంబంధం ఉండని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (విపత్తుల నివారణ) డీజీ, సీఐడీ ఏడీజీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ అధికారులను సైతం బదిలీ చేయాలని ఈ లేఖలో పేర్కొన్నారంటే... తమకు నచ్చని, తాము బెదిరించాలని అనుకున్న అధికారులకు వ్యతిరేకంగా ఈ ఫిర్యాదు చేసినట్టు స్పష్టంగా తెలిసిపోతోంది. బాబు అవినీతి కేసులపై విచారణ జరుపుతున్న సీఐడీ ఏడీజీకి, ఎన్నికల ప్రక్రియకు సంబంధం లేకపోయినా పురందేశ్వరి అతనిపైనా ఫిర్యాదు చేయడం ... ఎన్నికలు సజావుగా జరగాలన్న ఆలోచన కన్నా ఇతర దురుద్దేశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

తొలి నుంచీ సొంత రాజకీయ అజెండాతోనే

పది నెలల కిత్రం బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పురందేశ్వరి తన కుటుంబ, బంధువుల ప్రయోజనాల కోసమే సొంత అజెండాతో పనిచేస్తున్నారని బీజేపీ నాయకులే విమర్శిస్తున్నారు. రాష్ట్రంలోనూ, దేశ వ్యాప్తంగా చాలా మంది ఆయా కేసుల్లో బెయిల్‌పై కొనసాగుతుండగా.. పురందేశ్వరి మాత్రం బాధ్యతలు చేపట్టిన మూడు నెలలకే రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టు సీజేకి లేఖ రాయడాన్ని ఇప్పుడు పలువురు గుర్తు చేస్తున్నారు. బీజేపీ– టీడీపీ పొత్తు లేని సమయంలో కూడా ఏళ్ల తరబడి చంద్రబాబు చేస్తున్న రాజకీయ డిమాండ్‌కు అనుగుణంగా ఆమె అప్పట్లో సీజేకి లేఖ రాశారని కమలం పార్టీలో అంతర్గతంగా పెద్ద చర్చ సాగింది. అంతకు ముందు నాలుగేళ్ల పాటు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై టీడీపీ చేస్తున్న ఆరోపణలనే పురందేశ్వరి వల్లె వేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణలు జరపాలంటూ కేంద్ర హోంమంత్రికి సైతం లేఖలు రాశారంటే.. మొదట నుంచీ చంద్రబాబు– పురందేశ్వరిల రాజకీయ సంబంధాలు ఎలా ఉండేవో అర్థమవుతుందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆమెది శిఖండి పాత్ర

- పురందేశ్వరిపై పేర్ని నాని ధ్వజం

సాక్షి,అమరావతి: మరిది కళ్లల్లో ఆనందానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి బరితెగింపు రాజకీయం చేస్తున్నారని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. 22 మంది ఐపీఎస్‌ల బదిలీకి ఆమె సీఈసీకి ఆదేశాలివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 22 మంది ఐపీఎస్‌ల బదిలీ చేస్తూ.. ఆయా స్థానాల్లో ఎవర్ని నియమించాలో పురందేశ్వరి ఏ హోదాలో సిఫార్సు చేస్తారని నిలదీశారు. 22 మంది ఐపీఎస్‌లపై అవినీతి బురదజల్లడం ఎంతవరకు సబబన్నారు. బాబు జనతాపార్టీకి పురందేశ్వరి అధ్యక్షురాలని, బీజేపీకి కాదని దుయ్యబట్టారు. నాడు కన్నతండ్రి చావులోనూ, నేడు పేదల పక్షపాతి సీఎం జగన్‌పై బురద చల్లడంలోనూ ఆమెది శిఖండి పాత్రని ఆరోపించారు. బీజేపీలో తెలుగుదేశం దొంగలు పడ్డారనడానికి పోటీ అభ్యర్థులే సాక్ష్యమన్నారు. వదిన, పవన్‌కళ్యాణ్, రామోజీ, రాధాకృష్ణల్ని మేనేజ్ చేయొచ్చేమో గానీ, రాష్ట్ర ప్రజల్ని లొంగదీసుకోవడం చంద్రబాబు తరం కాదని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వ్యవహరించడం ఆమె ఎప్పుడో మానేశారన్నారు. నారా చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారనేది నూటికి నూరుపాళ్లూ నిజమని ఆరోపించారు. ఐపీఎస్ అధికారులపై అడ్డగోలుగా అవినీతి మరకలు అంటించడం విచక్షణా? సంస్కారమా? అని నిలదీశారు.

రామోజీ మార్గదర్శి అక్రమాలకు వెన్నుదన్ను

రామోజీ మార్గదర్శి సంస్థ అక్రమాలను వెలికి తీసిన అధికారులపైనే పురందేశ్వరి ఎన్నికల సంఘానికి లేఖలు రాయడం చూస్తే ఆమె దిగజారుడు రాజకీయం తెలుస్తోందని దుయ్యబట్టారు. ప్రజాధనం లూటీ చేసిన చంద్రబాబును ఆ కుంభకోణాల నుంచి కాపాడేందుకే 22 మంది ఐపీఎస్ అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేశారన్నారు. బీజేపీలో ఇన్నాళ్లూ పనిచేసిన సీనియర్లను, ఆర్‌ఎస్ఎస్ నేతలకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేశారన్నారు. ‘40 ఏళ్లకు పైగా బీజేపీలో పనిచేస్తున్న వారు ఇప్పుడెందుకు కనిపించడం లేదు? బీజేపీలో తెలుగుదేశం దొంగలు పడి అసెంబ్లీ, ఎంపీల టికెట్లను దోచేసుకుంటున్నారు. ఈ విషయాన్ని బీజేపీ ఢిల్లీ పెద్దలు గమనించుకోవాలి’ అని అన్నారు.

నిరాధార ఆరోపణలతో లేఖ రాసినందుకు జైల్లో వేయాలి

‘‘ఐజీలు, జిల్లా ఎస్పీలనూ బదిలీ చేసి వారి స్థానాల్లో ఫలానా వారిని నియమించాలని సిఫార్సు చేస్తారా? ఆమె ఎన్నికల సంఘానికే బాస్‌గా వ్యవహరిస్తారా? మీరెందుకు మాట్లాడటం లేదు. ఇలాంటి తప్పుడు ఉత్తరాలను తిరిగి ఆమె ముఖాన్నే కొట్టాలి గదా’’? దీనిపై మాకు సమాధానం చెప్పాల్సిందేనని ఎన్నికల సంఘాన్ని పేర్ని నాని ప్రశ్నించారు. ఆధారాలైనా తెమ్మని ఆమెకు నోటీసులివ్వాలి. లేదంటే, నిరాధార ఆరోపణలతో లేఖ రాసినందుకు జైల్లోనైనా వేయాలి అని నిలదీశారు. పురందేశ్వరి బరితెగింపు రాజకీయంపై, ఎన్నికల సంఘం అధికారుల మౌనంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల సంఘానికి శుక్రవారం ఫిర్యాదు చేయనున్నామని చెప్పారు.

క్లుప్తంగా...

రాజంపేట టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిపై కేసు నమోదు



రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రహ్మణ్యంపై కేసు నమోదైంది. ఎన్నికల నియమావళిని అతిక్రమించి అనుమతి లేకుండా ఏబీ గార్డెన్స్‌లో గురువారం సభ నిర్వహించారు. దీనిపై స్థానిక ఎన్నికల అధికారి రాంబాబు ఫిర్యాదు మేరకు సుగవాసిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మద్దయ్య ఆచారి వెల్లడించారు.

పెత్తందార్ల కోసం పనిచేసే కిరాయి నేత చంద్రబాబు

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు



పాలకొల్లు అర్బన్: పెత్తందార్ల కోసం పని చేసే కిరాయి రాజకీయ నాయకుడు చంద్రబాబు అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం పూలపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలంతా కూలీలుగానే జీవించాలన్న చంద్రబాబు ఆలోచనలకు చరమగీతం పాడే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. చంద్రబాబు, నారా లోకేశ్, జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్‌కు రాష్ట్రాన్ని పాలించే హక్కు ఉందా అని నిలదీశారు. శింగనమల అసెంబ్లీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న వీరాంజనేయులును టిప్పర్ డ్రైవర్ అని, సంతకం కూడా పెట్టడం రాదని చంద్రబాబు చులకనం చేయడం సరికాదన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డులో ఆవిష్కరించిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రశంసించారు.


షర్మిల అన్యాయం చేసింది

దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కుటుంబ సభ్యుడు రాధాకృష్ణ ఆవేదన



సి.బెళగల్: దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కుటుంబానికి అండగా ఉండి, కోడుమూరు అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్ ఇస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చినా, రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న షర్మిల అన్యాయం చేశారని పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత 80 ఏళ్లుగా తమ కుటుంబం పార్టీకి అంకితభావంతో సేవలు అందిస్తున్నదని తెలిపారు. తనకు కోడుమూరు నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్‌ను కేటాయించకపోవడం దారుణమన్నారు. రాహుల్‌గాంధీ దామోదరం సంజీవయ్య నివాసాన్ని సందర్శించిన సందర్భంలో కుటుంబ సభ్యుల నిజాయితీ, నిబద్ధతను తెలుసుకుని తనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని, భవిష్యత్‌లో రాజకీయంగా ఉన్నత స్థాయిని కల్పిస్తామని మాట ఇచ్చారన్నారు. రాష్ట్ర పార్టీలోకి నిన్నగాక మొన్న వచ్చిన షర్మిల మధ్యవర్తులను నమ్మి తనకు కాకుండా పార్టీ వ్యతిరేకులకు కోడుమూరు టికెట్ ఇవ్వడం తమ కుటుంబాన్ని అణగదొక్కడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి శశిధర్‌కుమార్, మండల అధ్యక్షుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మోదీ అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాలి: బీవీ రాఘవులు



సాక్షి, అమరావతి: అనేక రాష్ట్రాల్లో బీజేపీ పరిస్థితి దిగజారిపోతున్నదని, దీన్ని కప్పిపుచ్చుకోవడానికే 400 సీట్లు సాధిస్తామని ప్రధాని మోదీ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పి కొట్టాలని సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవాడలో గురువారం ప్రారంభమయ్యాయి. రాఘవులు మాట్లాడుతూ.. ఇండియా వేదికలో పార్టీలన్నీ బీజేపీకి వ్యతిరేకంగా సీట్లు సర్దుబాటు చేసుకుని ఐక్యంగా ఎన్నికల పోరుకి సిద్ధమయ్యాయన్నారు. మోదీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ, ఐటీలను ఇండియా వేదికలోని ప్రతిపక్ష పార్టీలపై ఉసిగొల్పుతున్నదని చెప్పారు. అయినా ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో టీడీపీ, జనసేన కూటమి కట్టాయని, ద్రోహులతో చేతులు కలిపి రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలను ప్రజలు నిలదీయాలన్నారు. వైఎస్సార్‌సీపీ కూడా బీజేపీని విమర్శించడం లేదని చెప్పారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కలిసి అసెంబ్లీ ఎన్నికల్లో ముందుకు వెళ్లాలనుకుంటున్నామని రాఘవులు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లాలోని 300 మంది మిమ్స్ కార్మికులు 64 రోజుల నుంచి, రాజమండ్రిలోని ఆంధ్రపేపర్ లిమిటెడ్‌లో 2,500 మంది కార్మికులు 3 రోజుల నుంచి చేస్తున్న నిరవధిక సమ్మెలకు సీపీఎం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

చంద్రబాబే ప్రధాన నిందితుడు

రెండో నిందితుడు అచ్చెన్నాయుడు • పక్కా పథకం ప్రకారమే 'స్కిల్' కుంభకోణం





సాక్షి, అమరావతి : టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పక్కా పన్నాగంతోనే రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణానికి పాల్పడ్డారని సీఐడీ నిగ్గు తేల్చింది. ఇప్పటికే ఈ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా 52 రోజులు ఉండటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి సమగ్ర వివరాలతో సీఐడీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో గురువారం చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో చంద్రబాబే ప్రధాన నిందితుడు (ఏ1)గా, రెండో నిందితుడి (ఏ2)గా అప్పటి కార్మిక శాఖ మంత్రి అచ్చెన్నాయుడును పేర్కొంది. వారిపై ఐపీసీ సెక్షన్లు 120 (బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477 (ఏ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37తోపాటు అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు 13(2) రెడ్‌విత్ 13(1) (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేసింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో ఒప్పందాన్ని తెరపైకి తీసుకువచ్చి నిబంధనలకు విరుద్ధంగా ప్రజాధనాన్ని కొల్లగొట్టారని సీఐడీ ఈ చార్జిషీట్‌లో పేర్కొంది. రూ.330 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌ను రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌గా కనికట్టు చేశారని వివరించింది. ఒప్పందంలో పేర్కొన్న ప్రకారం సీమెన్స్ కంపెనీ వాటా 90 శాతం నిధుల్లో ఒక్క రూపాయి కూడా వెచ్చించకపోయినా, ప్రభుత్వ వాటా 10 శాతం నిధులను జీఎస్టీతోసహా రూ.371 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా చెల్లించారని తెలిపింది. అందులో రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు కొల్లగొట్టారని వివరించింది. సీఐడీ చార్జిషీట్‌లోని ప్రధాన అంశాలు ఇవీ...

2017లోనే బయటపడినా..

2017లోనే కేంద్ర జీఎస్టీ అధికారులు పుణెలోని పలు షెల్ కంపెనీల్లో జరిపిన సోదాల్లో ఏపీఎస్ఎస్‌డీసీకి సరఫరా చేసిన నకిలీ ఇన్వాయిస్‌లను గుర్తించి, ఏపీ ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చారు. దీనిపై విచారణ చేయకుండా ఏసీబీని చంద్రబాబు అడ్డుకున్నారు. ఆ వెంటనే ఏపీఎస్ఎస్‌డీసీ ఆఫీసులో ఈ ప్రాజెక్టు ఫైళ్లను మాయం చేశారు. 2019లో పుణెకి చెందిన ఓ సామాజిక కార్యకర్త ఈ కుంభకోణం గురించి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. దాంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. సిట్ దర్యాప్తులో చంద్రబాబు అవినీతి బాగోతం మొత్తం బట్టబయలైంది. సీఐడీ అధికారులు జర్మనీలోని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు తమకు ఆ ప్రాజెక్టు గురించే తెలియదని స్పష్టం చేసింది. డిజైన్‌టెక్, ఇతర షెల్ కంపెనీల ద్వారా సాగించిన కుంభకోణాన్ని కూడా సిట్ అధికారులు ఛేదించారు. స్కిల్ కుంభకోణానికి కర్త కర్మ క్రియ అంతా చంద్రబాబే అన్నది నిర్ధారణ అయింది.

రూ.370 కోట్ల నుంచి రూ.3,300 కోట్లకు పెంచేసి

సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ ముసుగులో పక్కా పథకం ప్రకారం ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అనంతరం చంద్రబాబు తన బినామీ సంస్థ డిజైన్‌టెక్‌ను రంగంలోకి దింపారు. ఈ ప్రాజెక్టులో చంద్రబాబు బినామీలు, సన్నిహితులైన అప్పటి ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె. లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు కీలకంగా వ్యవహరించారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.370 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3,300 కోట్లకు పెంచేశారు. ప్రభుత్వం 10 శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ 90 శాతం పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు 2015 జూన్ 30న ఉత్తర్వులు జారీ చేశారు. ఒప్పందంలో చెబుతున్నట్లుగా సీమెన్స్– డిజైన్‌టెక్ కంపెనీలు వాటి వాటా 90 శాతంలో ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు. కానీ ఏపీఎస్ఎస్‌డీసీ మాత్రం తన వాటా కింద డిజైన్‌టెక్ కంపెనీకి రూ.371 కోట్లు విడుదల చేసేసింది. అప్పటి ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల అభ్యంతరాలను చంద్రబాబు బేఖాతరు చేస్తూ రూ.371 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. అందుకోసం ఈ ప్రాజెక్టు నోట్ ఫైళ్లపై 13 చోట్ల చంద్రబాబు సంతకాలు చేశారు. డిజైన్‌టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లతో అక్రమంగా తరలించారు. షెల్ కంపెనీల సృష్టికర్తలు, దళారుల కమీషన్లు పోను చంద్రబాబుకు రూ.241 కోట్లు చేర్చారు. డిజైన్‌టెక్, పీవీఎస్పీ స్కిల్లర్ తదితర షెల్ కంపెనీల ద్వారా నిధులను హవాలా మార్గంలో మళ్లించారు.

దర్యాప్తు చేస్తున్న ఈడీ

మనీ లాండరింగ్ ద్వారా నిధులు మళ్లించిన స్కిల్ స్కామ్ గురించి సీఐడీ అధికారులు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి నివేదించారు. దాంతో రంగంలోకి దిగిన ఈడీ ఈ కుంభకోణంలో కీలక పాత్రధారులైన సీమెన్స్ కంపెనీ అప్పటి ఎండీ సుమన్ బోస్, డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ వికాస్ ఖన్వేల్కర్, చార్టెడ్ అకౌంటెంట్ ముకుల్ చంద్ర అగర్వాల్, షెల్ కంపెనీల సృష్టికర్త సురేశ్ గోయల్‌ను అరెస్ట్ చేసింది. డిజైన్‌టెక్ కంపెనీకి చెందిన రూ.31.20 కోట్ల ఆస్తులను జప్తు చేసింది కూడా.

సీఐడీ చార్జ్‌షీట్‌లో పేర్కొన్న నిందితులు

- ఏ1: చంద్రబాబు, టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి
- ఏ2: కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రి
- ఏ3: గంటా సుబ్బారావు, టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ - సీఈవో
- ఏ4: కె.లక్ష్మీనారాయణ, టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్
- ఏ5: సీమెన్స్, డిజైన్‌టెక్, పీవీఎస్పీ స్కిల్లర్ తదితర కంపెనీల అధికారులు

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం కోర్టు

ఆయన బెయిల్ రద్దు పిటిషన్‌పై కొనసాగుతున్న విచారణ

స్కిల్ స్కామ్‌లో తనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలన్న చంద్రబాబు వినతిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కుంభకోణానికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నందున ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. మరోవైపు ఈ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని సీఐడీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చంద్రబాబు కుటుంబ సభ్యులు రెడ్‌బుక్ పేరుతో ఈ కేసులో కీలక సాక్షులు, అధికారులను బెదిరింపులకు గురిచేసి దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్నారని కూడా సీఐడీ ఆ పిటిషన్‌లో పూర్తి ఆధారాలతో పేర్కొంది.

బాబుకు ఎన్నికల సంఘం నోటీసులు

- 48 గంటల్లో సమాధానం చెప్పాలని ఆదేశం
- లేకపోతే కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని వెల్లడి
- వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుపై స్పందించిన ఏపీ సీఈవో ముఖేష్ కుమార్ మీనా
- ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా బహిరంగ సభల్లో బాబు ప్రసంగాలు
- ప్రాథమికంగా నిర్ధారించిన రాష్ట్ర ఎన్నికల సంఘం

సాక్షి, అమరావతి: 'బహిరంగ సభల్లో మీరు చేస్తున్న ప్రసంగాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా ఉన్నాయి. వీటిపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వండి...' అంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబుకు బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నోటీసులు జారీ చేశారు. ఎమ్మిగనూరు, మార్కాపురం బాపట్లలో చంద్రబాబు చేసిన ప్రసంగాలపై వైఎస్సార్‌సీపీ ఈ నెల ఒకటో తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దానిని రాష్ట్ర ఎన్నికల సంఘం పరిశీలించి చంద్రబాబు ప్రసంగంలో ఉపయోగించిన పదాలు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వచ్చే విధంగా ఉన్నాయని ప్రాథమికంగా నిర్ధారించింది. బహిరంగ సభల్లో ప్రసంగించేటప్పుడు నాయకులు కొంతమేర సంయమనం పాటించాలని, దిగజారే స్థాయిలో ప్రసంగాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం సూచించింది. కానీ చంద్రబాబు నాయుడు తన ప్రసంగాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వ్యక్తిగతంగా పరుష పదజాలంతో దూషిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. ఇదే విషయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును సీఈవో పరిశీలించి చంద్రబాబుకు నోటీసులు జారీచేశారు. ఒకవేళ 48 గంటల్లోపు సమాధానం ఇవ్వని పక్షంలో వివరణ ఇవ్వలేదని భావించి తదుపరి చర్యల కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించనున్నట్లు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

పాస్టర్ల గౌరవ వేతనాన్ని కించపర్చడం తగదు బాబూ..

- చర్చిలను కూల్చేస్తామని బెదిరిస్తారా?
- చంద్రబాబు నుంచి క్రైస్తవులకు ప్రాణహాని
- రాయలసీమ చర్చి పాస్టర్ల అసోసియేషన్ ఆందోళన



చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పాస్టర్లు, క్రైస్తవులు

చిత్తూరు రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబుకు మరీ ఇంతటి కడుపుమంట తగదని, పాస్టర్లకు ఇచ్చే రూ.5 వేల గౌరవవేతనాన్ని కించపరచడం దారుణమని రాయలసీయ చర్చి పాస్టర్ల అసోసియేషన్ జిల్లా చైర్మన్‌లు జాషువా, ధనరాజ్, రమేష్‌ప్రసాద్‌లు మండిపడ్డారు. చంద్రబాబు పాస్టర్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద గురువారం రోడ్డెక్కారు. నోటికి నల్ల రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రెండు రోజుల కిందట చంద్రబాబు క్రైస్తవులు, పాస్టర్లను కించపరిచేలా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే చేసి అనుమతుల్లేని చర్చిలను కూల్చేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాస్టర్లకు ఇస్తున్న రూ.5 వేల గౌరవేతనాన్ని కించపరచడం సబబు కాదని హితవుపలికారు. ఇక పాస్టర్లు దళితులంటూ అవమానపరుస్తున్నారని తెలిపారు. అధికారంలోకి రాకముందే చంద్రబాబు ఇలా వ్యవహరిస్తే.. పొరపాటున సీఎం అయితే ఈ రాష్ట్రంలో క్రైస్తవులు బతకడం కష్టమని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నుంచి పాస్టర్లకు ప్రాణహాని ఉందని చెప్పారు. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చంద్రబాబు ఒక్కడు మాత్రమే గెలిచారని, ఈసారి ఆయన కూడా గెలవలేడని స్పష్టం చేశారు. జిల్లాలో 30 శాతం మంది క్రైస్తవులు చంద్రబాబును చిత్తు చిత్తుగా ఓడిస్తారని చెప్పారు. అనంతరం చంద్రబాబు వ్యాఖ్యలపై చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డేవిడ్, జాన్సన్, నవీన్‌కుమార్, చంద్రశేఖర్, విజయ్‌కుమార్, రాజరత్నం, కిషోర్‌కుమార్, పాస్టర్లు 200 మంది పాల్గొన్నారు.

కుప్పంలో ఎన్నికల కోడ్‌కు టీడీపీ తూట్లు

- పింఛనుదారులపై ప్రేమను నటిస్తూ ఎన్నికల ప్రచారం
- ఆటోల్లో తరలిస్తూ ఓటు వేయాలని అభ్యర్థన
- సచివాలయాల వద్ద మజ్జిగ ఇస్తూ కరపత్రాల పంపిణీ



ములకలపల్లి సచివాలయం లోపల మజ్జిగ ప్యాకెట్లు పంచుతున్న టీడీపీ నాయకుడు మురళి

కుప్పంరూరల్ (చిత్తూరు జిల్లా): కుప్పంలో టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. ఒకవైపు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి పింఛనుదారులను రోడ్డుపాలు చేసిన టీడీపీ నేతలు... మరోవైపు పింఛనుదారులపై ప్రేమను నటిస్తున్నారు. పింఛనుదారులను ఆటోల్లో సచివాలయాలకు తీసుకువెళుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. సచివాలయాల్లో వృద్ధులకు మజ్జిగ పంపిణీ చేస్తూ టీడీపీ కరపత్రాలను అందజేస్తున్నారు. కుప్పం మండల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం ప్రారంభమైంది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల, పంచాయతీ స్థాయి నాయకులు తమ గ్రామాల పరిధిలోని లబ్ధిదారులను ఆటోల్లో సచివాలయాలకు తరలించి, వారికి మజ్జిగ, ఇతర చల్లని పానీయాలు అందజేశారు. మరికొంతమంది సచివాలయాల ముందు మజ్జిగ ప్యాకెట్లతో తిష్ట వేసి లబ్ధిదారులకు పంచిపెట్టారు. లబ్ధిదారులు తిరిగి వెళ్లే సమయంలో 'ఈ పరిస్థితికి సీఎం వైఎస్ జగన్ కారణం. టీడీపీకి ఓటు వేస్తే ఒకటో తేదీ ఉదయమే మీ ఇంటి వద్దకు వచ్చి రూ.4వేలు పింఛను ఇచ్చే కార్యక్రమం చేపడతాం' అని టీడీపీ నేతలు చెబుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

కోడ్ ఉల్లంఘనపై ప్రశ్నిస్తే గొడవకు..

కుప్పం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నిస్తే గొడవకు దిగారు. దాసేగౌనూరు గ్రామంలో టీడీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా పెన్షనర్లను ఆటోల్లో తీసుకువెళుతూ ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేయాలని కోరుతుండగా, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మురుగేష్, మరికొందరు అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఇలా లబ్ధిదారులను తీసుకువచ్చి ప్రచారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. వెండుగంపల్లి సచివాలయం వద్ద నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న టీడీపీ శ్రేణులను వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్ ధర్మ, టౌన్ బ్యాంకు చైర్మన్ భాగ్యరాజ్ ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ములకలపల్లి సచివాలయంలో స్థానిక టీడీపీ నాయకుడు మురళి ఏకంగా సచివాలయం లోపలికే వెళ్లి లబ్ధిదారులకు మజ్జిగ, కూల్‌డ్రింక్‌లు పంపిణీ చేశారు.

అయ్యన్న తనయుడు విజయ్‌పై ఫిర్యాదు

అనుమతి లేకుండా సమావేశం నిర్వహణ

- నాయకులకు డబ్బులు పంపిణీ చేస్తుండగా అధికారులకు సమాచారం
- పోలీసులు, అధికారులను చూసి పరారైన చింతకాయల విజయ్
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే గణేష్



ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయరాంకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం, నాతవరం (అనకాపల్లి జిల్లా): ఎన్నికల కోడ్ ఉల్లంఘించి, అనుమతి లేకుండా సమావేశం నిర్వహించడమే కాక డబ్బులు పంపిణీ చేసినట్లు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్‌పై నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాంకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివతో కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని అతిక్రమించి డబ్బులు పంచుతూ ఓటర్లను ప్రభావితం చేసిన విజయ్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే ఘటనపై నాతవరం జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు నాతవరం ఎస్ఐ రామారావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు విలేకరులతో మాట్లాడుతూ.. నాతవరం గ్రామంలో శ్రీకోటమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో ఎలాంటి అనుమతులు లేకుండా గురువారం చింతకాయల విజయ్ పార్టీ ముఖ్య నాయకులతో గుట్టుగా సమావేశం ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ బూత్ కమిటీ సభ్యులు పార్టీ కార్యకర్తలకు డబ్బులు పంపిణీ చేశారని చెప్పారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులు, ఇతర అధికారులు అక్కడకు వెళ్లారని, అది పసిగట్టిన చింతకాయల విజయ్ అక్కడ్నుంచి కారులో పరారయ్యాడన్నారు. జీడి తోటలో ఉంచిన కార్లలో మండలస్థాయి నాయకులు ఉడాయించారన్నారు. ఘటనా స్థలంలో ఉన్న కుర్చీలు, ఇతర సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా.. ఫోన్ రావడంతో నిర్వాహకులను హెచ్చరించి వెళ్లిపోయారన్నారు.ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన విజయ్‌తో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, మరికొందరిపై పోలీసులకు, ఎంపీడీవో రాంబాబుకు ఫిర్యాదు చేశామన్నారు. ఎస్ఐ రామారావు మాట్లాడుతూ ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పెన్షనర్ల ఆత్మగౌరవాన్ని కించపర్చిన ద్రోహి చంద్రబాబు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం గత 58 నెలలుగా అనేక రకాల పింఛన్లు పంపిణీ చేస్తున్నా, ఎవరు ఏ పెన్షన్ తీసుకుంటున్నారనేది పక్కింటికి కూడా తెలియదని, ఇప్పుడు వారిని రోడ్డుకీడ్చిన ఘనత నక్కజిత్తులమారి ద్రోహి చంద్రబాబుదేనని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ధ్వజమెత్తారు. పెన్షనర్ల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు కించపరిచారని, వారిని ఇబ్బందులపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన గురువారం గుడివాడలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పెన్షన్ పొందే వారిలో వికలాంగులు, కిడ్నీ రోగులు, వృద్ధులు, వితంతువులలో చిన్న వయస్సులో భర్తను కోల్పోయినవారు, బయటకు రాలేని పరిస్థితులలో ఉన్నవారు అనేక మంది ఉన్నారని తెలిపారు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలనే సంకల్పంతో వలంటీర్ల ద్వారా పెన్షన్ల పంపిణీ విధానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక పథకాల ప్రతిఫలాలు ఎంతో మందికి అందాయని, అయితే ఎవరు ఏ పథకం ద్వారా లబ్ధి పొందారనేది వారికి, ప్రభుత్వానికే తప్ప ఇతరులకు తెలియకుండా, వారి మనోభావాలు దెబ్బతినకుండా ప్రభుత్వం అత్యంత గోప్యతను పాటిస్తోందన్నారు. ఈ 420 చంద్రబాబు తన ఛీప్ రాజకీయాల కోసం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పెన్షన్లను వలంటీర్లు పంపిణీ చేయకుండా ఆదేశాలు తెచ్చారని ఆరోపించారు. ప్రజలను పక్కదోవ పట్టించేందుకు చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవం కేవలం చంద్రబాబుకు, ఆయనతో కూటమి కట్టినవారికి, ఎల్లో మీడియాకు మాత్రమే ఉంటుందా? సామాన్య ప్రజలకు ఉండదా... అని ప్రశ్నించారు. దివ్యాంగులు, కదలలేని స్థితిలో ఉన్నవారిని నలుగురు మోసుకువెళ్లి సచివాలయం వద్ద పడిగాపులు పడాల్సిన ఖర్మపట్టించింది ఈ దుర్మార్గుడు చంద్రబాబు నాయుడు కాదా... అని నిలదీశారు. 'ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోవాల్సిన 80 ఏళ్లు దాటిన వృద్ధులను మండుటెండలో రోడ్డుపై నడిపించిన దుర్మార్గుడవు నీవు కాదా?చంద్రబాబూ' అని ప్రశ్నించారు. కులానికి, మతానికి సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి ఆత్మగౌరవాన్ని పెంచిన వ్యక్తి వైఎస్ జగన్ అని, ఆయన మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు.

ఆర్యవైశ్యులు గంజాయి అమ్ముతున్నారనడం దారుణం

చంద్రబాబుపై ధ్వజమెత్తిన కుప్పం ప్రసాద్



సాక్షి, అమరావతి/ఒంగోలు: ఆర్యవైశ్యులపై చంద్రబాబు విషం చిమ్ముతూ మాట్లాడడం దారుణమని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ధ్వజమెత్తారు. ఆర్యవైశ్యులు కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతున్నారని చంద్రబాబు ఆరోపించడం దుర్మార్గమన్నారు. తాడేపల్లిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాబు వ్యాఖ్యలకు నిరసనగా రావులపాలెంలో ఆర్యవైశ్యులు బంద్‌కు పిలుపునిచ్చారని, రాష్ట్రంలోని ఆర్యవైశ్యులంతా మరోసారి తమ ఐక్యతను నిరూపించుకోవాల్సిన అవసరమేర్పడిందన్నారు. చంద్రబాబు భేషరతుగా ఆర్యవైశ్యులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు వ్యాఖ్యలపై రాష్ట్రంలోని ఆర్యవైశ్యులంతా ఎన్నికల నియమావళిని అనుసరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మొదటి నుంచీ ఆర్యవైశ్యులంటే చిన్నచూపని చెప్పారు. బాబు చేసే తప్పులను అసెంబ్లీలో కొణిజేటి రోశయ్య ఎత్తి చూపేవారని, దీంతో ఆర్యవైశ్యులపై కక్ష పెంచుకున్నారని దుయ్యబట్టారు. గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది.. ఎవరు సరఫరా చేస్తున్నారు.. ఎవరు అమ్ముతున్నారు.. అనే విషయాలను టీడీపీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తెలియజేశారని, ఆయన మాటల వీడియోలు తెప్పించుకుని విని అప్పుడు మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. దొంగే.. దొంగ దొంగ అన్నట్టుగా చంద్రబాబే తన హయాంలో గంజాయిని సరఫరా చేసి రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు.

కిరాయి హంతకుడికి ఎమ్మెల్యే కంటే ఎక్కువ భద్రతా?

- అప్రూవర్‌గా మారిన దస్తగిరికి పిటిషన్ వేసే అర్హతే లేదు
- ఓ హంతకుడికి ఆరుగురితో భద్రత దేశంలో ఎక్కడా లేదు
- తెలంగాణ హైకోర్టులో అవినాశ్ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: డబ్బులు తీసుకుని తానే గొడ్డలి తెచ్చి మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని నరికి చంపానని చెప్పిన కిరాయి హంతకుడైన దస్తగిరికి ఓ ఎమ్మెల్యేకంటే ఎక్కువ భద్రత కల్పించారని తెలంగాణ హైకోర్టుకు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వివరించారు. ఓ హంతకుడికి ఆరుగురు సిబ్బందితో భద్రత ఇవ్వడం ఇంతవరకు దేశంలో ఎక్కడా ఉండి ఉండదన్నారు. నిరంతరం కాపలా కాస్తున్న సాయుధ పోలీసులు ఉండగా, దాడి జరిగే అవకాశం ఉందని దస్తగిరి పేర్కొనడం కల్పితమేనన్నారు. ప్రాణ భయం లేకపోయినప్పటికీ, ఎవరో చెప్పిన కారణంగానే ఆయన ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు స్పష్టంగా తెలుస్తోందని వెల్లడించారు. అడిగిన భద్రత ఇచ్చిన తర్వాత కూడా కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరడం సమర్థనీయం కాదని చెప్పారు. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ దస్తగిరి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా అవినాశ్ తరఫున నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఓ కిరాయి హంతకుడు సీబీఐ చెప్పినట్లు అప్రూవర్‌గా మారి కేసుతో ఎలాంటి సంబంధం లేని వారి బెయిల్ రద్దు చేయాలని కోరడం హాస్యాస్పదమని అన్నారు. ఈ పిటిషన్ వేసే అర్హత దస్తగిరికి లేదన్నారు. దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అంతేకాకుండా బెయిల్ రద్దు కోరుతూ మూడో వ్యక్తి పిటిషన్ దాఖలు చేయలేరని, ఇదే విషయాన్ని ఇదే హైకోర్టు గతంలో పేర్కొందని గుర్తు చేశారు. అవినాశ్ బెయిల్ రద్దు కోరుతూ సీబీఐ ఎలాంటి పిటిషన్ వేయలేదన్నారు. అంతకుముందు సీబీఐ, దస్తగిరి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. అనంతరం తదుపరి విచారణను న్యాయమూర్తి ఈ నెల 15కు వాయిదా వేశారు.



గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరిగిన సాక్షి ఆపరేషన్స్ డైరెక్టర్ పీవీకే ప్రసాద్, శ్రీదేవిల కుమార్తె వివాహానికి హాజరై వధూవరులు స్నేహ, సాయి చరణ్‌లను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

వేట లేకున్నా... నిశ్చింతగా జీవనం

మాది మత్స్యకార కుటుంబం. ఏడాదిపొడవునా గంగమ్మతల్లి ఒడిలో జీవనం సాగించే మేము వేట సక్రమంగా సాగితేనే ఆదాయం ఉండేది. అప్పుడు పోషణకు ఎలాంటి ఇబ్బందులూ ఉండేవి కాదు. వాతావరణ పరిస్థితులు అనుకూలించనపుడు వేట సాగక పస్తులు ఉండాల్సి వచ్చేది. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురానికి చెందిన మాకు గత ప్రభుత్వం ఎలాంటి సాయం అందివ్వలేదు. ఈ పరిస్థితుల్లో మా భవిష్యత్తుపై ఎంతో భయం ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. మా అబ్బాయి వీరబాబు కుమారుడు చరణ్‌కు అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15 వేలు వంతున అందింది. దాంతో వాడి చదువుకు ఎలాంటి భయం లేకుండా పోయింది. నా భార్యకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.62,000, సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.4,597, మత్స్యకార



భరోసా కింద ఏడాదికి రూ.11 వేలు చొప్పున అందింది. విలువైన స్థలం మంజూరు కావడమే గాకుండా ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం కూడా అందింది. త్వరలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని ఆ ఇంటికి వెళ్తాం. ఒక మత్స్యకార కుటుంబాన్ని ఇంత పెద్ద స్థాయిలో ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ఆయనకు ఎప్పటికీ మేము రుణపడి ఉంటాం.

– మల్లాడి చిన్న వెంకన్న, కపిలేశ్వరపురం
(పెద్దింశెట్టి లెనిన్‌బాబు, విలేకరి, కపిలేశ్వరపురం)

మా బతుకు 'పూల' బాట



నా భర్త కనక రాము పువ్వుల వ్యాపారం చేస్తుంటారు. ఈ ప్రభుత్వం అందించిన సాయంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొని సాఫీగా జీవనం సాగిస్తున్నాం. విశాఖపట్నం జిల్లా భీమిలి జోన్‌లోని కొత్తపేటలో నివసిస్తున్న నేను డ్వాక్రా గ్రూప్ సభ్యురాలిని కావడంతో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.87,500, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా 18,750 వంతున, సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.6 వేలు వచ్చాయి. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తొలగించుకునేందుకు భర్తకు తోడుగా పువ్వుల వ్యాపారంలో పాలు పంచుకుంటున్నా. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ఈ వ్యాపారానికి పెట్టుబడిగా ఉపయోగించాం. మా కుటుంబ సభ్యులమే దండలు తయారు చేసుకుంటాం. మేము ఈ రోజు ఇంత సంతోషంగా ఉండగలుగుతున్నామంటే అందుకు కారణం జగనన్నే. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది.

– టొంపల వెంకటలక్ష్మి, కొత్తపేట
(గేదెల శ్రీనివాసరెడ్డి, విలేకరి, తగరపువలస)

చంద్రబాబు = వంద దుర్యోధనులు

- నిమ్మగడ్డతో కలిసి వృద్ధులు, దివ్యాంగుల ఉసురు పోసుకున్నాడు
- 'సమాజ సేవలో వలంటీర్ల పాత్ర' సదస్సులో మండిపడ్డ ప్రజా సంఘాలు



సదస్సులో వలంటీర్లకు సంఘీభావం తెలుపుతున్న నందమూరి లక్ష్మీపార్వతి, వీవీఆర్ కృష్ణంరాజు, పి. విజయబాబు, గోమతోటి వినోద్ పాల్, శిష్లా ధనలక్ష్మి, ఎల్. శివరామ ప్రసాద్,లఖంరాజు సునీత,మేడపాటి వెంకట్ తదితరులు

సాక్షి, అమరావతి: సాఫీగా సాగుతున్న పెన్షన్ల పంపిణీకి చంద్రబాబు నాయుడు, అయన అనుకూల వర్గాలు అడ్డు తగిలి వృద్ధుల ఉసురు తీస్తున్నాయని పలువురు మేధావులు, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్, ఏపీ ఇంటిలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో 'సమాజ సేవలో వలంటీర్ల పాత్ర' పై రాష్ట్ర స్థాయి సదస్సు గురువారం జరిగింది. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివిఆర్ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో వక్తలు తొలుత వలంటీర్లకు తమ సంఘీభావం తెలిపారు. పచ్చ బ్యాచ్ కుట్రల వల్ల మృతిచెందిన వృద్ధులకు ఈ సందర్భంగా సంతాపం తెలిపారు. ఈ వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్ లాంటివారు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

చంద్రబాబు.. లోకేశ్ అడుగుపెడితే అరిష్టం

ముఖ్య వక్తగా పాల్గొన్న ఏపీ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ దివంగత ఎన్‌టీ రామారావు ప్రజల వద్దకు పాలన తేవాలని ప్రయత్నించగా దానిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే తెచ్చారన్నారు. 1660 లోనే కేంబ్రిడ్జి వలంటీర్ పదాన్ని విల్ అనే పేరుతో డిక్షనరీలో చేర్చారని, అమెరికా ప్రెసిడెంట్ కూడా వలంటీర్‌గా సేవ చేస్తారని, మన దేశంలో ఇన్నేళ్లలో ఎవరికీ రాని ఆలోచన జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిందన్నారు. సొంత బిడ్డలు కూడా చేయని సేవను వృద్ధులు, దివ్యాంగులకు జగన్ చేస్తుంటే పచ్చముఠాకు కళ్ళు కుట్టి రాక్షసంగా వ్యవహరించి వృద్ధులు, వికలాంగుల ఉసురు పోసుకున్నారన్నారు. వంద దుర్యోధనులను కలిపితే ఒక చంద్రబాబు అని, ఎన్నికల తర్వాత అతన్ని అడ్రస్ లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. పచ్చ ముఠాకు చెందిన అష్టగహ కూటమి అరాచకాలను ఎండగట్టడానికి రాష్ట్ర మంతటా వైఎస్సార్‌సీపీ తరపున ప్రచారం చేస్తానని పేర్కొన్నారు.

'నిమ్మగడ్డ' ఓ శకుని

ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడుతూ నిమ్మగడ్డ రమేష్ కుమార్ శకుని లాగా వ్యవహరిస్తూ, పెన్షన్‌దారుల ఉసురు పోసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లకు తాము అండగా ఉంటామని, వారి ప్రాథమిక హక్కులను కాలరాసే హక్కు ఎవరికీ లేదన్నారు. వలంటీర్లు ముందు ఈ దేశ పౌరులని, వారు తమ వాదనను స్వేచ్ఛగా వినిపించవచ్చని, తమ మద్దతును బహిరంగంగా తెలుపవచ్చని స్పష్టం చేశారు. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్.కృష్ణంరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని వలంటీర్ల వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తూ దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా రాష్ట్ర ప్రజలకు ఇప్పటి వరకు సుమారు 3.66 కోట్ల పౌర సేవలందాయని తెలిపారు. బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ నరహరిశెట్టి జ్యోతి మాట్లాడుతూ వలంటీర్లను ప్రజా సేవకు దూరం చేయాలనుకోవడం అవివేకమని, రానున్న రోజుల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ సేవలు యథాతథంగా కొనసాగుతాయన్నారు.

వలంటరీ వ్యవస్థకు అంతర్జాతీయ ప్రశంసలు

ప్రవాస భారతీయుడు వెంకట్ మేడపాటి మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థ పలు అంతర్జాతీయ సంస్థల నుంచి ప్రశంసలు పొందిందని, ఇటువంటి వ్యవస్థ మరే రాష్ట్రంలో లేదన్నారు. వలంటీర్లు, పెన్షనర్లపై చంద్రబాబు దురాగతాలు రాష్ట్రానికి హెచ్చరిక లాంటిదన్నారు. ఈ పెత్తందార్లు తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని హెచ్చరించారు. రాజకీయ విశ్లేషకుడు ఎల్. శివరామప్రసాద్ మాట్లాడుతూ వలంటీర్లు సమర్థవంతంగా పని చేస్తూ రూ. 85 వేల కోట్లు పంపిణీ చేశారన్నారు. వేల కోట్ల రూపాయలు వారి చేతుల మీదుగా పంపిణీ చేసినప్పటికీ ఎక్కడా పైసా దుర్వినియోగం కాలేదన్నారు. మారుతీ మహిళా సొసైటీ గౌరవ అధ్యక్షురాలు సునీతా లఖంరాజు మాట్లాడుతూ వలంటీర్లను ప్రజలు తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బ్యాంకింగ్ రంగ నిపుణులు ఎస్.ధనలక్ష్మి, నాయి బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి తుఖ్కారు సూరిబాబు, ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధి గోమతోటి వినోద్ పాల్, ఎమ్మార్పీఎస్ నేత మేడర సురేష్ తదితరులు ప్రసంగించారు.

తెలంగాణ

కవితకు బెయిలుపై 8న తీర్పు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్యంతర బెయిలు పిటిషన్‌పై ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. ఈ నెల 8వ తేదీ సోమవారం తీర్పు వెలువరిస్తామన్నారు. రెగ్యులర్ బెయిలు పిటిషన్‌పై ఈ నెల 20న విచారణ చేపడతామని తెలిపారు. కుమారుడి పరీక్షల నేపథ్యంలో మధ్యంతర బెయిలు మంజూరు చేయాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్, బెయిలు మంజూరు చేయొద్దంటూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా విచారించారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, ఈడీ తరఫున జొహెబ్ హొస్సేన్‌లు వాదనలు వినిపించారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో ఐదుగురి గుర్తింపు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లేంద్రం – కొర్చేలి అటవీ ప్రాంతంలో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన 13 మంది మావోయిస్టుల్లో పోలీసులు ఐదుగురిని గుర్తించారు. వారిలో పీఎల్‌జీఏ కంపెనీ నంబర్– 2కు చెందిన పీపీసీఎం (ఏరియా కమిటీ సభ్యుడి స్థాయి) సుక్రుం హేమ్లా, మిలిటరీ సభ్యులు హుంగా పార్కీ, హుంగా కుంజం, సీతక్క (డీవీసీఎం జిత్రు భార్య), దూలా సోను ఉన్నారు. వీరి మృతదేహాలను గురువారం బీజాపూర్ జిల్లా పోలీసులు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మరో 8 మంది మావోయిస్టులను గుర్తించాల్సి ఉందని, వీరికి సంబంధించి ఎవరికైనా సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ కోరారు.

మరో రెండు జనసేన సీట్లు బాబు ఖాతాలోకే

- టీడీపీ నేతలకే దక్కిన రైల్వేకోడూరు, అవనిగడ్డ జనసేన సీట్లు
- బాబు ఒప్పుకోలేదని రైల్వేకోడూరు అభ్యర్థిని మార్చేసిన పవన్
- ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రధాన అనుచరుడికి టికెట్
- పవన్ నిర్ణయంపై మండి పడుతున్న పార్టీ నేతలు
- ఎన్నికల్లో దూరంగా ఉండాలని నిర్ణయం?



మండలి బుద్ధ ప్రసాద్



అరవ శ్రీధర్

సాక్షి, అమరావతి/సాక్షి, మచిలీపట్నం/ఓబుల వారిపల్లె/అవనిగడ్డ : చంద్రబాబుతో పొత్తంటే బాబు మెచ్చిన వాళ్లకి, బాబు చెప్పిన వాళ్లకి, బాబు పంపిన వాళ్లకి టికెట్లిచ్చేయడమే. జనసేనకు కేటాయించిన మరో రెండు సీట్లనూ చంద్రబాబు ఇలాగే కొట్టేశారు. పొత్తులో భాగంగా జనసేనకు వచ్చిన అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు అభ్యర్థిని మార్చగా, కృష్ణా జిల్లా అవనిగడ్డ స్థానానికి మొన్నటివరకు టీడీపీ నేత, రెండురోజుల క్రితం జనసేనలోకి వచ్చిన అసెంబ్లీ మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. బుద్ధప్రసాద్‌కు సీటు కేటాయించడం అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేనలో చిచ్చు రేపింది. ఈ టికెట్ ఆశించిన పలువురు జనసేన నేతలు కూటమి అభ్యర్థికి సహకరించకూడదని నిర్ణయించారు. మరికొందరు నేతలు వారి పదవులకు రాజీనామా చేస్తున్నారు. కాగా జనసేనకు కేటాయించిన మరో నియోజకవర్గం పాలకొండ అసెంబ్లీ స్థానం అభ్యర్థిని రెండు రోజుల్లో నిర్ణయాన్ని ఆ పార్టీ తెలిపింది. ఎస్సీ రిజర్వ్‌డ్ అయిన రైల్వేకోడూరు నియోజకవర్గం అభ్యర్థిగా యనమల భాస్కరరావును ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇంతకు ముందే ప్రకటించారు. ఈయన అభ్యర్థిత్వానికి చంద్రబాబు మోకాలడ్డారు. అక్కడ తాను చెప్పిన వ్యక్తికి టిక్కెటివ్వాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో పవన్‌కు అభ్యర్థిని మార్చక తప్పలేదు. అక్కడ ఇప్పుడు ఆ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ప్రధాన అనుచరుడు, ముక్కవారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్‌ను జనసేన అభ్యర్థిగా ప్రకటించారు. 'రైల్వే కోడూరు స్థానానికి ఇప్పటికే ఎనమల భాస్కర్ పేరును పవన్ ప్రకటించారు. ఈయన అభ్యర్థిత్వంపై సర్వేల్లో సానుకూలత రాలేదు. మిత్రపక్షమైన తెలుగుదేశం వైపు నుంచి కూడా అనుకూలత లేకపోవడంతో లోతుగా అధ్యయనం చేస్తున్నాం. అక్కడ అభ్యర్థిని మార్చాలని నాయకులు అభిప్రాయాలను తెలియజేశారు' అని పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ గురువారం ఉదయం ప్రకటన జారీ చేశారు. సాయంత్రానికి మళ్లీ మరో ప్రకటన విడుదల చేశారు. రైల్వే కోడూరు శాసనసభ స్థానం నుంచి పోటీ చేసే జనసేన అభ్యర్థిగా అరవ శ్రీధర్ పేరును పార్టీ అధ్యక్షులు పవన్ ఖరారు చేసినట్టు హరిప్రసాద్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

అవనిగడ్డ బుద్ధప్రసాద్‌కే

అవనిగడ్డ శాసన సభ స్థానం జనసేన అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ పేరును పార్టీ అధ్యక్షులు పవన్ ఖరారు చేసినట్టు హరిప్రసాద్ మరో ప్రకటనలో పేర్కొన్నారు. బుద్ధప్రసాద్ గత ఎన్నికల్లో అవనిగడ్డ నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఈసారీ అవనిగడ్డ నుంచి పోటీ చేయాలని ఆశించారు. అయితే ఈ స్థానం జనసేనకు వెళ్లడంతో ఆయన ఆశలకు గండి పడింది. ఈ సీటు కోసం గట్టిగా ప్రయత్నించారు. మరోపక్క ఇన్నేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న జనసేన నేతలూ టికెట్ కోసం గట్టిగా పట్టుపట్టారు. దీంతో ఇక్కడ జనసేన అభ్యర్థి ఎంపిక గందరగోళంలో పడింది. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేసిన వారిని కాదని, ఇటీవలే టీడీపీ నుంచి జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్‌కే పవన్ టికెట్ ఇచ్చారు.

వీరి ఆశలపై నీళ్లు

అవనిగడ్డ అసెంబ్లీ టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న జనసేన నేతలకు పార్టీ అధినేత పవన్ మొండి చేయి చూపారు. ఆ పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు, తొలి నుంచి పార్టీలో ఉన్న బండ్రెడ్డి రామకృష్ణ, కాంట్రాక్టర్ విక్కుర్తి శ్రీను, ఎన్‌ఆర్‌ఐ బొబ్బా గోవర్ధన్, మచిలీపట్నం కన్వీనర్ బండి రామకృష్ణ టిక్కెట్ ఆశించారు. ముందు నుంచి పార్టీలో ఉంటూ కష్టపడి పనిచేసిన వారికి కాకుండా కొత్తగా చేరిన మండలికి టికెట్ ఇవ్వడం వెనుక బాబు హస్తం ఉందని జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా పార్టీలో చేరిన మండలికి టికెట్ ఇస్తే సహకరించబోమని, తమ పార్టీ నాయకుల్లో ఎవరికి ఇచ్చినా పని చేస్తామని ఇటీవలే జనసేన నేలు బహిరంగంగానే ప్రకటించారు. అయినా వారి మాటను ఖాతరు చేయకుండా టిక్కెట్‌ను మండలికే ఇవ్వడంతో ఎన్నికల్లో ప్రచారానికి దూరంగా ఉండాలని సీనియర్ నేతలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మరోపక్క పార్టీ నిర్ణయాన్ని నిరసిస్తూ పలువురు నాయకులు రాజీనామా బాట పట్టారు. జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు గురువారం పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాను వాట్సప్ ద్వారా పార్టీ అధ్యక్షుడు పవన్‌కు పంపినట్లు చెప్పారు. మిత్రులు, శ్రేయోభిలాషులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణ తెలియజేస్తానన్నారు. జనసేన అవనిగడ్డ టౌన్ ప్రధాన కార్యదర్శి అన్నపరెడ్డి ఏసుబాబు, పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు చెన్నగిరి సత్యనారాయణ కూడా పదవులకు రాజీనామా చేశారు.

గురుకులాలపై ఈనాడు వక్రభాష్యాలు

గురివిందా.. మార్పు కనిపించదా?

చంద్రబాబు హయాంలో 41 బీసీ గురుకులాలు

దశలవారీగా 105కు పెంచిన జగన్ సర్కార్

బడ్జెట్ కేటాయింపులనూ పెంచింది ఈ ప్రభుత్వమే..

ఐఐటీ, ఎన్‌ఐటీ, ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులు

నాడు-నేడుతో 37 గురుకుల పాఠశాలలకు మహర్దశ

తెలంగాణాతో పోలిక పెట్టి ఏపీపై బురదచల్లే ప్రయత్నం

రామోజీ రాతల 'పచ్చ'పాతం...


అదేదో సినిమాలో ... 'మిమ్మల్ని ఎక్కడికో తీసుకెళ్లాలనుకుంటున్నా.. మీరు ఇక్కడే ఉంటారని'..చెప్పే హాస్యనటుడి డైలాగ్ చంద్రబాబు-రామోజీలకు సరిపోతుందేమో...ఎన్నికలేమో దగ్గరపడుతున్నాయి...తన శిష్యుడు చంద్రబాబును ఎంత ఎత్తుదామన్నా...రాజకీయంగా అథఃపాతాళానికి దిగజారిపోయిన ప్రతిష్టను తీసుకురాలేని దౌర్భాగ్య స్థితిలో రామోజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై రాళ్లేయాలని చూస్తున్నారు...ఇది ఆకాశమ్మీద రాయివేసిన చందమేనని రామోజీకి అర్థం కావడం లేదేమో... తాజాగా గురుకులాలపై ఈ పచ్చపాత పెద్ద వక్రదృష్టి సారించి, తన విషప(పు)త్రికలో కట్టుకథలు అల్లారు...చంద్రబాబు ప్రభుత్వంలో గురుకులాల సంఖ్య పెరగలేదు..అక్కడి విద్యార్థుల సంక్షేమాన్ని బాబు పట్టించుకోలేదు...విద్యా ప్రమాణాలనూ గాలికొదిలేశారు...ఇప్పుడివన్నీ జగన్ ప్రభుత్వం పట్టించుకుంది..గురుకులాలు పెరిగాయి..డైట్ ఛార్జీలు పెరిగాయి...విద్యా ప్రమాణాలూ పెరిగాయి....ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, నీట్, ఇంజనీరింగ్ సీట్లను గురుకుల విద్యార్థులు సాధిస్తున్నారు.. గురుకులాల పేరిట కలకలం రేపాలని రామోజీ తహతహలాడుతూ చదువుల తల్లినీ అవమానిస్తున్నారు... కళ్లు విప్పార్చుకుని చూస్తే ఈ ఎల్లో పెద్దకు నిజానిజాలు తెలుస్తాయి...

సాక్షి, అమరావతి: బీసీ విద్యార్థులు చదివే గురుకుల విద్యాలయాలపైనా రామోజీ గురివింద రాతలు మానలేదు. తెలంగాణాతో పోలిక పెట్టి ఆంధ్రప్రదేశ్‌పై బురద చల్లేందుకు ఈయన తాపత్రయపడ్డారు. పేద పిల్లలకు పెద్ద చదువులు దక్కాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిని వెక్కిరిస్తూ వెకిలి రాతలు రాసేశారు. బీసీ గురుకులాల మంజూరు, నిర్మాణం, విద్యార్థులకు వసతులు, మెరుగైన ఫలితాలు తదితర అనేక విషయాల్లో చంద్రబాబు వైఫల్యాలను కప్పిపుచ్చడమే కాకుండా సీఎం వైఎస్ జగన్ హయాంలో విజయాలను మరుగుపరిచే కుటిలయత్నం ఈ రాతల్లో స్పష్టంగా కన్పించింది. ఈనాడు అబద్ధాలను దునుమాడే వాస్తవాలు ఇవిగో..

ఆరోపణ: వైకాపా పాలనలో గురుకులాలకు అథమ స్థానం

వాస్తవం: రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన బీసీ గురుకుల విద్యాలయాలకు సీఎం వైఎస్ జగన్ మహర్దశ తీసుకొచ్చారు. చంద్రబాబు హయాంలో కేవలం 41 గురుకులాలు ఉంటే.. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన అనంతరం వాటిని 105కు పెంచారు. విద్యార్థుల సంఖ్యా గణనీయంగా పెరగడంతో పాటు వారికి అవసరమైన నాణ్యమైన విద్య, మౌలిక వసతులు అందించడంలో జగన్ ప్రత్యేక శ్రద్ధతో అనేక చర్యలు చేపట్టారు.

- చంద్రబాబు హయాంలో 2018-19 నాటికి రాష్ట్రంలో బీసీ గురుకులాలు కేవలం 41 మాత్రమే ఉన్నాయి.



- 2019 ఎన్నికలకు రెండు నెలల ముందు హడావుడిగా 65 కొత్త గురుకులాలు మంజూరు చేస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. వాటిని కనీసం గ్రౌండింగ్ అయినా చేయలేదంటే చంద్రబాబు చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న 2019 ఏప్రిల్‌లో హడావుడిగా 21 గురుకులాలు ప్రారంభించినట్టు బిల్డప్ ఇచ్చి జనాన్ని మభ్య పెట్టే ప్రయత్నం చేశారు.
- సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన అనంతరం 2019 నుంచి 2023లోపు 41 కొత్త గురుకులాలను ప్రారంభించారు. 2023లో మరో రెండు కొత్త గురుకులాలను సీఎం జగన్ ప్రారంభించారు. దీంతో చంద్రబాబు హయాంలో 41 గురుకులాలు ఉంటే, జగన్ ప్రభుత్వ హయాంలో వాటి సంఖ్య 105కు పెరిగిన విషయాన్ని ఈనాడు దాచిపెట్టింది. ఈ గురుకుల విద్యాలయాల్లో 2018-19 విద్యా సంవత్సరం (చంద్రబాబు పాలన)లో 25,629 మంది విద్యార్థులుంటే.. 2023-24 విద్యా సంవత్సరానికి (జగన్ సర్కారు)లో 38,188 మంది విద్యార్థులు పెరగడం గమనార్హం.
- రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో 14 జూనియర్ గురుకుల కాలేజీలు ఉంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కొత్తగా మరో నాలుగు మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస, నంద్యాల జిల్లా డోన్, బేతంచెర్ల, చిత్తూరు జిల్లా సదుంలో కొత్తగా జూనియర్ గురుకుల కాలేజీలు ప్రారంభించింది.
- హెయిర్ కటింగ్ కోసం 3వ తరగతి నుంచి బాలురకు నెలకు గత ప్రభుత్వం రూ.30 ఇస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.50కి పెంచింది.

ఆరోపణ: 'అద్దె'సరు భవనాలు..

వాస్తవం: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఇంగ్లీష్ మీడియం చదువులు, ప్రభుత్వ బడుల సౌకర్యాలను మెరుగు పర్చడంలో సీఎం వైఎస్ జగన్ చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందనే విషయం రామోజీకి మింగుడు పడటంలేదు. ప్రభుత్వ బడులు మాదిరిగానే బీసీ గురుకులాల రూపురేఖలను నాడు-నేడు కార్యక్రమంతో మార్చిన విషయాన్ని ఈనాడు ఉద్దేశపూర్వకంగా మరుగున పరిచింది. తొమ్మిది ప్రధానమైన మౌలిక వసతులు కల్పిస్తూ బీసీ గురుకులాలను తీర్చిదిద్దింది. రాష్ట్రంలో 37 గురుకులాలను రూ.17.97 కోట్లతో అభివృద్ధి చేసింది. వాటికి నీటి సరఫరాతో కూడిన టాయిలెట్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్, పాఠశాలకు పెయింటింగ్, మరమ్మతులు, ఆకుపచ్చ సుద్ద బోర్డులు, ఇంగ్లీష్ ల్యాబ్‌లు, ప్రహరీ గోడలు నిర్మించింది. జూనియర్ కాలేజీ భవనాల నిర్మాణం విషయానికి వస్తే.. గత ప్రభుత్వం (2014-19)లో రూ.102.60 కోట్లు కేటాయిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం (2019-23)లో రూ.194 కోట్లు కేటాయించింది.

ఆరోపణ: బిల్లులు చెల్లించలేదు...

వాస్తవం: బడ్జెట్ కేటాయింపుల్లోను జగన్ సర్కారు ఉదారంగా నిలిచిందనే విషయం గత పదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే తెలుస్తుంది. చంద్రబాబు అధికారం చేపట్టిన తొలినాళ్లలో కేవలం రూ.45 కోట్లు కేటాయిస్తే.. సీఎం జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి రూ.213 కోట్లకు పైగా ప్రభుత్వం కేటాయింపులు చేసింది. ఈ నిజాలనూ రామోజీ దాచేశారు. చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం జగన్ ప్రభుత్వంపై బురద చల్లేందుకు వాస్తవాలను వక్రీకరించి బోగస్ రాతలు రాస్తున్నారు.

బీసీ గురుకులాలకు బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)..

ఏడాది	కేటాయించింది	విడుదల చేసింది	ఖర్చుచేసింది	విద్యార్థులు
2014-15	45.26	45.26	45.26	11,485
2015-16	106.26	106.26	48.76	11,798
2016-17	248.88	248.88	67.40	12,292
2017-18	208.88	169.88	74.12	14,452
2018-19	208.88	208.88	82.48	25,629
2019-20	213.47	203.72	129.40	27,986
2020-21	192.76	192.76	192.76	31,856
2021-22	268.27	268.27	268.27	35,307
2022-23	269.56	202.18	148.06	36,238

ప్రస్తుత విద్యా సంవత్సరం (2023-24)లో ప్రభుత్వం రూ. 220.56 కోట్లు కేటాయించింది. అందులో రూ.134 కోట్లు విడుదల చేసింది. రూ.127.11కోట్లు ఖర్చు చేశారు. దీని వల్ల 38,188 మంది విద్యార్థులకు లబ్ధి కలిగింది.

ఫలితాలే గీటురాయి..

ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమేరకు ఫలప్రదమయ్యాయో తెలియాలంటే ఆయా విద్యా సంస్థల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలే గీటురాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీ గురుకుల విద్యార్థులకు ప్రత్యేకంగా ఐఐటీ, నీట్‌లో ప్రత్యేక కోచింగ్ ఇవ్వడంతో వారు ఉత్తమ ఫలితాలు సాధించారు.

- బీసీ గురుకులాల్లో 2022-23లో పదో తరగతిలో 90 శాతం, ఇంటర్మీడియట్‌లో 90.10 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- ఎంపీసీ (ఐఐటీ అడ్వాన్డ్స్)లో 2019-20లో 102 మంది విద్యార్థుల్లో 37 మంది అర్హత సాధించారు. 2020-21లో 205 మందికి 65 మంది అర్హత సాధించారు. 2021-22లో 147 మందికి 45 మంది అర్హత సాధించారు.
- ఐఐటీ, నీట్, పోటీ పరీక్షల్లో 2022-23లో మంచి ప్రతిభ కనబరిచిన 40 మంది గురుకుల విద్యార్థులు సీట్లు సాధించారు. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలో ఆరుగురు, ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల్లో 24, నీట్ (బైపీసీ స్ట్రీమ్)లో ఎంబీబీఎస్‌లో నాలుగు, డెంటల్‌లో ఒక సీటు, వెటర్నరీ 4, అగ్రికల్చర్ లో ఒక సీటును సాధించారు.

ఆరోపణ: బీసీ విద్యార్థుల వెన్ను విరిచారు.


వాస్తవం: పేద పిల్లలు చదివే గురుకులాల్లో చంద్రబాబు ప్రభుత్వం కనీసం డైట్, కాస్మొటిక్, హెయిర్ కట్ వంటి ఛార్జీల పెంపుదల మాటే పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక వాటిని పెంచి అందిస్తున్నారు. ఈ వివరాలు గమనిస్తే ఈనాడు రాసినవన్నీ కట్టుకథలని ఇట్టే తేటతెల్లమవుతాయి.

డైట్ ఛార్జీల పెంపు (నెలకు రూ.)..

తరగతి	గత ప్రభుత్వం	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
3,4 తరగతులు	1000	1,150
4,5 తరగతులు	1,250	1,400
ఇంటర్మీడియట్, ఆపైన	1,400	1,600

కాస్మొటిక్ ఛార్జీలు (నెలకు రూ.)..

తరగతి	ఎవరికి	గత ప్రభుత్వం	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
3,4 తరగతులు	బాలురు	100	125
3,4 తరగతులు	బాలికలు	110	130
4,5 తరగతులు	బాలురు	125	150
4,5 తరగతులు	బాలికలు	160	200
ఇంటర్మీడియట్,	ఆపైన బాలురు	125	200
ఇంటర్మీడియట్,	ఆపైన బాలికలు	160	250



● నాగచైతన్య

మాస్ డిష్యుం

'తండేల్' సెట్స్‌లో డిష్యుం డిష్యుం అంటూ అదిరిపోయే మాస్ ఫైట్స్ చేస్తున్నాడు రాజు.

నాగచైతన్య, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. నాగచైతన్యతో 'ప్రేమమ్ (2016)', 'సవ్యసాచి (2018)' సినిమాలను తెరకెక్కించిన చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ఓ భారీ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌ను హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. 'యానిమల్' సినిమాకు చేసిన స్టంట్ కొరియోగ్రాఫర్ సుప్రీమ్ సుందర్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేస్తున్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న 'తండేల్'లో జాలరి రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయిపల్లవి కనిపిస్తారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుంది.

స్వయంభూలో ఎంట్రీ



● నభా నటేష్

'కార్తికేయ 2'తో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ సంపాదించుకున్న నిఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభూ'. ఈ చిత్రం షూటింగ్‌లో జాయిన్ అయ్యారు హీరోయిన్ నభా నటేష్. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త ఓ కథానాయికగా నటిస్తుండగా, నభా నటేష్ కీలకమైన, శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నారు. 'ఠాగూర్' మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ పాన్ ఇండియా మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణలో నభా నటేష్ గురువారం జాయిన్ అయిన విషయాన్ని ప్రకటించి, ఆమె పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''స్వయంభూ' చిత్రంలో ఓ లెజెండరీ యోధుడిగా నిఖిల్ నటిస్తున్నారు. ఈ పాత్ర కోసం మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో ట్రైనింగ్ తీసుకున్నారాయన. నభా నటేష్ పాత్ర కూడా చాలా బాగుంటుంది. ఈ క్యారెక్టర్‌కి తగ్గట్టుగా ఆమె మారిన విధానం అద్భుతం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, సహ నిర్మాతలు: విజయ్ కామిశెట్టి, జీటీ ఆనంద్.

మళ్లీ వస్తున్నాడు
లయన్ కింగ్

హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ది లయన్ కింగ్' (2019) కు ప్రీక్వెల్ రానుంది. 'ముఫాసా: ది లయన్ కింగ్' టైటిల్‌తో రానున్న ఈ ప్రీక్వెల్ ఈ ఏడాది క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుందని సమాచారం. 'ది లయన్ కింగ్' సినిమాకు జోన్ ఫావ్రూ దర్శకత్వం వహించగా, ప్రీక్వెల్‌ను ఆస్కార్ విన్నింగ్ డైరెక్టర్ బార్రీ జెన్కిన్స్ తెరకెక్కిస్తున్నారు. ఇక 'ది లయన్ కింగ్' సినిమాలో ముఫాసా పాత్ర ఓ దశలో చనిపోతుంది. ముఫాసా కొడుకు సింబా, అతని సోదరుడు, శత్రువు స్కార్‌ల దృష్టి కోణంలో ఈ చిత్రకథ సాగుతుంది. కానీ ముఫాసా రాజుగా ఎలా ఎదిగాడు? ఆ సమయంలో అతని సోదరుడు స్కార్ ఎలాంటి పన్నాగాలు పన్నాడు? అనే అంశాల నేపథ్యంలో 'ముఫాసా: ది లయన్ కింగ్' సినిమా కథ ఉంటుందని హాలీవుడ్ టాక్. ఈ సినిమా కొత్త పోస్టర్ విడుదలైంది. 'ది లయన్ కింగ్'కు రచయితగా చేసిన జెఫ్ నాథన్సన్ 'ముఫాసా: ది లయన్ కింగ్'కూ వర్క్ చేస్తున్నారు. ముఫాసా పాత్రకు ఆరోన్ పైర్రీ, స్కార్ పాత్రకు కెల్విన్ హారిసన్ వంటివారు వాయిస్ ఓవర్ ఇవ్వనున్నారని హాలీవుడ్ టాక్.



● 'ముఫాసా: ది లయన్ కింగ్' పోస్టర్

మంజుమ్మల్ బాయ్స్‌ని ఎంజాయ్ చేస్తారు - నిర్మాత నవీన్ యెర్నేని

''మంజుమ్మల్ బాయ్స్' సినిమాని అమెరికాలో చూశాను. ఈ మధ్య కాలంలో నేను చూసిన బెస్ట్ మూవీ ఇది. మలయాళంలో బిగ్ హిట్ అవడంతో పాటు రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. తప్పకుండా థియేటర్స్‌కి వచ్చి చూడండి. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు'' అని నిర్మాత నవీన్ యెర్నేని అన్నారు. సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ప్రధాన పాత్రల్లో చిదంబరం ఎస్. పొదువల్ దర్శకత్వం వహించిన చిత్రం 'మంజుమ్మల్ బాయ్స్'. పరవ ఫిలింస్‌పై బాబు షాహిర్, సౌబిన్, షాహిర్, షాన్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రం మలయాళంతో పాటు తమిళంలో కూడా మంచి విజయం సాధించింది. ఈ చిత్రం మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో తెలుగులో ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో చిదంబరం ఎస్. పొదువల్ మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకుల స్పందన కోసం ఎదురు చూస్తున్నాం'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, శశిధర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, నటులు శ్రీనాథ్ భాసి, అరుణ్ కురియన్, విష్ణు రవి తదితరులు మాట్లాడారు.



● 'మంజుమ్మల్ బాయ్స్' ఈవెంట్‌లో ఓ దృశ్యం

సీక్వెల్ స్టార్



యాక్షన్ హీరోగా, ఫ్యామిలీ హీరోగా అన్ని వర్గాల ప్రేక్షకులనూ మెప్పిస్తున్నారు అజయ్ దేవగన్. ఇప్పుడు ఈ హీరోకి 'సీక్వెల్ స్టార్' అని ట్యాగ్ ఇవ్వొచ్చు. ఎందుకంటే ఒకటి కాదు... రెండు మూడు కూడా కాదు... ఏకంగా ఎనిమిది చిత్రాల సీక్వెల్స్ అజయ్ దేవగన్ డైరీలో ఉన్నాయి. సీక్వెల్ చిత్రాల్లో నటించడం పెద్ద విషయం కాదు కానీ వరుసగా ఎనిమిది చిత్రాలంటే మాత్రం పెద్ద విషయమే. ఇక అజయ్ సైన్ చేసిన సీక్వెల్ చిత్రాల్లో ఇప్పటికే కొన్ని చిత్రాలు షూటింగ్ దశలో ఉండగా కొన్ని ఆరంభం కావాలి. ఆ చిత్రాల విశేషాలు తెలుసుకుందాం.

అజయ్ దేవగన్ కెరీర్‌లో 'సింగమ్' చిత్రానిది ప్రత్యేక స్థానం. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో పోలీసాఫీసర్ సింగమ్‌గా అజయ్ దేవగన్ విజృంభించారు. 2011లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత అజయ్ దేవగన్–రోహిత్ శెట్టి కాంబినేషన్‌లోనే 'సింగమ్'కి సీక్వెల్‌గా 'సింగమ్ రిటర్న్స్' (2014) రూపొంది, సూపర్‌హిట్‌గా నిలిచింది. 'సింగమ్ రిటర్న్స్' విడుదలైన దాదాపు పదేళ్లకు ఈ ఫ్రాంచైజీలో భాగంగా 'సింగమ్ ఎగైన్' పేరుతో ఓ మూవీ రూపొందుతోంది. అజయ్ దేవగన్ హీరోగా ఈ చిత్రానికి కూడా రోహిత్ శెట్టియే దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఆగస్టులో రిలీజ్ కానుందని సమాచారం. అదే విధంగా అజయ్ దేవగన్ హీరోగా రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వంలో వచ్చిన 'రైడ్' (2018) మూవీ ఘనవిజయం సాధించింది.

దాదాపు ఆరేళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'రైడ్ 2' తెరకెక్కుతోంది. అజయ్ దేవగన్ హీరోగా డైరెక్టర్ రాజ్‌కుమార్ గుప్తా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో వాణీ కపూర్, రితేశ్ దేశ్‌ముఖ్ కీలక పాత్రధారులు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నవంబర్ 15న రిలీజ్ కానుంది.

ఇదిలా ఉంటే.. 'సింగమ్' వంటి హిట్ సీక్వెల్స్ ఇచ్చిన హీరో అజయ్ దేవగన్–దర్శకుడు రోహిత్ శెట్టి కాంబినేషన్‌లో వచ్చిన మరో చిత్రం 'గోల్‌మాల్' (2006) ఘనవిజయం సాధించింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా అజయ్ దేవగన్ –రోహిత్ శెట్టి కాంబినేషన్‌లోనే వచ్చిన 'గోల్‌మాల్ రిటర్న్స్' (2008) సూపర్ హిట్ అయింది. 'గోల్‌మాల్' ఫ్రాంచైజీలో 'గోల్‌మాల్ 3' (2010), 'గోల్‌మాల్ 4' (2017) కూడా వచ్చాయి. 'గోల్‌మాల్ 5' రానుంది. అజయ్ దేవగన్–రోహిత్ శెట్టి కాంబినేషన్‌లోనే రానున్న ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందట. ఇకపోతే అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్‌సింగ్, టబు ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'దే దే ప్యార్ దే'. అకివ్ అలీ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2019లో రిలీజై సూపర్ హిట్ అయింది. దాదాపు ఐదేళ్లకి 'దే దే ప్యార్ దే 2' సినిమాని ప్రకటించారు మేకర్స్. ఇందులోనూ అజయ్ దేవగన్ లీడ్ రోల్‌లో నటించనున్నారు. అయితే 'దే దే ప్యార్ దే'కి అకివ్ అలీ దర్శకత్వం వహించగా.. 'దే దే ప్యార్ దే 2' మూవీని కొత్త దర్శకుడు అన్షుల్ శర్మ తెరకెక్కించనున్నారు. ఈ చిత్రాన్ని 2025 మే 1న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. అలాగే అజయ్ దేవగన్ హీరోగా అశ్వినీ ధీర్ దర్శకత్వం వహించిన యాక్షన్ కామెడీ చిత్రం 'సన్ ఆఫ్ సర్దార్'. 2012లో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. సునీల్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'మర్యాద రామన్న' (2010) చిత్రానికి ఇది రీమేక్. ఇక 'సన్ ఆఫ్ సర్దార్' వచ్చిన పుష్కరం తర్వాత సీక్వెల్‌గా 'సన్ ఆఫ్ సర్దార్ 2' తెరకెక్కనుంది. తొలి భాగానికి అశ్వినీ ధీర్ దర్శకత్వం వహించగా, మలి భాగాన్ని డైరెక్టర్ విజయ్ కుమార్ అరోరా తెరకెక్కించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ మూవీ ఈ ఏడాదిలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది.

అలాగే 2025లో ఈ సినిమాని రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అదే విధంగా మలయాళ హిట్ మూవీ 'దృశ్యం' హిందీ రీమేక్‌లో అజయ్ దేవగన్ హీరోగా నటించారు. నిషికాంత్ కామత్ దర్శకత్వం వహించిన క్రైమ్ థ్రిల్లర్ 'దృశ్యం' (2015) హిట్‌గా నిలిచింది. ఈ చిత్రం విడుదలైన దాదాపు ఏడేళ్లకు 'దృశ్యం 2' రిలీజైంది. అజయ్ దేవగన్ లీడ్ రోల్‌లో నటించిన ఈ మూవీకి అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహించారు. ఇదే ఫ్రాంచైజీలో మలయాళంలో 'దృశ్యం 3' రానుంది. ఈ చిత్రం హిందీ రీమేక్‌లో కూడా అజయ్ దేవగన్ నటిస్తారని సమాచారం. ఇదిలా ఉంటే వికాస్ బాల్ దర్శకత్వంలో అజయ్ దేవగన్ హీరోగా నటించిన 'సైతాన్' చిత్రం గత నెల 8న రిలీజై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'సైతాన్ 2' రానుంది. ఇంకా ఇంద్రకుమార్ దర్శకత్వంలో అజయ్ దేవగన్ ఓ హీరోగా నటించిన 'ధమాల్' (2007)తో పాటు 'డబుల్ ధమాల్' (2011), 'టోటల్ ధమాల్' (2019) మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. 'ధమాల్ 4' కూడా రానుందని సమాచారం. ఇంద్రకుమార్ దర్శకత్వంలోనే అజయ్ దేవగన్ ఓ హీరోగా ఈ నాలుగో భాగం ఉంటుందని టాక్. ఇలా వరుసగా సీక్వెల్స్‌కి సైన్ చేసిన అజయ్ దేవగన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మైదాన్' ఈ నెల 10న విడుదల కానుంది. ఈ చిత్రంలో ఆయన ఫుట్‌బాల్ కోచ్‌గా కనిపించనున్నారు.



● 'సింగమ్ ఎగైన్'లో...

చంద్రబాబుపై చర్యలు తీసుకోండి

- సీఎం వైఎస్ జగన్‌పై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారు
- ఇప్పటికే ఎన్నికల సంఘం నోటీసు ఇచ్చినా బాబు తీరు మారలేదు
- ఈసీకి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫిర్యాదు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయంలో అడిషనల్ సీఈవో కోటేశ్వరరావుకు గురువారం మల్లాది విష్ణు ఆధారాలతో సహా ఫిర్యాదును అందజేశారు. అనంతరం మల్లాది మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ పట్ల చంద్రబాబు వాడుతున్న పదజాలం తీవ్ర అభ్యంతరకరమన్నారు. ఇప్పటికే మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్ల బహిరంగ సభల్లో సీఎం జగన్‌ను కించపరిచేలా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తాము ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన ఈసీ చంద్రబాబుకు నోటీసు ఇచ్చిందన్నారు. అయినా ఆయన తీరు మారలేదని మండిపడ్డారు. మరోసారి కొత్తపేట సభలోనూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ప్రవర్తించారని ధ్వజమెత్తారు. దీనిపై ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. అలాగే ప్రతి సభలోనూ చంద్రబాబు నిబంధనలు అతిక్రమించడంపై ఈసీకి ఆధారాలు అందజేశామని తెలిపారు. ముఖ్యంగా వైఎస్ వివేకా హత్య కేసుకు సంబంధించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. టీడీపీ కుట్రలతో పింఛన్‌దారులు మృతి చెందితే దాన్ని కూడా ముఖ్యమంత్రికి ఆపాదిస్తూ బాబు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపైనా ఈసీకి ఫిర్యాదు చేసినట్లు మల్లాది విష్ణు తెలిపారు. ఓవైపు టీడీపీ శవరాజకీయాలు చేస్తూ.. జోగి రమేష్, పేర్ని నానిలపై బురదచల్లడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నవరత్న పథకాల అమలు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లపై ఫిర్యాదు చేయించింది చంద్రబాబే

నేరుగా ఫిర్యాదు చేస్తే ప్రజలు రాళ్లతో కొడతారనే బాబు భయం

- అందుకే నిమ్మగడ్డ రమేష్‌తో ఫిర్యాదు చేయించారు
- ఆయన అధికారంలోకి వస్తే ఎలా ఉంటుందో ప్రజలకు రుచి చూపించారు
- రేపు ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు తగిన శాస్తి చేస్తారు
- అధికారుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికే పురందేశ్వరి తప్పుడు ఫిర్యాదులు
- పురందేశ్వరి, చంద్రబాబు కూడబలుక్కునే ఇదంతా చేస్తున్నారు
- ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే దివాలా తీసిన కూటమి
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తూ కరోనా, ఇతర విపత్తుల సమయంలో ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్ల వ్యవస్థపై ఫిర్యాదు చేయించింది టీడీపీ అధినేత చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. చంద్రబాబే స్వయంగా ఫిర్యాదు చేస్తే ప్రజలు ఉమ్మేస్తారు, రాళ్లతో కొడతారనే భయంతోనే నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించారని చెప్పారు. సజ్జల గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఎలా ఉంటుందో ఈ రెండ్రోజుల్లోనే ప్రజలకు రుచి చూపించారన్నారు. చంద్రబాబు తీరు చూసి ప్రజలకు జన్మభూమి కమిటీల అరాచకాలు గుర్తుకు వస్తున్నాయని తెలిపారు. పెన్షన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తప్పించిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఉద్దేశం ప్రజలకు మంచి చేయడం కాదని తెలిపారు. ప్రజలు ఇదంతా అర్థం చేసుకున్నారని, చంద్రబాబుపై తిరుగుబాటు వస్తోందని, ఎన్నికల్లో తగిన శాస్తి చేస్తారని చెప్పారు. ఆయనకు వారు పెడుతున్న శాపాలే అందుకు నిదర్శనమని అన్నారు. ఇదే చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్ల ద్వారా 4 వేలు పెన్షన్ ఇస్తామని చెబుతున్నారన్నారు. ఓ వైపు వలంటీర్లను తిడుతూ వాళ్ళు వద్దే వద్దు అంటూనే వారిని కొనసాగిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. వలంటీర్ల వ్యవస్థను ఎవ్వరూ ఏమీ చేయలేరని, తిరిగి జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక మరింత మెరుగ్గా వలంటీర్లు సేవ చేస్తారని, ఆ భరోసా వలంటీర్లందరికి ఉందని అన్నారు. వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యేదని, ఇప్పుడు రెండోరోజుకి 60 శాతం మాత్రమే పంపిణీ జరిగిందన్నారు. పైగా సచివాలయాల వద్దకు స్వయంగా వెళ్లి తెచ్చుకోవాల్సి రావడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీఎం జగన్ మానసపుత్రిక అయిన సచివాలయ వ్యవస్థ ఉపయోగం ఇప్పుడు చంద్రబాబు, పవన్‌కు తెలిసివచ్చిందని చెప్పారు. సీఎం జగన్ ఉద్యోగాలు ఇవ్వలేదని నాలుగేళ్ళుగా విమర్శలు చేసిన బాబు, పవనే ఇప్పుడు 1.30 లక్షల మంది సచివాలయ ఉద్యోగులతో పెన్షన్లు పంచవచ్చని అంటున్నారని తెలిపారు. పురందేశ్వరి, చంద్రబాబు వదిన, మరుదులుగా ముందు నుంచే కూడబలుక్కుని అధికారుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికే ఈసీకి ఫిర్యాదులు చేస్తున్నారని అన్నారు. పురందేశ్వరి ఏకంగా 20 మంది ఐపీఎస్‌లపై ఫిర్యాదు చేశారని, ఈ లెక్కన చూస్తే నరేంద్ర మోదీ ప్రభుత్వంలో పనిచేసే వారందరూ బీజేపీ తొత్తులా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఒత్తిళ్లకు ఈసీ కూడా లొంగిపోతోందని అన్నారు. ఈ నెల 2న ఐదు జిల్లాల ఎస్పీలు, మూడు జిల్లాల కలెక్టర్లు, ఒక ఐజీ స్థాయి అధికారిని ఈసీ బదిలీ చేసిందని, అందుకు కారణాలు చెప్పలేదని అన్నారు. చిలకలూరిపేటలో ప్రధాని సభ ఫెయిల్యూర్ ఓ కారణంగా చెప్పారని, అయితే ప్రధాని వస్తే భద్రత మొత్తం ఎస్పీజీ అధీనంలో ఉంటుందని, దానిని రాష్ట్ర పోలీసులపై రుద్దారని తెలిపారు. కూటమి ద్వారా పైనుంచి ఒత్తిడి చేయించి మరీ అధికారుల్ని బదిలీ చేయించారని చెప్పారు. తాము ప్రజలనే నమ్ముకున్నామని, వ్యవస్థల్ని మేనేజ్ చేయబోమని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం నియంత్రణలో ఉండే వ్యవస్థల నేతృత్వంలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో విజయం వైఎస్సార్‌సీపీకి మరింత శోభనిస్తుందని అన్నారు. అధికారుల వల్లే వైఎస్సార్‌సీపీ గెలిచిందని అనడానికి చంద్రబాబు అండ్ కోకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే కూటమి దివాలా తీసిందని వెల్లడించారు.

కోకో.. ధర కేక



- కేజీ గింజలు రూ.800
- రెండు నెలల క్రితం రూ.200 మాత్రమే
- ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 5,800 ఎకరాల్లో సాగు
- పశ్చిమ ఆసియా దేశాల్లో 70 శాతం పడిపోయిన దిగుబడి
- కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా అదనపు ఆదాయం

సాక్షి అమలాపురం: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా దిగుబడి తగ్గినప్పటికీ.. కోనసీమ కోకో రైతులు కలలో కూడా ఊహించని విధంగా ధర పలుకుతుండడంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. కేజీ ఎండబెట్టిన కోకో గింజల ధర రూ.200 నుంచి ఏకంగా రూ.800 వరకు ఎగబాకింది. గతేడాది నుంచి చోటు చేసుకున్న వాతావరణ మార్పుల కారణంగా పశ్చిమ ఆసియా దేశాల్లో దిగుబడి గణనీయంగా పడిపోవడంతో.. కోకో గింజల డిమాండ్‌ను బట్టి ధర పెరగడానికి కారణమైందని రైతులు చెబుతున్నారు.

దశాబ్దాలుగా సాగు..

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో దశాబ్దాల కాలంగా కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకోను అంతర పంటగా సాగు చేస్తున్నారు. కాకినాడ , తూర్పుగోదావరి, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సుమారు 5,800 ఎకరాల్లో కోకో సాగవుతున్నట్లు అంచనా. కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకో అంతరసాగు వల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరుతున్నది. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తున్నది.

దిగుబడి తగ్గినా..

తూర్పుగోదావరి జిల్లాలో ఎకరాకు దిగుబడి 1.50 క్వింటాళ్ల నుంచి రెండు క్వింటాళ్ల వరకు వస్తుండగా, ఏలూరు జిల్లా పరిధిలో నాలుగు క్వింటాల్ నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మనదేశంతోపాటు కోకో అధికంగా ఐవరీ కోస్ట్, ఘనా, ఇండోనేషియా, నైజీరియా వంటి దేశాలలో పండిస్తారు. ఆ దేశాల్లో 70 శాతం దిగుబడి తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులకు తోడు ఆగస్టు వరకు వేసవిని తలపించే ఎండల వల్ల కోకో పూత రాలిపోయింది. ఆ ప్రభావం ఇప్పుడు దిగుబడిపై కనిపిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సగటు దిగుబడి ఒక క్వింటాల్‌కు తగ్గింది. కాగా, గతేడాది కోకో ఎండబెట్టిన గింజల ధర క్వింటాల్‌కు రూ.180 నుంచి రూ.240 మధ్యలో ఉండేది. ఈ ఏడాది జనవరి నుంచి స్వల్పంగా ధర పెరుగుతూ ప్రస్తుతం రూ.800కు చేరింది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితిని పరిశీలిస్తే ధర మరింత పెరిగే అవకాశముందని రైతులు అంచనా వేస్తున్నారు.

జగన్‌ను ఎదుర్కొనేందుకే ఆ రెండు పార్టీలతో పొత్తు

- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- ప్రజాగళం రోడ్డు షోలకు కానరాని జనస్పందన
- మాజీ మంత్రి జవహర్ గైర్హాజరు.. దుమ్మా కొట్టిన ముళ్లపూడి బాపిరాజు వర్గం



కొవ్వూరు/నల్లజర్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకే జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కోరారు. జెండాలు మూడైనా అజెండా మాత్రం ఒక్కటేనన్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు, నల్లజర్లలో గురువారం ప్రజాగళం రోడ్ షో, సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను కూడా వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తానని, వలంటీర్లను తీసివేయనని నమ్మబలికే ప్రయత్నం చేశారు. పింఛన్ల కోసం సచివాలయాలకు రమ్మంటున్నారని, 1.35 లక్షల మంది సచివాలయ సిబ్బంది ఉన్నారని, ఒక్క రోజులో పింఛన్లు పంపిణీ చేయవచ్చని అన్నారు. ఎవరినీ చంపకుండా పింఛన్లు ఇవ్వాల్సిందిగా జగన్‌కు సవాల్ విసురుతున్నానని, అందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో తాను అధికారంలోకి వచ్చి ఉంటే మొదటి నెలలోనే రూ.3 వేల పింఛన్ ఇచ్చేవాడినన్నారు. వాయిదాల పద్ధతిలో సీఎం వైఎస్ జగన్ రూ.3 వేలు చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని రిలయన్స్ అధినేత చంపారంటూ జగన్ అల్లరి చేశారని, పార్టీ కార్యకర్తలు రిలయన్స్ సంస్థలపై దాడులు చేశారని, ఇప్పుడు వారికి ఎంపీ సీటు ఇచ్చారని విమర్శించారు.

రెండుచోట్లా ఫ్లాప్ షో

కొవ్వూరులో నిర్వహించిన రోడ్ షోకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో ఫ్లాప్ షోగా మారింది. చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలోనూ జనం లేక మెయిన్ రోడ్డులోని డివైడర్‌కు ఒకవైపు ఖాళీగా దర్శనమిచ్చింది. మూడు పార్టీలూ కలసినా కనీసం 3 వేల మందిని కూడా సమీకరించలేకపోయారు. ఇరుకుగా ఉండే విజయ విహార్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్, ఆయన వర్గీయులు ఎక్కడా కనిపించకపోవడంపై పార్టీ శ్రేణులు గుసగుసలాడుకోవడం కనిపించింది. కాగా.. నల్లజర్ల జంక్షన్‌లో గురువారం రాత్రి నిర్వహించిన ప్రజాగళం సభ వెలవెలబోయింది. కాగా, చంద్రబాబు సభకు ముళ్లపూడి బాపిరాజు వర్గం దుమ్మా కొట్టింది.

వస్తున్నాయ్.. ఎన్నికల రథాలు

- ఇప్పటికే రాష్ట్రస్థాయిలో 52 ప్రచార రథాలకు అనుమతి
- జిల్లాస్థాయిలో 300కుపైగా ప్రచార వాహనాలు
- నిబంధనల మేరకు దరఖాస్తు చేసే వాహనాలకు అనుమతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల వేడి రాజుకుంటున్న కొద్దీ ప్రచార రథాలు రోడ్డెక్కుతున్నాయి. పార్టీ అధినేతలు, ముఖ్య నేతలు, అభ్యర్థులు ఎవరికి వారు సొంతంగా ప్రచార వాహనాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలను రాష్ట్రవ్యాప్తంగా తిరిగేవి, జిల్లా పరిధిలో తిరిగేవి అనే రెండు కేటగిరీల కింద విభజించారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగే వాహనాలకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం, జిల్లా పరిధిలో తిరిగే వాటికి జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) కార్యాలయం అనుమతులు జారీ చేస్తాయి. ఎన్నికల ప్రచారంతోపాటు ప్రచార సామగ్రిని తరలించేందుకు వాహనాలకు కూడా అనుమతి తప్పనిసరి. ప్రచార రథాలకు అనుమతులపై ఎలాంటి గరిష్ట పరిమితి లేదు. కానీ ప్రచార సామగ్రి తరలించేందుకు ఉపయోగించే వాహనాలపై మాత్రం పార్టీలకు గరిష్ట పరిమితి విధించారు. శాసన సభ నియోజకవర్గాల సంఖ్యను 25తో భాగించి, లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను మూడుతో భాగిస్తే వచ్చే సంఖ్యనే గరిష్ట పరిమితిగా పరిగణిస్తారు. ఆ ప్రకారం రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలకు ఒక్కో పార్టీకి గరిష్ఠంగా 7 వాహనాలు, లోక్‌సభ ఎన్నికలకు ఒక్కో పార్టీకి గరిష్ఠంగా 8 వాహనాలకు అనుమతినిస్తారు. అందుకోసం కేంద్ర ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి.

రాష్ట్రస్థాయిలో .. 78 దరఖాస్తులు.. 52 ఆమోదం

ఇప్పటివరకు రాష్ట్రస్థాయి ప్రచార రథాల అనుమతి కోసం 78 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి 52 వాహనాలకు అనుమతి ఇవ్వవచ్చని రవాణా శాఖ అధికారులు ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయానికి నివేదించారు. నిబంధనలు పాటించని, నిర్దేశిత ప్రమాణాల మేరకు లేని 26 వాహనాలకు అనుమతులు తిరస్కరించాలని కూడా సూచించారు. జిల్లాస్థాయిలో ప్రచార రథాలుగా ఇప్పటివరకు దాదాపు 300 దరఖాస్తులు వచ్చాయి. నోటిఫికేషన్ విడుదలయ్యేనాటికి మరిన్ని దరఖాస్తులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో కనీసం 100 ప్రచార రథాలు, జిల్లాస్థాయిలో 800కు పైగా ప్రచార రథాల కోసం దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నారు.

సాక్షి **బిజినెస్**
శుక్రవారం
5-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	351	74,228
నిఫ్టీ ▲	80	22,515

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,425	▲ 147
డోజోన్స్	39,228	▲ 101
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,976	▲ 38
డాక్స్	18,403	▲ 35
షాంఘై (బుధవారం ముగింపు)	3,069	▼ 6
నికాయ్	39,773	▲ 321

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	68,750
బంగారం (22 క్యారెట్లు)	65,480
వెండి (కేజీ)	85,300

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.03	84.05
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.40	106.96
€	యూరో	ఒకటి	89.38	91.74
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.46	55.68
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.98	55.90
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.81	64.07
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.36	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.82	23.60
¥	చైనా యువాన్	ఒకటి	10.40	12.40

బంగారం ధగధగలు...

న్యూఢిల్లీలో ఒకేరోజు రూ.850 అప్ • రూ.70,050కి చేరిక



న్యూఢిల్లీ: బంగారం ధరల పరుగు కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో బుధవారం పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర ఒకేరోజు రూ.850 పెరిగి రూ.70,050 ఆల్‌టైమ్ హైకి ఎగసింది. అమెరికా ఫెడ్ ఫండ్ రేటు తగ్గవచ్చన్న అంచనాలు, ఈజీ మనీ, ద్రవ్యోల్బణం భయాలు, డాలర్ బలహీనత, చైనా పసిడి డిమాండ్ అంశాలు భారత్‌లో పసిడి ధర పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఇక వెండి విషయానికి వస్తే ధర కేజీకి రూ.1,000 ఎగసి రూ.81,700కి చేరింది. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో ధర స్పాట్ గోల్డ్ ఔన్స్ (31.1 గ్రాములు) 2,303 రికార్డు స్థాయిని తాకింది. ఇక జూన్ ఫ్యూచర్స్‌లో రికార్డు స్థాయి 2,322 డాలర్లకు చేరడం గమనార్హం.


పసిడి రుణాల్లోకి పిరమల్ ఫైనాన్స్



ముంబై: పిరమల్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పసిడి రుణాలు, సూక్ష్మ రుణాల విభాగాల్లోకి కార్యకలాపాలు విస్తరించనుంది. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి తమ ఏయూఎం (నిర్వహణలోని అసెట్స్)ను రూ. 1.3 లక్షల కోట్లకు, రిటైల్ వాటాను 70 శాతానికి, హోల్‌సేల్ వాటాను 30 శాతానికి పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు సంస్థ ఎండీ జైరామ్ శ్రీధరన్ తెలిపారు. ప్రస్తుతం రూ. 70,823 కోట్లుగా ఉన్న తమ ఏయూఎంలో మైక్రోఫైనాన్స్ విభాగం రూ. 1,000 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. చిన్న షాపులు, ప్రాపర్టీలను తనఖాగా ఉంచుకుని చిన్న మొత్తాల్లో రూ. 10 లక్షల లోపు రుణాలను ఇచ్చే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎక్స్‌యూవీ 300 ఫేస్‌లిఫ్ట్ వస్తోంది

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా ఎక్స్‌యూవీ 300 ఫేస్‌లిఫ్ట్‌ను ఏప్రిల్ 29న ప్రవేశపెడుతోంది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో పేరుతో దీనిని పరిచయం చేస్తోంది. ఈ మేరకు టీజర్‌ను విడుదల చేసింది. ఎక్స్‌యూవీ 300 మాదిరిగానే 1.2 లీటర్ టర్బో పెట్రోల్, 1.5 లీటర్ డీజిల్ ఇంజన్స్‌తో రూపుదిద్దుకుంది. కొత్త ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, డ్యూయల్ టోన్ అలాయ్ వీల్స్, సి-షేప్డ్ ఎల్‌ఈడీ టెయిల్, రీ-డిజైన్డ్ గ్రిల్స్, సన్‌రూఫ్ ఏర్పాటు చేశారు. డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, ఆరు ఎయిర్‌బ్యాగ్స్, అడాస్, 10.25 అంగుళాల టచ్ స్క్రీన్ వంటి ఫీచర్లు జోడించే అవకాశం ఉంది. ఎక్స్‌షోరూంలో ప్రారంభ ధర రూ.9 లక్షల నుంచి ఉంటుందని సమాచారం.



మార్చిలో సేవలు బాగున్నాయ్



న్యూఢిల్లీ: తయారీ, సేవల రంగాలు గడచిన ఆర్థిక సంవత్సరం చివరి నెల- మార్చిలో మంచి ఫలితాలను నమోదుచేసుకున్నాయి. ఫిబ్రవరిలో 60.6 వద్ద ఉన్న హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ మార్చిలో 61.2కు ఎగసింది. ఇక సేవలు-తయారీ రెండింటికీ సంబంధించి హెచ్‌ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ సూచీ ఫిబ్రవరిలో 60.6 వద్ద ఉంటే, మార్చిలో 61.8కి ఎగసింది. గడచిన 13 సంవత్సరంలో ఇంత గరిష్ఠ స్థాయిలో సూచీల నమోదు ఇదే తొలిసారి. ఇక ఒక్క తయారీ రంగాన్ని చూస్తే- హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఫిబ్రవరిలో 56.9 వద్ద ఉంటే, మార్చిలో ఏకంగా 16 సంవత్సరాల గరిష్ఠ స్థాయి 59.1కి ఎగసింది. వ్యవస్థలో సానుకూల డిమాండ్, కొత్త ఆర్డర్‌లు, ఉత్పత్తి, ఇన్‌పుట్ స్టాక్‌ల బలమైన వృద్ధిని ఈ ఫలితాలను ప్రతిబింబిస్తుంది. కాగా ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆలోపునకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు.

స్పెక్ట్రం వేలం జూన్ 6కి వాయిదా

న్యూఢిల్లీ: బిడ్లను ఆహ్వానిస్తూ జారీ చేసిన నోటీసులో సవరణలకు అనుగుణంగా స్పెక్ట్రం వేలం తేదీని 17 రోజుల పాటు వాయిదా వేస్తూ టెలికం శాఖ (డాట్) నిర్ణయం తీసుకుంది. జూన్ 6న నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే, బిడ్డర్లకు నిధుల లభ్యత మెరుగ్గా ఉండేలా చూసే దిశగా బ్యాంక్ గ్యారంటీ, ధరావతు మొత్తాన్ని కూడా తగ్గించింది. నిజానికి మే 20న వేలం నిర్వహించాల్సి ఉంది. అయితే లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం జూన్ 6కి వేలాన్ని మార్చారు. ఇక నమూనా వేలాన్ని మే 13, 14 తేదీల్లో కాకుండా జూన్ 3న నిర్వహించనున్నారు. మొబైల్ ఫోన్ సర్వీసుల కోసం రూ. 96,317 కోట్ల బేస్ ధరతో ఎనిమిది బ్యాండ్లలో (800 మెగాహెర్ట్జ్ నుంచి 26 గిగాహెర్ట్జ్ బ్యాండ్ వరకు) స్పెక్ట్రంను వేలం వేయనున్నారు. 20 ఏళ్ల స్పెక్ట్రం కేటాయిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403-00
విజయవాడ	403-00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00

బ్లూస్టార్ నుంచి కొత్త డీప్ ఫ్రీజర్ల శ్రేణి

ధర రూ. 16,000 నుంచి ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తదితర ఉత్పత్తుల తయారీ దిగ్గజం బ్లూస్టార్ తాజాగా విద్యుత్ ఆదా చేసే డీప్ ఫ్రీజర్ల శ్రేణిని మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. వీటి సామర్థ్యం 60 లీటర్ల నుంచి 600 లీటర్ల వరకు ఉంటుంది. ధర రూ. 16,000 నుంచి ప్రారంభమవుతుందని గురువారమిక్కడ విలేకరుల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా సంస్థ ఎండీ బి. త్యాగరాజన్ తెలిపారు. మేకిన్ ఇండియా నినాదానికి అనుగుణంగా వీటిని దేశీ పరిజ్ఞానంతో రూపొందించినట్లు వివరించారు. గతేడాది సీజన్‌తో పోలిస్తే 25 శాతం వరకు అమ్మకాల వృద్ధిని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, శ్రీసిటీ ప్లాంటులో రూమ్ ఏసీల ఉత్పత్తి సామర్థ్యాలను ఈ ఆర్థిక సంవత్సరం ఆరు లక్షల యూనిట్లకు, దశలవారీగా 12 లక్షల యూనిట్లకు పెంచుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీకి దగ్గర్లో తీసుకున్న 40 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు 2026-27లో ప్రారంభమవుతాయన్నారు.

భారత్‌లో ప్లాంటు ఏర్పాటు దిశగా టెస్లా

- స్థలాన్వేషణకు ఈ నెలాఖరుకు రానున్న కంపెనీ టీమ్
- రూ. 25,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా .. భారత్‌లో తయారీ ప్లాంటు ఏర్పాటు ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా స్థలాన్వేషణ కోసం ఏప్రిల్ నెలాఖరుకు అమెరికా నుంచి కంపెనీ బృందం భారత్ సందర్శించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వాహనాల తయారీకి ప్రధాన కేంద్రాలుగా ఉంటున్న మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడుపై టెస్లా దృష్టి పెట్టే అవకాశం ఉందని వివరించాయి. 2-3 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 16,500 - 25,000 కోట్లు) పెట్టుబడులతో భారత్‌లో ప్లాంటును ఏర్పాటు చేసే అంశాన్ని కంపెనీ పరిశీలిస్తోంది.

వాస్తవానికి ప్రధాన మార్కెట్లయిన అమెరికా, చైనాలో డిమాండ్ మందగిస్తుండటంతో టెస్లా భారత్ మార్కెట్లో ఎంట్రీ కోసం కొన్నాళ్లుగా ప్రయత్నాలు చేస్తోంది. కానీ, భారీ స్థాయి దిగుమతి సుంకాలు, దేశీయంగా తయారీ చేపట్టాలన్న నిబంధనలు అవరోధంగా నిలుస్తున్నాయి. అయితే, దేశీయంగా విద్యుత్ వాహనాల తయారీని ప్రోత్సహించే దిశగా కేంద్రం ఇటీవల పలు చర్యలు ప్రకటించిన నేపథ్యంలో భారత్‌లో టెస్లా తయారీ ప్లాంటు ప్రతిపాదనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కనీసం 500 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసి, మూడేళ్లలో దేశీయంగా వాహనాలను తయారు చేయడం మొదలుపెట్టే విదేశీ కంపెనీలు.. తక్కువ సుంకాలకే నిర్దిష్ట సంఖ్యలో కార్లను దిగుమతి చేసుకునేందుకు కేంద్రం అనుమతించిన సంగతి తెలిసిందే. గతేడాది భారత్‌లో అమ్ముడైన మొత్తం కార్లలో విద్యుత్ కార్ల వాటా 2 శాతంగానే నమోదైనప్పటికీ.. కానీ 2030 నాటికి దీన్ని 30 శాతానికి చేర్చాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించింది. దేశీయంగా ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో టాటా మోటార్స్ ఆధిపత్యం కొనసాగుతోంది. టెస్లా వస్తే ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులు రాగలవని, స్థానిక ఆటో విడిభాగాల తయారీదార్లకు కూడా ప్రయోజనం చేకూరగలదని అంచనా.

సరికొత్త శిఖరాలపై సూచీలు

ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలకు ముందు కొనుగోళ్లు

- ఫైనాన్స్, బ్యాంకులు, ఆటో షేర్లకు డిమాండ్
- ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డుల నమోదు
- సూచీల ర్యాలీకి దన్నుగా హెచ్‌డీఎఫ్‌సీ, టీసీఎస్ షేర్లు



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన ప్రకటన(నేడు)కు ముందు ఇన్వెస్టర్లు ఫైనాన్స్, బ్యాంకులు, ఆటో, కన్జూమర్స్ షేర్లను కొనేందుకు ఆసక్తి చూపారు. ఫలితంగా గురువారం సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులను నమోదు చేశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(3%), టీసీఎస్(2%) షేర్లు రాణించి సూచీల రికార్డు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఉదయం సెన్సెక్స్ 537 పాయింట్లు భారీ లాభంతో 74,414 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 626 పాయింట్లు ఎగసి 74,502 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 351 పాయింట్లు లాభపడి కొత్త రికార్డు స్థాయి 74,228 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నిఫ్టీ సైతం 184 పాయింట్లు దూసుకెళ్లి 22,619 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. ఆఖరి 80 పాయింట్లు పెరిగి సరికొత్త శిఖరం 22,515 వద్ద నిలిచింది. రికార్డు ర్యాలీలోనూ ఆయిల్ అండ్ గ్యాస్, ఇంధన, సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు వరుసగా 0.34%, 0.54% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,136 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.893 కోట్ల షేర్లను విక్రయించాయి. జపాన్, సింగపూర్ సూచీలు 1% పెరిగాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు సైతం అరశాతం లాభంతో ట్రేడవుతున్నాయి. వివిధ వ్యాపార సంస్థల రూ.816 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకోవడంతో కేఈసీ ఇంటర్నేషనల్ 6% ఎగసి రూ.770 వద్ద ముగిసింది.

కరెన్సీ డెరివేటివ్స్ నిబంధనల వాయిదా

రూపాయి ఆధారిత ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కరెన్సీ డెరివేటివ్స్‌పై జారీ చేసిన మార్గదర్శకాల అమలును ఆర్‌బీఐ మే 3వరకూ వాయిదా వేసింది. వివిధ వర్గాల అభిప్రాయాల నేపథ్యంలో తాజా నిబంధనల అమలును నెల రోజులపాటు వాయిదా వేసింది.



పంత్‌కు రూ. 24 లక్షల జరిమానా

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌పై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రూ. 24 లక్షల జరిమానా విధించింది. విశాఖపట్నంలో బుధవారం కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు బౌలర్లు నిర్ణీత సమయంలో కనీస ఓవర్ల కోటా పూర్తి చేయలేదు. ఈ సీజన్‌లో ఢిల్లీ జట్టు రెండోసారి స్లో ఓవర్‌రేట్ నమోదు చేసింది.

శ్రీజ, ఐనీ రెడ్డిలకు పతకాలు

జాతీయ సబ్ జూనియర్ క్యారమ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు రెండు పతకాలు లభించాయి. వారణాసిలో జరిగిన ఈ పోటీల్లో అండర్-14 బాలికల సింగిల్స్‌లో వి. ఐనీ రెడ్డి రజత పతకం... అండర్-12 బాలికల సింగిల్స్‌లో టి.శ్రీజ కాంస్య పతకం గెల్చుకున్నారు. పతక విజేతలకు తెలంగాణ క్యారమ్ సంఘం జనరల్ సెక్రటరీ ఎస్.మదన్‌రాజ్ అభినందించారు.



ఉబెర్ కప్ టోర్నీకి సింధు దూరం

గాయత్రి-ట్రెసా, అశ్విని-తనీషా జోడీలు కూడా అవుట్



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఉబెర్ కప్ మహిళల టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈసారి భారత ద్వితీయ శ్రేణి జట్టు బరిలోకి దిగనుంది. ఈ మెగా టోర్నీ ఏప్రిల్ 27 నుంచి మే 5 వరకు చైనాలోని చెంగ్డూలో జరగనుంది. సింగిల్స్ విభాగం నుంచి స్టార్ ప్లేయర్ పీవీ సింధు తప్పుకోగా... డబుల్స్ విభాగం నుంచి పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ; అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీలు కూడా వైదొలిగాయి. పారిస్ ఒలింపిక్స్‌కల్లా తన ఆటలో మరింత పదును పెరిగేందుకు, పూర్తి ఫిట్‌గా ఉండేందుకు సింధు ఉబెర్ కప్ నుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకుంది. పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు దక్కించుకోవాలనే లక్ష్యంతో గాయత్రి-ట్రెసా, అశ్విని-తనీషా జోడీలు ఇతర క్వాలిఫయింగ్ టోర్నీలపై దృష్టి పెట్టాయి. భారత మహిళల జట్టు ఉబెర్‌కప్‌లో మూడుసార్లు (1957, 2014, 2016) సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు సాధించింది. మరోవైపు థామస్ కప్ పురుషుల టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ పూర్తి బలగంతో బరిలోకి దిగనుంది.

భారత మహిళల జట్టు: అన్‌మోల్, తన్వీ శర్మ, అష్మిత, ఇషారాణి బారువా (సింగిల్స్); శ్రుతి మిశ్రా, ప్రియా కొంజెంగ్‌బమ్, సిమ్రన్, రితిక (డబుల్స్). **భారత పురుషుల జట్టు:** ప్రణయ్, లక్ష్య సేన్, శ్రీకాంత్, ప్రియాన్షు, కిరణ్ జార్జి (సింగిల్స్); సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, అర్జున్, ధ్రువ్ కపిల, సాయిప్రతీక్ (డబుల్స్).

ఆసియా చాంపియన్‌షిప్ నుంచి వైదొలిగిన సాత్విక్ జోడీ



భుజం గాయం నుంచి సాత్విక్ పూర్తిగా కోలుకోకపోవడంతో... ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నుంచి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ వైదొలిగింది. గత ఏడాది దుబాయ్‌లో జరిగిన ఈ మెగా టోర్నీలో సాత్విక్-చిరాగ్ శెట్టి ద్వయం పురుషుల డబుల్స్‌లో స్వర్ణ పతకం సాధించి కొత్త చరిత్ర సృష్టించింది. థామస్ కప్‌లో మాత్రం సాత్విక్-చిరాగ్ ద్వయం బరిలోకి దిగుతుందని భారత బ్యాడ్మింటన్ సంఘం తెలిపింది. ఆసియా చాంపియన్‌షిప్ ఈనెల 9 నుంచి 14 వరకు చైనాలో జరుగుతుంది.

క్వార్టర్ ఫైనల్లో రుత్విక జోడీ



అస్తానా: కజకిస్తాన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ క్రీడాకారిణి గద్దె రుత్విక శివాని క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో రుత్విక-రోహన్ కపూర్ (భారత్) జోడీ 22-20, 21-17తో కెన్నెత్-గ్రోన్యా సోమర్‌విల్లె (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ ఆటగాడు తరుణ్ మన్నెపల్లి 22-24, 21-18, 21-13తో భారత్‌కే చెందిన శంకర్ ముత్తుస్వామిపై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మహిళల సింగిల్స్‌లో జాతీయ చాంపియన్ అన్‌మోల్ 21-11, 21-7తో నూరానీ అజారా (యూఏఈ)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

'డ్రా'తో గట్టెక్కిన శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ


కాస్టనెడా

షిల్లాంగ్: ఐ-లీగ్ జాతీయ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఐదో 'డ్రా' నమోదు చేసింది. నెరోకా ఎఫ్‌సీతో గురువారం జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు 1-1తో 'డ్రా' చేసుకుంది. నెరోకా తరఫున రోహిత్ (70వ ని.లో), శ్రీనిధి తరఫున డేవిడ్ కాస్టనెడా మునోజ్ (82వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ప్రస్తుతం శ్రీనిధి జట్టు 44 పాయింట్లతో రెండో స్థానంలో, మొహమ్మదాన్ స్పోర్టింగ్ 49 పాయింట్లతో తొలి స్థానంలో ఉన్నాయి. శ్రీనిధి జట్టుకు టైటిల్ దక్కాలంటే చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పనిసరిగా గెలవాలి. మరోవైపు మొహమ్మదాన్ స్పోర్టింగ్ జట్టు తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పనిసరిగా ఓడిపోవాలి.

శశాంక్ కిర్రాక్...

మెరుపు ఇన్నింగ్స్‌తో పంజాబ్‌ను గెలిపించిన బ్యాటర్

- 29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61 నాటౌట్
- అశుతోష్ శర్మ కీలక ఇన్నింగ్స్
- గుజరాత్ టైటాన్స్‌కు రెండో ఓటమి
- గిల్ జిగేల్ ఇన్నింగ్స్ వృథా


శశాంక్ సింగ్

అహ్మదాబాద్: సొంతగడ్డపై మాజీ చాంపియన్లు ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌లను ఓడించిన గుజరాత్ టైటాన్స్‌కు పంజాబ్ కింగ్స్ చెక్ పెట్టింది. గురువారం ఆఖరి ఓవర్లో ఉత్కంఠ రేపిన ఐపీఎల్ పోరులో నిరుటి రన్నరప్ టైటాన్స్ 3 వికెట్ల తేడాతో ఓడింది. మొదట గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. కెప్టెన్, ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (48 బంతుల్లో 89 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. సాయి సుదర్శన్ (19 బంతుల్లో 33; 6 ఫోర్లు) ధాటిగా ఆడాడు. రబడకు 2 వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ కింగ్స్ 19.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శశాంక్ సింగ్ (29 బంతుల్లో 61 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇంపాక్ట్ ప్లేయర్ అశుతోష్ శర్మ (17 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు బ్యాటింగ్‌తో పంజాబ్‌ను గెలిపించారు. నూర్ అహ్మద్ 2 వికెట్లు తీశాడు.

ఓపెనర్ గిల్ ఆఖరిదాకా...

వృద్ధిమాన్ సాహా (11)తో ఇన్నింగ్స్ ఓపెన్ చేసిన శుబ్‌మన్ ఆఖరిదాకా టైటాన్స్ స్కోరు పెంచే పనిలో పడ్డాడు. కేన్ విలియమ్సన్ (22 బంతుల్లో 26; 4 ఫోర్లు) నింపాదిగా ఆడగా, జట్టు పవర్‌ప్లేలో 52/1 స్కోరు చేసింది. కెప్టెన్ గిల్ ధాటికి సాయి సుదర్శన్ జోరు తోడయ్యాకే గుజరాత్ పుంజుకుంది. 12వ ఓవర్లో జట్టు స్కోరు 100 దాటింది. శుబ్‌మన్ 31 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. చకచకా పరుగులు జతచేస్తున్న సుదర్శన్‌కు హర్షల్ చెక్‌పెట్టగా, విజయ్ శంకర్ (8) నిరాశపరిచాడు. 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చిన రాహుల్ తెవాటియా డెత్ ఓవర్లలో బ్యాట్ ఝుళిపించాడు. 19వ ఓవర్ వేసిన హర్షల్ పటేల్ 3 వైడ్లు సహా 9 బంతులేయగా తెవాటియా 6, 4 బాదడంతో ఏకంగా 20 పరుగులు వచ్చాయి. అయితే ఆఖరి ఓవర్ వేసిన అర్ష్‌దీప్ తొలి నాలుగు బంతుల్లో 5 పరుగులే ఇచ్చాడు. అయితే చివరి రెండు బంతుల్ని తెవాటియా బౌండరీలకు తరలించడంతో టైటాన్స్ 199/4 స్కోరు చేసి సరిగ్గా 200 లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది.

మ్యాచ్ విన్నర్‌గా...

భారీ లక్ష్యఛేదనలో శిఖర్ ధావన్ (1) విఫలమైనా... బెయిర్‌స్టో (13 బంతుల్లో 22; 4 ఫోర్లు), ప్రభ్‌సిమ్రన్ (24 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా పరుగులు సాధించారు. 13వ ఓవర్లో సికందర్ రజా (15) అవుటైనప్పుడు పంజాబ్ స్కోరు 111/5. గెలుపుపై ఆశల్లేని స్థితిలో జితేశ్ శర్మ అండతో శశాంక్ సింగ్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. ఇద్దరు 3.1 ఓవర్లలోనే 39 పరుగులు జోడించారు. రెండు వరుస సిక్సర్లు కొట్టిన జితేశ్‌ను రషీద్ బోల్తా కొట్టించాడు. ఈ దశలో కింగ్స్ విజయానికి 27 బంతుల్లో 50 పరుగులు కావాలి. ఇంపాక్ట్ ప్లేయర్‌గా క్రీజులోకి వచ్చిన అశుతోష్... నిలదొక్కుకున్న శశాంక్‌తో కలిసి ధనాధన్ ఆటతో 19వ ఓవర్లోనే విజయసమీకరణాన్ని సులువు చేశాడు. ఆఖరి ఓవర్‌కు వచ్చేసరికి 6 బంతుల్లో 7 పరుగులు చేయాల్సివుండగా, తొలి బంతికే అశుతోష్ అవుటైనా... శశాంక్ మరో వికెట్ పడకుండా జట్టును గెలిపించాడు. గత డిసెంబర్‌లో జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో పంజాబ్ కింగ్స్ యాజమాన్యం శశాంక్ సింగ్‌ను కొనుగోలు చేసింది. అయితే వేలం జాబితాలో ఇద్దరు శశాంక్ సింగ్‌లు ఉండగా... తాము కోరుకున్న శశాంక్ సింగ్‌ను కాకుండా అదే పేరుతో ఉన్న మరో శశాంక్ సింగ్‌ను పొరపాటుగా తీసుకున్నామని పంజాబ్ కింగ్స్ సహ యజమాని ప్రీతి జింటా వ్యాఖ్యానించింది. ఇది కాస్తా వివాదం కావడంతో ఇద్దరు శశాంక్‌లు తమ దృష్టిలో ఉన్నారని, తాము పొరపాటు చేయలేదని వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసింది. ఆనాడు శశాంక్ సింగ్‌ను పొరపాటుగా తీసుకున్నామని భావించిన పంజాబ్ కింగ్స్ జట్టుకు నేడు మ్యాచ్ విన్నర్‌గా అవతరించడం విశేషం.


గిల్

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) ధావన్ (బి) రబడ 11; గిల్ (నాటౌట్) 89; విలియమ్సన్ (సి) బెయిర్‌స్టో (బి) హర్‌ప్రీత్ 26; సుదర్శన్ (సి) జితేశ్ (బి) హర్షల్ 33; విజయ్ శంకర్ (సి) హర్‌ప్రీత్ (బి) రబడ 8; తెవాటియా (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 199. **వికెట్ల పతనం:** 1-29, 2-69, 3-122, 4-164. **బౌలింగ్:** హర్‌ప్రీత్ బ్రార్ 4-0-33-1, అర్ష్‌దీప్ 4-0-33-0, రబడ 4-0-44-2, స్యామ్ కరన్ 2-0-18-0, హర్షల్ పటేల్ 4-0-44-1, సికందర్ రజా 2-0-22-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (బి) ఉమేశ్ 1; బెయిర్‌స్టో (బి) నూర్ అహ్మద్ 22; ప్రభ్‌సిమ్రన్ (సి) మోహిత్ (బి) నూర్ అహ్మద్ 35; స్యామ్ కరన్ (సి) విలియమ్సన్ (బి) అజ్మతుల్లా 5; సికందర్ (సి) సాహా (బి) మోహిత్ 15; శశాంక్ (నాటౌట్) 61; జితేశ్ (సి) దర్శన్ (బి) రషీద్ ఖాన్ 16; అశుతోష్ (సి) రషీద్ ఖాన్ (బి) దర్శన్; హర్‌ప్రీత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం** (19.5 ఓవర్లలో 7 వికెట్లకు) 200. **వికెట్ల పతనం:** 1-13, 2-48, 3-64, 4-70, 5-111, 6-150, 7-193. **బౌలింగ్:** అజ్మతుల్లా 4-0-41-1, ఉమేశ్ 3-0-35-1, రషీద్ ఖాన్ 4-0-40-1, నూర్ అహ్మద్ 4-0-32-2, మోహిత్ శర్మ 4-0-38-1, దర్శన్ 0.5-0-6-1.

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ X చెన్నై
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	3	3	0	6	2.518
రాజస్తాన్	3	3	0	6	1.249
చెన్నై	3	2	1	4	0.976
లక్నో	3	2	1	4	0.483
పంజాబ్	4	2	2	4	-0.220
గుజరాత్	4	2	2	4	-0.580
హైదరాబాద్	3	1	2	2	0.204
బెంగళూరు	4	1	3	2	-0.876
ఢిల్లీ	4	1	3	2	-1.347
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

మన ఎన్నారైలు సృష్టించిన రికార్డు ఇది

విదేశాల నుంచి నిధుల వరద
పారిస్తున్న ప్రవాస భారతీయులు

- 2023లో పంపించిన నగదు రూ.8.34 లక్షల కోట్లు
- డిసెంబర్ నాటికి ముగిసిన త్రైమాసికంలోనే రూ.2.50 లక్షల కోట్లు

సాక్షి, అమరావతి: విదేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) మరో రికార్డు సృష్టించారు. విదేశాల నుంచి స్వదేశానికి నిధులు పంపిస్తున్న వారిలో భారతీయులే అధికంగా ఉన్నారు. వివిధ దేశాల్లో స్థిరపడ్డ భారతీయులు గతేడాది రూ.8.34 లక్షల కోట్లను తమ కుటుంబ సభ్యులకు పంపించారు. 1991లో ఆర్థిక సంస్కరణలతో మొదలైన ఈ నిధుల వరద ఏటేటా పెరుగుతోంది. 2023లో రికార్డు స్థాయిలో రూ.8.34 లక్షల కోట్లు పంపడం విశేషం. ప్రవాస భారతీయులు స్వదేశంలోని తమ కుటుంబ సభ్యుల అవసరాలు తీర్చేందుకు, ఆస్తులు కొనుగోలు చేసేందుకు ఈ నిధులను పంపుతున్నారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా నివేదిక వెల్లడించింది. ప్రవాసుల నుంచి నిధులు పొందుతున్న దేశాల్లో భారతదేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని నివేదిక పేర్కొంది.

ఆర్‌బీఐ నివేదిక ఏం చెప్పిందంటే..

- 2023లో ప్రవాస భారతీయులు భారత్‌లోని తమ కుటుంబ సభ్యులకు రూ.8.34 లక్షల కోట్లకు పైగా నగదు పంపించారు. ఒక్క డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలోనే రూ.2.50 లక్షల కోట్లు రావడం విశేషం.
- 2013 తరువాత ఒక త్రైమాసికంలో వచ్చిన నిధుల్లో ఇదే రికార్డు. 2013–14 డిసెంబర్ నాటికి ముగిసిన త్రైమాసికంలో రూ.1.20 లక్షల కోట్లు రాగా.. 2023 డిసెంబర్‌లో అందుకు రెట్టింపు స్థాయిలో రూ.2.50 లక్షల కోట్ల నిధులు వచ్చాయి.
- భారత్ నిధులు పంపిస్తున్న వారిలో అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయులు మొదటి స్థానంలో ఉన్నారు. భారత్‌కు వస్తున్న విదేశీ నిధుల్లో 23 శాతం అమెరికా నుంచే వస్తున్నాయి. ఆ తరువాత స్థానంలో గల్ఫ్ దేశాలు ఉన్నాయి.
- ప్రవాస భారతీయులు పంపుతున్న నిధుల్లో 55 శాతం వరకు వారి కుటుంబ అవసరాలు తీర్చేందుకు వెచ్చిస్తుండగా .. 45 శాతం నిధులను దేశంలో ఆస్తులు కొనుగోలు చేయడంతోపాటు బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తున్నారు.
- ప్రవాస భారతీయులు పంపుతున్న నిధుల నుంచి సేకరించిన డిపాజిట్లు 2022–23తో పోలిస్తే 2023–24లో రెండు రెట్లు పెరిగాయి. 2023లో దాదాపు రూ.2 లక్షల కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్లుగా మారాయి.

'ప్రత్యేక హోదా' కేసును కొట్టేసిన రైల్వే కోర్టు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ప్రత్యేక హోదా కోసం 2018లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉద్యమాలు చేశారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు 2018 ఏప్రిల్ 11న విశాఖ రైల్వేస్టేషన్‌లో పాసింజర్ రైలును నిలుపుదల చేశారు. ప్రస్తుత మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మళ్ల విజయ్‌ప్రసాద్, కోలా గురువులు, జాన్‌వెస్లీ తదితరులు రైలింజన్ ఎక్కి ప్రత్యేక హోదా సాధన కోసం రైల్‌రోకో చేపట్టి నిరసన తెలియజేశారు. అప్పట్లో గవర్నమెంట్ రైల్వే పోలీసుల, రైల్వే భద్రతా దళ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. కాగా.. ఈ కేసును గురువారం రైల్వే కోర్టు కొట్టివేసింది.

'కొడాలి'ని ఎదుర్కోలేక టీడీపీ అబద్ధాలు

ఎల్లో మీడియా ద్వారా తప్పుడు ప్రచారం

- టీడీపీ నేత ఇంట్లో పోలీసులు చీరలు స్వాధీనం చేసుకుంటే కొడాలి అనుచరుడి ఇంట్లో అంటూ ప్రచారం
- తప్పుడు వార్తపై ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామన్న డీఎస్పీ

గుడివాడ రూరల్: కృష్ణా జిల్లా గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని ఎదుర్కొనే దమ్ము లేక టీడీపీ నేతలు ఎల్లో మీడియాతో కలిసి అసత్య ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. రెండు రోజుల కిందట పామర్రు మండలం పెరిశేపల్లిలో టీడీపీ నేత ఇంట్లో డీఎస్పీ పి.శ్రీకాంత్.. పామర్రు సీఐ, ఎస్‌ఐలతో కలసి దాడి చేసి భారీగా చీరలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అనుచరుడి ఇంట్లో భారీగా చీరలు పట్టుకున్నారని.. బ్రేకింగ్ న్యూస్ అంటూ ఎల్లో మీడియాలో తప్పుడు కథనాన్ని ప్రసారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ విషయంపై డీఎస్పీ పి.శ్రీకాంత్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. రెండు రోజుల కిందట టీడీపీ నేత ఇంట్లో చీరలను స్వయంగా అర్ధరాత్రి సమయంలో తానే సిబ్బందితో కలిసి పట్టుకున్నానని, ఈటీవీ న్యూస్‌లో బ్రేకింగ్ న్యూస్ అంటూ తప్పుడు కథనాన్ని ప్రసారం చేసిన విషయం తెలుసుకుని వారికి సమాచారం అందించామని తెలిపారు. ఫిర్యాదు చేస్తే తప్పుడు వార్త ప్రచురించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు.

రేపటి నుంచే వార్షిక పరీక్షలు

సాక్షి, అమరావతి: ఒకటి నుంచి 9 తరగతులకు వార్షిక పరీక్షల (సమ్మెటివ్ అసెస్‌మెంట్–2) షెడ్యూల్‌లో ఏ మార్పు లేదని, ముందుగా ప్రకటించిన విధంగా శనివారం నుంచి పరీక్షలు జరుగుతాయని ఏపీ ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల తేదీలను మార్చినట్టు కొంతమంది తప్పుడు షెడ్యూల్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేసుల వివరాలు ఇప్పించండి

హైకోర్టులో టీడీపీ నేతల పిటిషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో తమపై నమోదైన కేసుల వివరాలను, ఎఫ్‌ఐఆర్ కాపీలను అందచేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ టీడీపీ అభ్యర్థులు ధూళిపాళ్ల నరేంద్ర, బొండా ఉమా, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు, భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్ర యాదవ్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాస రెడ్డి గురువారం విచారణ జరిపారు. పూర్తి వివరాలు తెలుసుకుని తన ముందుంచాలని హోం శాఖ న్యాయవాదిని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లందరూ త్వరలో జరిగే ఎన్నికల్లో పోటీ చేయనున్నారని తెలిపారు. ఎన్నికల అఫిడవిట్‌లో వారిపై ఉన్న కేసులను ప్రస్తావించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా తమపై నమోదైన కేసుల వివరాలు అందచేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

ఓటుకు కోట్లు కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు కోట్లు కేసు మరోసారి వాయిదా పడింది. ఈ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును నిందితునిగా చేర్చాలని, సీబీఐకి అప్పగించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు ఈ ఏడాది జనవరి 10న జస్టిస్ ఎంఎం.సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం విచారణ జరిపి.. ఏప్రిల్ 3 తేదీకి వాయిదా వేసింది. అయితే.. బుధవారం ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు విచారణలో భాగంగా జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కలిసి జస్టిస్ ఎంఎం .సుందరేశ్ ప్రత్యేక బెంచ్ ఏర్పాటైంది. దీంతో ఆళ్ల రామకృష్ణారెడ్డి పిటిషన్లు గురువారానికి జాబితా అయ్యాయి. బుధవారం రాత్రి ఈ పిటిషన్‌ను జాబితా చేశారని, అందువల్ల విచారణను వాయిదా వేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాది ధర్మాసనం ముందు ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఈ ఒక్కసారికే వాయిదా వేస్తున్నామని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 17వ తేదీన వచ్చే అవకాశం ఉంది.


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024




వేణుగోపాలుడి సన్నిధిలో..
కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు గురువారం దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం గురువారం 512.10 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 6,325, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

తిరుమలగిరి ఆలయ ఈఓగా సాంబశివరావు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): తిరుమలగిరి వాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా నెమలి వేణుగోపాలస్వామి ఆలయ ఏసీ నూతక్కి వెంకట సాంబశివరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
విజయవాడ	6.25	4.40
జగ్గయ్యపేట	6.28	4.47
మచిలీపట్నం	6.25	4.39
గుడివాడ	6.25	4.40

న్యూస్‌రీల్

జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక



పెనమలూరు: జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేశామని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. అశోక్ గురువారం వివరాలు తెలుపుతూ ఈ నెల 6,7 తేదీల్లో 13వ ఫెడరేషన్ కప్ జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలు గోవా వాస్కోడిగామాలో జరగనున్నాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర జట్టుకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేశామని చెప్పారు. 55 కేజీల విభాగంలో కె.బాలకృష్ణ, సీహెచ్ దుర్గాప్రసాద్, 60 కేజీల విభాగంలో వి.రాజ్‌కుమార్, 65 కేజీల విభాగంలో ఎస్‌కే సాకీబ్, 70 కేజీల విభాగంలో డి.రమేష్‌నాయక్ ఎంపికయ్యారని తెలిపారు. వీరిని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, సీనియర్ నేత పిడికిటి రామకోటేశ్వరరావు, జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్షుడు బి.మనోహర్, సభ్యులు సీహెచ్ రాజు, నరేంద్ర, కేఎస్‌బీ కోటి, వినోద్ అభినందించి పతకాలు సాధించాలని కోరారు.

జిల్లాలో 86.94 శాతం పింఛన్ల పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక 86.94 శాతం పంపిణీ జరిగింది. జిల్లాలో మొత్తం 2,37,365 మంది పెన్షనర్లకు 2,06,359 మంది పింఛన్ అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా నందిగామ అర్బన్‌లో 95.11 శాతం, తిరువూరు అర్బన్‌లో 94.05, జి కొండూరు మండలంలో 92.96, మైలవరం 91.5, విజయవాడ అర్బన్‌లో 91.25 పంపిణీ పూర్తైంది. వత్సవాయి మండలంలో అత్యల్పంగా 73.71 శాతం పంపిణీ చేశారు.

సీ-విజిల్ కేంద్రం పరిశీలన



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీ-విజిల్ కేంద్రాన్ని రాష్ట్ర వ్యయ పరిశీలకులు రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి నీనా నిగం గురువారం పరిశీలించారు. సి-విజిల్ యాప్ ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను తెలుసుకున్నారు. అక్రమంగా నగదు, మద్యం, ఇతర సామగ్రి సరఫరా జరిగితే ఆ సమాచారం తెలుసుకుని వెంటనే ఎస్ఎస్‌టీ టీం ద్వారా స్వాధీనం చేసుకునే ప్రక్రియను ఆమె అడిగారు. సి-విజిల్ ద్వారా వచ్చిన సమస్యలు 40 నిమిషాల్లో పరిష్కరిస్తున్నట్లు కేంద్రం నోడల్ అధికారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి ఆమెకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, ఎస్పీ నయీమ్‌అస్మీ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఏఎస్పీ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీల్లో యుక్తశ్రీ సత్తా



విజయవాడస్పోర్ట్స్: పశ్చిమ బెంగాల్‌లోని బోల్‌పూర్‌లో జరిగిన నాలుగవ ఎన్టీపీసీ జాతీయ ఆర్చరీ సబ్ జూనియర్ రికర్వ్ టోర్నీలో విజయవాడ క్రీడాకారిణి కె.యుక్తశ్రీ సత్తా చాటింది. చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమిలో శిక్షణ పొందుతున్న యుక్తశ్రీ ఈ పోటీలకు ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించారు. గత నెల 28న ప్రారంభమైన పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్‌లో మధ్యప్రదేశ్ క్రీడాకారిణి జాహ్నవి దేశ్‌ముఖ్‌తో జరిగిన మ్యాచ్‌లో 5-5 స్కోర్‌తో టై కాగా, తర్వాత టై బ్రేకర్‌లో 10-9 తేడాతో యుక్తశ్రీ విజయం సాధించి చాంపియన్‌గా నిలిచారు. గత ఏడాది రాయ్‌పూర్ టోర్నీలోనూ చాంపియన్‌గా నిలిచింది. ఆమెను పలువురు అభినందించారు.

క్షీర సిరులు



పాల సేకరణ కేంద్రానికి పాలు తీసుకొచ్చిన మహిళలు(ఫైల్)

- రాష్ట్రంలో పాడి పరిశ్రమ కొత్తపుంతలు
- ఎన్టీఆర్ జిల్లాలో పాలవెల్లువ కింద మహిళా రైతుల ఖాతాల్లోకి రూ.20.42 కోట్ల జమ
- గతం కంటే రూ.10కోట్లకు పైగా అదనపు ఆదాయం పొందిన మహిళా రైతులు

జి.కొండూరు: రాష్ట్రంలో పాడి పరిశ్రమ కొత్త పుంతలు తొక్కుతోంది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న పాలవెల్లువ' మహిళలకు సిరులు కురిపిస్తోంది. పాలధార వారి కుటుంబాలకు.. జీవనధారగా మారింది. పాడి పశువే ప్రత్యక్ష దైవమైంది. దశాబ్దాలుగా ప్రయివేటు డెయిరీల చేతివాటానికి బలైపోతున్న పాడి రైతులకు భరోసా వచ్చింది. పాడి పరిశ్రమ వదిలి ప్రత్యామ్నాయ మార్గాల వైపు అడుగులేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పాల విప్లవంతో పాడి పరిశ్రమకు పూర్వ వైభవం వచ్చింది. దీనిలో భాగంగా గ్రామాల్లో మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడి ప్రయివేటు డెయిరీ కంటే అధిక ధరలకు పాలను సరఫరా చేయడంతో యాభై శాతానికి పైగా అదనపు ఆదాయం చేకూరుతోంది. పశువుల పెంపకం, డెయిరీల నిర్వహణతో మహిళా పాడిరైతులకు అపార అవకాశాలొచ్చాయి.

బలోపేతం ఇలా

జగనన్న పాలవెల్లువ కింద అమూల్ డెయిరీకి పాలను సేకరించడానికి గ్రామాల్లో మహిళా పాడి రైతులను సంఘాలుగా ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పాలసేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పాలను సేకరిస్తున్నారు. ఇలా 11 శాతం వచ్చిన పాలు లీటరుకు రూ.88 చెల్లిస్తున్నారు. సేకరించిన పాలకు వచ్చే బిల్లును మహిళల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నారు. శాంపిల్ పాలకు వచ్చే ఆదాయంతో పాటు లీటర్లను కేజీల్లోకి కొలిచినప్పుడు అదనంగా వచ్చే ఆదాయాన్ని ఆయా గ్రామాల్లోని పాల సంఘం ఖాతాలకే జమ చేస్తున్నారు. పశువుల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయడం, రాయితీపై దాణా అందించడం, పశువుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలతో జగనన్న పాల వెల్లువ విజయవతంగా కొనసాగుతోంది.

రూ.10 కోట్లకు పైగా..

ఎన్టీఆర్ జిల్లాలో పాలవెల్లువ ప్రారంభించినప్పటి నుంచి 7,218 మంది మహిళా పాడి రైతుల నుంచి 37,57,341 లీటర్ల పాలను సేకరించారు. వారి ఖాతాల్లో రూ.20.42 కోట్ల వరకు జమ చేశారు. గతంలో ప్రయివేటు డెయిరీల కంటే యాభై శాతం అధికంగా చెల్లించడంతో రూ.10 కోట్లు అదనపు ఆదాయాన్ని మహిళా రైతులు ఆర్జించారు.

నమ్మకం పెరిగింది



జగనన్న పాలవెల్లువ తర్వాత పాడి పరిశ్రమపై భరోసా ఏర్పడింది. గతంలో పాలకు గిట్టుబాటు ధర వచ్చేది కాదు. పెట్టిన ఖర్చులకు వచ్చే ఆదాయానికి చాలా తేడా ఉండేది. అమూల్ డెయిరీకి పాలు పోయడంతో మంచి ధర వస్తోంది. పశువులను కొనుక్కోవడానికి లోను కూడా ఇచ్చారు.

– మేడిద లక్ష్మి, పాడి రైతు, గంగినేని, జి.కొండూరు మండలం

రూ.లక్ష రుణం ఇచ్చారు



జగనన్న పాలవెల్లువ కింద అమూల్ డెయిరీకి పాలు పోయడంతో మాకు మేలు జరిగింది. పశువుల కొనుగోలు నిమిత్తం రూ.లక్ష రుణం ఇచ్చారు. గతంలో పాలకు గిట్టుబాటు ధర వచ్చేది కాదు. పాడి పరిశ్రమ వదిలేద్దాం అనుకున్నాం. ఇప్పుడు అదే వరంగా మారింది.

– పెరికల సుబ్బమ్మ పాడి రైతు, గంగినేని, జి.కొండూరు మండలం

ఎన్టీఆర్ జిల్లాలో 2021 డిసెంబరు నుంచి 2024 మార్చి వరకు సేకరించిన పాలు, ఉత్పత్తిదారుల వివరాలు

మండలాలు	15
రైతు భరోసా కేంద్రాలు	154
పాల సంఘాలు ఏర్పాటుకు నిర్ధారించిన గ్రామాలు	253
రూట్‌లు	17
పాలసేకరణ ప్రారంభమైన తేదీ	14.12.2021
పాలవెల్లువలో నమోదైన మహిళా రైతులు	23,516
వైఎస్సార్ చేయూత రైతులు	3200
పాలు సేకరిస్తున్న గ్రామాలు	94
ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రామాలు	58
ఇప్పటి వరకు ఉత్పత్తి దారులు	7218
ఇప్పటి వరకు సేకరించిన పాలు	37,57,341లీటర్లు
మహిళా రైతులకు చెల్లించింది	రూ.20,42,29,515
హ్యాండ్లింగ్ చార్జీల కింద..	రూ.32,53,000
శాంపిల్ పాలకు జమచేసిన నగదు	రూ.25,64,900
మహిళలకు అందజేసిన షార్ట్‌టర్మ్ రుణాలు (956మందికి)	రూ.3.13కోట్లు
లాంగ్ టర్మ్ రుణాలు (283మందికి)	రూ.2.56కోట్లు
ఒక్కరోజులో ఎక్కువగా సేకరించిన పాలు	9,700లీటర్లు

ఓటర్లలో చైతన్యానికి ప్రత్యేక స్వీప్



ఈవీఎం బ్యాలెట్ నమూనాను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశ ప్రజాస్వామ్య విశిష్టతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం ముఖ్యమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. జిల్లాలో ఈ దఫా ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ప్రత్యేకంగా, వినూత్నంగా స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా గురువారం విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద ఈవీఎం-బ్యాలెట్ యూనిట్ నమూనాను కలెక్టర్ ఢిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓ బీహెచ్ భవానీ శంకర్, సీనియర్ సిటిజన్స్ ఐకాన్ డాక్టర్ జి.సమరం, స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు, అడిషనల్ కమిషనర్లు ఎ.మహేష్, సత్యవతి తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడ అర్బన్ పరిధిలో 85 శాతం ఓటింగ్ లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఓటరు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వీటిలో కళాకారులను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సన్నద్ధతను తెలియజేసేందుకు, ఓటర్లను చైతన్యవంతులను చేయడానికి ఈ నమూనాను ఆవిష్కరించినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడంలో విస్తృత ప్రజా భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ప్రలోభాలకు తావులేని ఎథికల్ ఓటింగ్‌కు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేను ఓటరు అయినందుకు గర్వపడుతున్నాను.. నేను తప్పకుండా ఓటు వేస్తాను అని చాటిచెప్పడానికి వీలుగా సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు.

స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర వ్యయపరిశీలకురాలు నీనానిగం సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో గురువారం రిటర్నింగ్, నోడల్ అధికారులతో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, ఎస్పీ నయీమ్‌అస్మీతో కలిసి సమావేశం నిర్వహించారు. తొలుత ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులతో పాటు 16 అంశాలకు నోడల్ అధికారులను నియమించినట్లు వివరించారు. ఎన్నికల ఏర్పాట్లు, సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదు, మద్యం తదితర వివరాలను పరిశీలకురాలికి కలెక్టర్ వివరించారు. అనంతరం నీనా నిగం మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పార్లమెంట్ నియోజక వర్గానికి రూ. 95 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 40 లక్షలు పరిమితి విధించిందన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి చేస్తున్న వ్యయం నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించి అనధికారికంగా చేస్తున్న ఖర్చుల్లో డబ్బు, మద్యం, వస్తు పంపిణీపై గట్టి నిఘా ఉంచాలన్నారు. న్యాయ సమ్మతం లేని ఖర్చులపై దృష్టి సారించాలని చెప్పారు. చెల్లింపు వార్తలు, సామాజిక మాధ్యమాల్లో చేసే ప్రచారాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్పీ నయీమ్‌అస్మీ మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు.

ఒత్తిడితో ఆరోగ్యం చిత్తు



లబ్బీపేట(విజయవాడతూర్పు): మానసిక ఒత్తిళ్లు సర్వరోగాలకు మూలకారణంగా నిలుస్తున్నాయి. తీవ్రమైన ఒత్తిడికి గురయ్యే వారిలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతోందని, ఇన్‌ఫెక్షన్లతో పాటు అనేక సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాదు ఒత్తిడి (డిప్రెషన్) తీవ్ర మానసిక రుగ్మతలకు దారితీస్తోందని హెచ్చరిస్తున్నారు. గజిబిజి యాంత్రిక జీవన విధానంలో మానసిక ఉల్లాసంపై దృష్టి సారించక పోవడంతో వ్యాధులు చుట్టుముడుతున్నాయి.

ఇవే నిదర్శనం

- విజయవాడ పటమటకు చెందిన 45 ఏళ్ల వెంకట్ కార్పొరేట్ సంస్థలో మంచి ఉద్యోగం చేసేవాడు. ఏడాది కిందట ఉద్యోగం కోల్పోయాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టు ముట్టడంతో తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యాడు. నిద్ర పట్టక పోవడం, ఆలోచనలు ఎక్కువ కావడంతో తలనొప్పి, ఇతర రుగ్మతలకు గురయ్యాడు. ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా ఎటువంటి జబ్బు లేదని చెప్పి, సమస్యలకు ఒత్తిడే కారణమని తేల్చారు.
- విజయవాడ లబ్బీపేటకు చెందిన 35 ఏళ్ల అన్వేష్ ప్రభుత్వ ఉద్యోగి. రోజూ అర్ధరాత్రి దాటే వరకూ సెల్‌ఫోన్ చూస్తూ, ఉదయాన్నే ఆఫీసుకు వెళ్లే సమయానికి నిద్రలేచే వాడు కాదు. నిత్యం ఇలా హడావుడిగా బయలు దేరడం, ఆఫీసుకు పరుగులు పెట్టే క్రమంలో ఒత్తిడికి గురయ్యాడు. ఒత్తిడి తీవ్రరూపం దాల్చడంతో సైకాలజిస్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఇలా విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు అన్ని వర్గాలకు చెందిన వారు మానసిక రుగ్మతలకు గురవుతున్నారు.

కొరవడిన మానసికోల్లాసం..

విజయవాడ నగరంలోని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా ప్రాంగణాలు లేని పరిస్థితి నెలకొంది. ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకూ విద్యార్థులను పుస్తకాలతోనే కుస్తీపట్టించడంతో వారిలోని సృజనాత్మకత దెబ్బతినడంతో పాటు, జ్ఞాపకశక్తిని కోల్పోయి ఒత్తిడికి గురవతున్నారని మానసిక విశ్లేషకులు చెపుతున్నారు. ఆటపాటలతో చదివిన వారిలో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంటున్నారు. బట్టీచదువులతో విద్యార్థులు రోబోలుగా మారుతున్నారని హెచ్చరించారు. వారిలో సామాజిక, నైతిక విలువల కూడా పెంపొందడం లేదని చెబుతున్నారు.

మానసిక సమస్యలు ఇలా గుర్తించండి

- నిద్రలేమితో బాధపడుతున్నా, ఎల్లప్పుడూ దిగులుగా అనిపిస్తున్నా, ఏకాగ్రత సమస్యలు బాధిస్తున్నా మానసిక నిపుణుల సలహా ఎంతో అవసరం.
- ఇలాంటి వారు క్లిష్టపరిస్థితుల్లో నికోటిన్, డ్రగ్స్, ఆల్కహాల్‌తో పాటు, ఆహారం ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు.
- పిల్లల్లో తరచూ కోపం, చికాకు పడటం, తలను గోడకేసి కొట్టుకునే ప్రయత్నం చేయడం చేస్తుంటారు.
- మానసిక అశాంతికి కారణమయ్యే వ్యతిరేక భావనలు పెరిగిపోతుంటే తక్షణమే కౌన్సెలింగ్ పొందడం, ఆరోగ్య సలహా తీసుకోవడానికి మొహమాటపడకండి.
- మీ సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఇలాంటి సమస్యలతో బాధపడుతుంటే వెంటనే నిపుణులను సంప్రదించండి.

ఒత్తిడితో రుగ్మతలు



తీవ్రమైన ఒత్తిడికి గురయ్యే వారు అనేక రుగ్మతల బారిన పడతారు. ముఖ్యంగా మహిళల్లో హార్మోన్ల అసమతుల్యతతో పీరియడ్స్ సంబంధిత సమస్యలు వస్తున్నాయి. నిద్రలేక పోవడం, ఎక్కువ ఆహారం తినడం కారణంగా ఊబకాయులుగా మారుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. ఇలాంటి వారు మానసిక వైద్యులను సంప్రదించేందుకు వెనుకాడుతున్నారు. కౌన్సెలింగ్, చికిత్స పొందడం ద్వారా ఒత్తిడిని అధిగమించొచ్చు.

– డాక్టర్ మానస కాజ, అడల్ట్ అండ్ చైల్డ్ సైకియాట్రిస్ట్

యువతలో తీవ్రమైన ఒత్తిడి



ప్రస్తుతం యువత ఎక్కువగా తీవ్రమైన ఒత్తిడికి గురవుతోంది. వారిపై సెల్‌ఫోన్, సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉంది. వాటికి ఎడిక్ట్ కావడంతో ఇతర అంశాలపై దృష్టి సారించలేక పోతున్నారు. చదువులో రాణించలేక పోవడం, ఉద్యోగంలో పనిపై దృష్టి పెట్ట లేక పోవడంతో కౌన్సెలింగ్ కోసం మా వద్దకు వస్తున్నారు. దేనినైనా అవసరం మేరకు వినియోగించాలి. మానసిక ఉల్లాసం కోసం కొత్త ప్రాంతాలను సందర్శించడం, ఆటలు ఆడటం వంటి వాటిపై దృష్టి సారించాలి.

– డాక్టర్ గర్రే శంకరరావు, సైకాలజిస్టు

ఒత్తిడితో దుష్ఫలితాలు ఇవీ...

- నిద్ర పట్టక పోవడం.
- ఆకలి లేకపోవడం లేదా ఎక్కువ ఆహారం తినడం.
- ఎక్కువ ఆహారం తినేవారు ఊబకాయానికి గురవడం.
- హార్మోన్ల సమతుల్యత లోపించడంతో మహిళల్లో పిరియడ్స్ ఇబ్బందులు.
- మధుమేహం, రక్తపోటు ఉన్న వారిలో అదుపులో లేక పోవడం.
- తీవ్రమైన వత్తిడి ఉన్న వారిలో హృద్రోగ సమస్యలు.
- వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి.

అధిగమించే మార్గాలు ఇవీ..

- రోజూ ఒకే సమయానికి నిరంతరాయంగా ఏడు గంటలకు తగ్గకుండా నిద్రపోవడం.
- సమతుల ఆహారం తీసుకోవడం.
- రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం.
- యోగా, మెడిటేషన్‌పై దృష్టి సారించడం.
- సెల్‌ఫోన్ చూడటం తగ్గించి, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవడం.
- భావోద్వేగాలు, ప్రవర్తనలపై అదుపు కలిగి ఉండటం.
- అసమానతలు, సమస్యలను ధైర్యంగా పరిష్కరించుకోవడం చేయాలి.

యూత్ ఫెస్టివల్‌లో శ్రుతి సమన్వి ఫస్ట్



భవానీపురం(విజయవాడపశ్చిమ): అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (న్యూఢిల్లీ) సౌజన్యంతో పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల లుధియానాలో నిర్వహించిన 37వ ఇంటర్ యూనివర్సిటీ నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించిన విజయవాడ నగరవాసి కాకర్లపూడి శ్రుతి సమన్వి ప్రథమస్థానంలో నిలిచారు. యూనివర్సిటీ అసోసియేట్ డైరెక్టర్, కో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ విశాల్ బెక్టర్ నుంచి బహుమతి అందుకున్నారు. ఇదే బహుమతిని ప్రముఖ నాట్యాచార్యులు, శ్రుతి సమన్వి గురువు సుధీర్‌రావు 1996లో సాధించగా ఆ తరువాత ఈమె సాధించడం విశేషం. కేఎల్ యూనివర్సిటీలో బీబీఏ మొదటి ఏడాది చదువుతున్న శ్రుతి సమన్వి ఇంతకు ముందు తాను చదువుతున్న యూనివర్సిటీ తరఫున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికై విజేతగా నిలిచారు. పలువురు నృత్య కళాకారులు, నాట్యాచార్యులు ఆమెను అభినందిస్తూ మరిన్ని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

ముగిసిన ఇంటర్ స్పాట్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం ముగిసింది. జిల్లాలో మార్చి 18వ తేదీన స్పాట్‌ను ప్రారంభించారు. సుమారు 17 రోజుల పాటు స్పాట్ కొనసాగింది. జిల్లాలో సుమారుగా 3,47,958 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. సుమారు 850 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ నెల 12వ తేదీన ఇంటర్ ఫలితాలను ప్రకటించడానికి ప్రభుత్వం సమాయత్తమవుతోంది.



విస్తృతంగా.. ఎన్నికల సందర్భంగా గురువారం 'సెంట్రల్'లోని గులాబితోటలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



ఆశీర్వదించండి.. నగరంలోని 47వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్ గురువారం ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు.



ప్రచారజోరు.. 'తూర్పు'లో మూడో డివిజన్‌లోని కొండప్రాంతంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ జోరుగా ప్రచారం చేశారు.

చంద్రబాబు నీచ రాజకీయాల వల్లే ఈ ఘోరం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పామర్రు: చంద్రబాబు నీచ రాజకీయాల వలన అనేక మంది అవ్వాతాతలు అవస్థలు పడుతూ చివరకు మరణించే పరిస్థితి ఏర్పడుతోందని పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ ఆరోపించారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామానికి చెందిన పిల్లి నాగేశ్వరమ్మ(75) పెన్షన్ కోసం దూరం నడవలేక మార్గ మధ్యలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతురాలి పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే గురువారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పెన్షన్లపై బాబు దొంగనాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. గ్రామ సర్పంచ్ గోట్రు విజయభారతి పాల్గొన్నారు.

అవనిగడ్డ జనసేన అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గం జనసేన అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ పేరును ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గురువారం ప్రకటించారు. అవనిగడ్డ నియోజకవర్గం టీడీపీ కన్వీనర్‌గా ఉన్న బుద్ధప్రసాద్ నాలుగు రోజుల క్రితం పిఠాపురంలో ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఆయనకు సీటు ఇవ్వొద్దని జనసేన నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అయినప్పటికీ పవన్ కల్యాణ్ లెక్క చేయకుండా బుద్ధ ప్రసాద్‌కు సీటు కేటాయించడం పట్ల జనసేన నాయకులు మండిపడుతున్నారు. అవనిగడ్డ జనసేన సీటు కోసం ఆ పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ బండి రామకృష్ణ, అవనిగడ్డకు చెందిన విక్కుర్తి శ్రీనివాసరావు, చిలకలపూడి పాపారావు, గుడివాక శేషుబాబు, మాదివాడ వెంకట కృష్ణ (క్రిస్టియన్) పోటీ పడ్డారు. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న వారిని కాదని రాత్రికి రాత్రి పార్టీ మార్చిన వ్యక్తికి టికెట్ ఇవ్వడాన్ని జనసేన నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ద్విచక్రవాహనం



ఘటనాస్థలంలో దాసరి నాగేశ్వరరావు, బేబీసరోజిని దంపతుల మృతదేహాలు

ఘంటసాల(అవనిగడ్డ): బంధువుల ఇంట జరిగే వివాహ వేడుకలో పాల్గొనేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరిన భార్యాభర్తలను రోడ్డుపై ఆగి ఉన్న లారీ బలితీసుకుంది. కృష్ణా జిల్లా, ఘంటసాల మండలం లంకపల్లి పరిధిలోని ఎన్‌హెచ్-216 జాతీయ రహదారిపై గురువారం వేకువ జామున ఈ ప్రమాదం జరిగింది. ఘంటసాల ఎస్‌ఐ కె.ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. చల్లపల్లి మండలం, పచ్చార్లంక గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావు(70), దాసరి బేబి సరోజిని (65) దంపతులు లక్ష్మీపురంలోని బంధువుల ఇంట్లో జరిగే వివాహ వేడుకలో పాల్గొనేందుకు గురువారం వేకువజామున ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఘంటసాల మండలం లంకపల్లి గ్రామం వద్ద 216 నంబర్ జాతీయ రహదారిపై ఆగివున్న లారీని నాగేశ్వరరావు, బేబి సరోజిని ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. ఈ ప్రమాదం వేకువజాము ఐదు, ఐదున్నర గంటల సమయంలో జరిగినట్లు తెలుస్తోంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘంటసాల 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. నాగేశ్వరరావు, బేబి సరోజినిని పరీక్షించి అప్పటికే మృతిచెందారని నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ ఆదేశాలతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నాగేశ్వరరావు కుమారుడి ఫిర్యాదు మేరకు ఘంటసాల ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాగేశ్వరరావు, బేబీ సరోజిని మృతదేహాలను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై శ్రద్ధ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



విద్యార్థినులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై శ్రద్ధ చూపగలుగుతారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. రక్తహీనత నివారణకు అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను పిల్లలకు క్రమం తప్పక ఉపయోగించేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. పటమటలోని కోనేరు బసవ పున్నయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థినులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి, ఎనీమియా శాతాన్ని నమోదు చేసి, రక్తహీనతను నివారించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా 947 కేంద్రాల ద్వారా 5,23,188 పింక్ కలర్ చిన్న మాత్రలు, 9,24,973 బ్లూ కలర్ పెద్ద మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఐరన్ మాత్రలు తీసుకునేలా ఉపాధ్యాయులు నిశితంగా పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన మాత్రల ఫలితంగా విద్యార్థుల్లో రక్తహీనత శాతం క్రమంగా తగ్గిందన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించనున్న నేపథ్యంలో మాత్రల వాడకం నిరంతరంగా జరగాలనే ఉద్దేశంతో ఆరు వారాలకు సరిపడా ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేసి క్రమం తప్పకుండా వినియోగించేలా చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు, డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని, ఆర్బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి మాధవి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కేవీఎల్ఎన్ కుమార్, పాఠశాల హెచ్ఎం ప్రేమసాగర్, డీపీఎంఓ డాక్టర్ నవీన్, యూపీహెచ్‌సీ వైద్యుడు నిహారిక, డాక్టర్ ఉస్మాన్ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవుల సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి మే 2 తేదీ వరకు పలు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్, మెహందీ, డెకరేటివ్ ఆర్టికల్స్, వాషింగ్ మెషిన్ లిక్విడ్ డిటర్జెంట్స్ తయారీ, ఇన్‌స్టెంట్ ఫుడ్ ఐటమ్స్, చాక్లెట్స్ మేకింగ్, నేచురల్ హెయిర్ ఆయిల్ అండ్ షాంపు మేకింగ్ అంశాల్లో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. శిక్షణ కార్యక్రమాలు ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ, 0866-2470420 నంబరులో కానీ సంప్రదించాల్సిందిగా కోరారు.

28న లలితా సహస్రనామ పారాయణం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ కళాశాల గ్రౌండ్‌లో ఈ నెల 28న సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రార్ అక్కెన వేణుగోపాలరావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని నిర్వాహకులతో కలిసి వేణుగోపాలరావు సిద్ధార్థ ఆడిటోరియం ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయహో భారతీయం సంస్థ అధ్యక్షుడు వల్లీశ్వర్ మాట్లాడుతూ ముమ్మినేని సుబ్బారావు సిద్ధార్థ కళా పీఠం, లింక్ ఫీల్డ్స్, శ్రీధర్ సీసీఈ సంస్థలతో కలిసి తమ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

వేదాద్రి వద్ద కృష్ణానది పరిశీలన



జగ్గయ్యపేట: వేదాద్రి గ్రామంలోని కృష్ణానదిని ఇరిగేషన్ డీఈ వెంకటనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కృష్ణానదిని పరిశీలించామన్నారు. తాగు నీటి అవసరాల నిమిత్తం సమీపంలోని పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు గత మూడు రోజులుగా పులిచింతల ప్రాజెక్టు అధికారులు దిగువకు నీటిని విడుదల చేశారని తెలిపారు. ఈ నీరు కృష్ణానది నుంచి బ్యారేజీ వరకు సక్రమంగా వెళ్తోందీ లేనిది పరిశీలించామన్నారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి అధికారులు ఈ నెల ఒకటి నుంచి ప్రతిరోజూ ఐదు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

తూర్పులో 'కూటమి'కి షాక్



యడవల్లి సతీష్‌తో పాటు కృష్ణలంక ప్రాంతానికి చెందిన 50 కుటుంబాల వారిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న దేవినేని అవినాష్

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కీలకనేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పులో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి ఎదురుగాలి వీస్తోంది. కృష్ణలంక ప్రాంతానికి చెందిన జనసేన జిల్లా ప్రచార కమిటీ, ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ యడవల్లి సతీష్ వైఎస్సార్ సీపీలో చేరడంతో కూటమికి కోలుకోలేని షాక్ తగిలింది. ఇప్పటికే పలువురు టీఎన్‌టీయూసీ, టీడీపీ, కమ్యూనిస్టు పార్టీల నుంచి నేతలు వైఎస్సార్ సీపీలో చేరగా, తాజాగా జనసేన కీలకనేత రాకతో వైఎస్సార్ సీపీ మరింత బలం పుంజుకోవడంతో పాటు, కూటమికి గట్టి దెబ్బ తగిలింది. కాగా గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో గురువారం యడవల్లి సతీష్‌తో పాటు, మరో 50 కుటుంబాలకు చెందిన వారికి దేవినేని అవినాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పట్ల ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు వైఎస్సార్ సీపీలో చేరి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలుస్తున్నారన్నారు. కొత్త, పాత నాయకుల కలయికతో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేస్తామన్నారు. కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, ఆ డివిజన్ పార్టీ అధ్యక్షుడు టీపీ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, శివ, వెంకటేష్, శాంతకుమార్ పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో సజావుగా ఎన్నికలు

తిరువూరులో అంతర్ రాష్ట్ర అధికారుల సమావేశం



ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల ఉన్నతాధికారుల సమన్వయ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు, ఎస్పీలు

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల్లో అంతర్ రాష్ట్ర అధికారుల సహకారంతో మద్యం, డబ్బు, ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణా అరికట్టాలని గురువారం తిరువూరులో జరిగిన ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయించారు. స్థానిక శ్రీరస్తు కల్యాణ మండపంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన జరిగిన రెండు జిల్లాల ఉన్నతాధికారుల సమన్వయ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు జిల్లాల అధికారుల సమన్వయ సమావేశం సత్తుపల్లిలో నిర్వహించామని, ఆ ఎన్నికల్లో ఏపీ నుంచి అక్రమంగా మద్యం, డబ్బు రవాణా జరగకుండా అధికారులు సహకరించారని ఖమ్మం కలెక్టర్ గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. సరిహద్దు గ్రామాల్లోని పాత గోదాములు, రైస్‌మిల్లులు, ఇతర పాడుబడిన భవనాల్లో అక్రమ మద్యం, డబ్బు, ఇతర వస్తువులు నిల్వ చేసే అవకాశం ఉన్నందున విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు గౌతమ్‌కుమార్, ఢిల్లీరావు అధికారులను కోరారు. సరిహద్దు చెక్‌పోస్టులలో వచ్చే పోయే వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని, అనుమతులు లేకుండా తరలించే డబ్బు, ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకోవాలన్నారు. బ్యాంకుల్లో అనుమతికి మించి నగదు ఉపసంహరించే వారిపై కూడా బ్యాంకర్లు నిఘా ఉంచాలని, నిర్దిష్ట కారణం లేకుండా అధిక మొత్తంలో నగదు ఇవ్వరాదని కలెక్టర్లు బ్యాంకుల ఉన్నతాధికారులకు సూచించారు.

కచ్చితంగా నియమావళి అమలు..

ఎన్నికల నియమావళి అమలుకు నియమితులైన అధికారులు సైతం అభ్యర్థుల ప్రచార సరళి, నియమావళి ఉల్లంఘనలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. ఎన్‌డీపీ మద్యం తరలింపును కూడా అడ్డుకోవాలని, గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో మద్యం అమ్మకాలు జరగకుండా నిరోధించాలని ఎస్ఈబీ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఖమ్మం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సునీల్ దత్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా, ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదననాయక్, అసిస్టెంట్ కలెక్టర్లు యువరాజ్, మాయాన్షి, ట్రైనీ ఐపీఎస్ అధికారి మౌనిక, తిరువూరు ఆర్డీవో మాధవి, ఏసీపీ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య

కంకిపాడు: ఉరివేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. కంకిపాడు పట్టణంలోని మండల ఆఫీసు రోడ్డులో బచ్చు శ్రీనివాసరావు కుటుంబం నివాసం ఉంటోంది. శ్రీనివాసరావు సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. అతని కుమార్తె బచ్చు నీలిమ సాయి (22) బీటెక్ విద్యనభ్యసించింది. కొన్ని సబ్జెక్టులు మిగిలిపోవటంతో గతేడాది నుంచి ఇంటి వద్దే ఉంటోంది. బాగా చదివి ఉంటే ఉద్యోగం కూడా వచ్చేదంటూ మదనపడుతూ ఉండేది. ఈ క్రమంలో మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి శ్రీనివాసరావు ఇంటికి వచ్చే సరికి తలుపులు వేసి ఎంతకూ తీయకపోవటంతో స్థానికుల సహకారంతో తలుపులు పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించగానే కుమార్తె నీలిమసాయి ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. హుటాహుటిన వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి వర్గాల సమాచారం, మృతురాలి తండ్రి ఫిర్యాదుతో బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



సీఐ హబీబ్ బాషాను కలిసి రక్షణ కోరుతున్న ప్రేమజంట

ఉయ్యూరు: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట రక్షణ కోరుతూ ఉయ్యూరు పోలీసులను ఆశ్రయించింది. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యూరు ఎస్సీ కాలనీకి చెందిన గూడవల్లి శ్రీనివాసు, మండలంలోని కలవపాముల గ్రామానికి చెందిన నాగదివ్య ప్రేమించుకున్నారు. వీరి ప్రేమ వివాహాన్ని పెద్దలు అంగీకరించలేదు. దీంతో శ్రీనివాస్, నాగదివ్య వివాహం చేసుకుని ఉయ్యూరు పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని సీఐ హబీబ్ బాషా, ఎస్ఐ గణేష్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రేమ జంటకు, ఇరు కుటుంబాలకు సీఐ హబీబ్ బాషా కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఆధారాల్లేని రూ.10.52 లక్షలు సీజ్

పెదన: పట్టణంలోని తోటమూల సెంటర్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీలలో ఇరువురు వ్యక్తులు వద్ద రూ.4.68లక్షలు నగదును సీజ్ చేసినట్లు పెడన పోలీసులు గురువారం తెలిపారు. వారి తెలిపిన వివరాల మేరకు బంటుమిల్లి మండలం నాగేశ్వరరావుపేటకు చెందిన ఎం. జగదీష్‌కుమార్ వద్ద రూ.3,88,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. మినుము అమ్మిన డబ్బులు తీసువెళ్తున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు. పెడన ఉరివి గ్రామానికి చెందిన వాసన నాగరాజు రూ.80వేలు తీసుకువెళ్తుండగా పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి బిల్లులు చూపించకపోవడంతో ఇరువురి నుంచి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మరో రూ. 5.84 లక్షలు..

ఉయ్యూరు: సరైన ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలు లేకుండా నగదు, విలువైన వస్తువులతో ప్రయాణం చేయటం ఎన్నికల నియమావళికి విరుద్ధమని ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని కాటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన పోలీసు ఔట్‌పోస్టు వద్ద గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఐదుగురు వ్యక్తులు వద్ద ఉన్న రూ. 5.84 లక్షలను సీజ్ చేశారు. స్థానిక విలేకరులతో సీఐ హబీబ్ బాషా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. తనిఖీల్లో ఎస్ఐ గణేష్‌కుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని బెల్టుషాపుపై దాడి చేసి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు.

హరిత విప్లవానికి ఆద్యుడు జగ్జీవన్‌రామ్

కృష్ణా వర్సిటీ వీసీ జ్ఞానమణి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీ జ్ఞానమణి

కోనేరుసెంటర్: దేశంలో హరిత విప్లవానికి నాంది పలికిన వ్యక్తి, మంచి పాలనాదక్షుడు బాబు జగ్జీవన్ రామ్ అని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి కొనియాడారు. బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని ఎస్సీ, ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ దాదాపు ఐదు దశాబ్దాల పాటు దేశ పాలన రంగంలో జగ్జీవన్‌రామ్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. కాంగ్రెస్, జనతా ప్రభుత్వాలలో కీలకమైన శాఖలకు మంత్రిగా పనిచేసిన అనుభవశాలి జగ్జీవన్ రామ్ అన్నారు. రెక్టర్ ఆచార్య డి. సూర్యచంద్రరావు మాట్లాడుతూ 117 సంవత్సరాల తర్వాత కూడా ఆయన జయంతి వేడుకలు జరుపుకోవడం ఆయన ఘనతను తెలియజేస్తోందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె. శోభన్ బాబు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఎస్సీ, ఎస్టీ విభాగం సమన్వయకర్త శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల హెచ్‌ఓడి ఆచార్య మారుతి, విభాగాధిపతులు, సహాయ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

6న కృష్ణా వర్సిటీలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: రక్తదానం చేసి ప్రాణాలు నిలపాలని ఐక్యం ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. ఐక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ శనివారం కృష్ణా యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన సందర్భంగా గురువారం దీనికి సంబంధించిన కరపత్రాలను నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రక్తదానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని వారు కోరారు. రక్తదానం చేసే ఎంతో మందికి ప్రాణదానం చేయటమే కాకుండా రక్తదానం చేసిన వారి ఆరోగ్యం మరింత పెరుగుతుందని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9121797972లో సంప్రదించాలన్నారు. సంస్థ అధ్యక్షుడు కె. కిరణ్, ఉపాధ్యక్షుడు ఆకూరి శ్వేత, సభ్యులు పాల్గొన్నారు.

రంజింపజేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృతప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం సాయంత్రం పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను రంజింపజేసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన భారతీ రాఘవ నృత్య కేంద్రానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందజేశారు.

క్లుప్తంగా

ఆటోలో మరచిపోయిన బ్యాగ్ అప్పగింత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రయాణికురాలు ఆటోలో మరచిపోయిన దుస్తుల బ్యాగ్‌ను అప్పగించిన ఘటన గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం... సయ్యద్ ఇర్షద్ బందర్ రోడ్ లోని శుభమస్తు షాపింగ్ మాల్‌లో పని పూర్తి చేసుకుని ఆటో ఎక్కింది. చల్లపల్లి బంగ్లా వద్ద ఆటో దిగి వెళ్లి పోయింది. ఆటోలో షాపింగ్ చేసిన బట్టల బ్యాగ్ మరిచిపోయి వెళ్లిపోయింది. తర్వాత బ్యాగ్ మరచిపోయిన విషయాన్ని గుర్తించి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తక్షణమే స్పందించిన సీఐ వెంకటరమణ, ఎస్సై నారాయణమ్మ ఆటోను గుర్తించారు. ఆటోలో ఉన్న బ్యాగ్‌ను గుర్తించి మహిళకు అందజేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పది మంది ఎంపిక



లబ్బీపేట(విజయవాడతూర్పు):శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం గ్రోవెల్ ఫీడ్స్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఆక్వాకల్చర్ టెక్నాలజీ విద్యార్థులు పది మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. గ్రోవెల్ ఫీడ్స్ సంస్థకు చెందిన శ్రీకీర్త్, టెక్నికల్ కో ఆర్డినేటర్స్ రాజేంద్రప్రసాద్, జ్ఞానశ్రీలు పాల్గొని విద్యార్థినులను ఇంటర్వ్యూలు చేసినట్లు తెలిపారు. ఆ ఇంటర్వ్యూల్లో పది మందిని ఎంపిక చేశారు. కాగా ఎంపికైన వారిని కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ కల్పనలు అభినందించారు. కాగా అక్వాకల్చర్ రంగంలో ఉపాధి అవకాశాలు, ఆక్వా కల్చర్ ప్రాముఖ్యలను గ్రోవెల్ ఫీడ్స్ సంస్థ ప్రతినిధులు వివరించారు.

పింఛన్ల పంపిణీపై క్షుద్ర రాజకీయాలు చేయవద్దు



భవానీపురం(విజయవాడపశ్చిమ):అవ్వాతాతలు, దివ్యాంగులు, కిడ్నీ, థలసేమియా పేషెంట్లకు అందించే సామాజిక పింఛన్ల పంపిణీపై క్షుద్ర రాజకీయాలు చేయవద్దని చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన విద్యాధరపురంలో మీడియాతో మాట్లాడుతూ కూటమికి పేదలపై కక్ష ఉందన్న సంగతి అందరికి తెలిసిందేనన్నారు. అయితే అది ఇప్పుడు పరాకాష్టకు చేరుకుందని తెలిపారు. టీడీపీ ఏజెంట్ నిమ్మగడ్డ రమేష్ చౌదరి ద్వారా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్లతో సజావుగా సాగుతున్న పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. పింఛన్‌దారులు సచివాలయాలకు వెళ్లలేక పడుతున్న కష్టాలు మీకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విజయం ఖాయమని తెలిసి ఆ కక్ష వలంటీర్లపై చూపించారని మండిపడ్డారు. సీఎం జగనన్న ఒక్కడిని ఓడించేందుకు మూడు పార్టీల జెండాలు జత కట్టాయంటే ఆయనకు ఉన్న ప్రజాబలం ప్రజలకు అర్థమై పోతుందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున జనబలం ఉన్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి వంటి వ్యక్తి దేశంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. మండుటెండల్లో పండుటాకులు పడుతున్న అవస్థలు చూస్తుంటే ఎవరికైనా మనసు చలించిపోతుందన్నారు. కానీ స్వార్థ రాజకీయ ప్రయోజనాలు తప్ప కూటమి నాయకులకు మానవత్వం అనేది లేదని పింఛన్ల పంపిణీ ఆపు చేసినప్పుడే రుజువు అయిందన్నారు.

ఉపాధి కోర్సులకు ప్రాధాన్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యాన డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు మహీంద్రా ఆటోమోటివ్, పీపుల్స్ మ్యాక్ సొసైటీ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో నలుగురు విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 40 మంది హాజరు కాగా పది మంది తదుపరి రౌండ్‌కు అర్హత సాధించారు. ఎంపికయిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి చేతులమీదుగా నియామక పత్రాలు అదజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఉపాధి ఆధారిత కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. జవహర్ నాలెడ్జిసెంటర్ కో ఆర్డినేటర్ జి. విజయదీప్, సీహెచ్ అప్పారావు, జి.దివ్య, డి.సురేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాపం మూటగట్టుకున్నాడు

గుణదల/కృష్ణలంక/ఆటోనగర్(విజయవాడ తూర్పు): వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సకాలంలో పింఛన్లు అందకుండా చంద్రబాబు పాపం మూట గట్టుకున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని లూర్దునగర్ కొండ ప్రాంతంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పేదలపై మరో మారు అక్కసు తీర్చుకున్నారని విమర్శించారు. గత ఐదేళ్లుగా వలంటీర్ల ద్వారా అర్హులైన పేదలకు పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. ఒకటో తారీఖున ఉదయాన్నే వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు చేతికందేవని తెలిపారు. దీనిని ఓర్చుకోలేక చంద్రబాబు వలంటీర్ వ్యవస్థను తప్పుదారి పట్టించారని పేర్కొన్నారు. ఫలితంగా పేదలకు సకాలంలో పింఛన్లు అందక నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. మండుటెండలో ఇబ్బందులు పడుతూ వృద్ధులు, వికలాంగులు పింఛన్ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. పేదలు ఇన్ని అవస్థలు పడటానికి కారణం టీడీపీ నాయకులేనని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన గత ఐదేళ్ల కాలంలో తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మెండుగా జరిగాయని తెలిపారు. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడం ద్వారా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కాలిబాటలు, మెట్ల మార్గాలు, తాగునీటి వసతులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సైతం ఏర్పాటు చేశారన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు వసతులు కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని స్పష్టం చేశారు. కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్, లోకేష్, విఠల్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్



రామలింగేశ్వరనగర్ సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

వృద్ధులపైనా మీ ప్రతాపం



నా వయస్సు 85 సంవత్సరాలు. గత ఐదేళ్లుగా ప్రతి నెల ఒకటో తేదీన వలంటీర్ ద్వారా మా ఇంటి వద్దనే పింఛన్ తీసుకుంటున్నా. టీడీపీ నాయకులు ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని నిలిపివేసింది. మా లాంటి వృద్ధులు దూరంగా ఉన్న సచివాలయానికి మండుటెండలో ఎలా వెళ్లగలం? సచివాలయంకు ఒంటరిగా వెళ్లలేను. ఇప్పుడు ఇంట్లో కుటుంబ సభ్యుల సహాయంతో సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వస్తుంది. వృద్ధులను ఇబ్బందులకు గురిచేయడం మీకు సంతోషంగా ఉందా. ఇలాంటి చర్యలు మానుకోండి.

–కింతలి సత్యవతి, నెహ్రూనగర్ డొంక రోడ్డు, కృష్ణలంక

దుర్మార్గపు చర్య



నా వయస్సు 74 సంవత్సరాలు. ముఖ్యమంత్రి జగన్ దయవల్ల ఐదేళ్లుగా వలంటీర్ ద్వారా ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటి వద్దనే ఉదయాన్నే పింఛన్ తీసుకుంటున్నా. చంద్రబాబు నిమ్మగడ్డ చేత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్ల చేత పింఛన్ పంపిణీని నిలిపివేయించడం దుర్మార్గపు చర్య. చేసిందంతా చేసి ఖజానాలో డబ్బులు లేవంటూ మళ్లీ చంద్రబాబు రివర్స్ డ్రామా ఆడుతున్నారు. వృద్ధుల శాపం చంద్రబాబుకు కచ్చితంగా తగులుతుంది.

–చిన్నపరెడ్డి వెంకటరెడ్డి, తారకరామనగర్, రాణిగారితోట

నరకయాతన అనుభవిస్తున్నాం



గతంలో ఇంటి తలుపు తట్టి పింఛన్ ఇచ్చారు. ఈ నెలలో ఇప్పటికీ ఫింఛన్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎండకు సచివాలయానికి రావాలంటే ఇబ్బందికరంగా ఉంది. నడవలేక సస్తున్నాం. ఇదంతా చంద్రబాబు పుణ్యమంటూ నరకయాతన అనుభవిస్తున్నాం. మేమే వీరికి దొరికామా. వీరిని దేవుడు చూసుకుంటాడు. నెలవారీ ఇంటి అద్దె రూ.2,500 చెల్లించాలి. ఒకటవ తేదీకి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికి పింఛన్ రాకపోవడంతో ఇంటిని ఖాళీ చేయాలి అని యజమాని అంటున్నారు.

–అప్పాయమ్మ, శివగంగా భ్రమరాంబవీధి

తిప్పలు తప్పలేదు



గత 40 సంవత్సరాల నుంచి రామలింగేశ్వరనగర్‌లో ఉన్నాను. రెండేళ్ల క్రితం పులిపాక వెళ్లాం. మూడు రోజుల నుంచి పింఛన్ తీసుకునేందుకు గాను పులిపాక నుంచి రామలింగేశ్వరనగర్‌కు ఆటోలో వస్తున్నా. వచ్చిన ప్రతి సారి రూ.150 ఖర్చు అవుతుంది. గత అయిదేళ్ల పాటు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చారు. చంద్రబాబు నిర్వాకంతో మాకు తిప్పలు తప్పలేదు. రోజువారీ ఖర్చుల నిమిత్తం డబ్బులు లేకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నాం.

– చంద్రారెడ్డి

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



హనుమాన్‌పేటలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకట రమణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని గవర్నర్‌పేట సీఐ డీవీ వెంకటరమణ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు ఈస్ట్ జోన్ డీసీపీ అ. దీరాజ్ రాజ్ సింగ్ పర్యవేక్షణలో సౌత్ జోన్ ఏసీపీ రత్న రాజు ఆధ్వర్యంలో గురువారం గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని హనుమాన్‌పేటలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు పాటించాల్సిన విధి విధానాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులు అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయని ప్రజలకు భరోసా కల్పించారు. ఎన్నికల నియమ నిబంధనలను రాజకీయ పార్టీలు తప్పక పాటించాలని సూచించారు. ఓటర్లను ఆటంక పరచడం, ఫలానా పార్టీకి ఓటు వేయాలని ప్రలోభ పెట్టడం, బెదిరించడం వంటి వాటికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతికి భంగం కలిగించడం, దొంగ ఓట్లు వేయడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

కుట్ర రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు

విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్



కార్యాలయం ప్రారంభిస్తున్న కేశినేని శ్రీనివాస్, దేవినేని అవినాష్, ఇతర నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కుట్ర రాజకీయాలకు, నీచమైన పనులకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (నాని) ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు, సామాన్యులకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇస్తుంటే, వారిని చంద్రబాబు హేళనగా మాట్లాడటం పేదలంటే ఆయన భావన తెలియచేస్తుందన్నారు. క్రీస్తురాజపురంలోని పెద్దబావి సెంటర్‌లో ఏర్పాటు చేసిన తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ప్రాంతీయ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌తో కలిసి కేశినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫింఛన్‌దారులను ఇబ్బంది పెట్టిన దుర్మార్గుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. శవరాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత సొంత రాష్ట్రం తెలంగాణకి పారిపోతాడని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కేడర్ అంతా విజయోత్సాహంలో ఉందని, అవినాష్ విజయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంతో ఎన్నో కుటుంబాలు మానసిక భద్రత పొందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఒప్పించి వేగవంతంగా రిటైనింగ్ వాల్‌ను అవినాష్ పూర్తి చేయించాడన్నారు. అంతేకాకుండా రూ.650 కోట్లుతో అభివృద్ధి పనులు చేసిన ఘనత అవినాష్ సొంతమన్నారు.

తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం

రానున్న ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దామని దేవినేని అవినాష్ పిలుపునిచ్చారు. పలు డివిజన్లకు సంబంధించి జోనల్ కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భారీ మెజార్టీతో సీట్లు గెవలబోతున్నామని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధితో ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య (వర), కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మలకుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, కలపాల అంబేడ్కర్, మెరకనపల్లి మాధురి, ఆ క్లస్టర్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



4వ డివిజన్ సుబ్బారావు కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని సుధీర



10వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న క్రాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయడంతో పాటు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ కృషి చేస్తున్నారని ఆయన సతీమణి దేవినేని సుధీర అన్నారు. ఆమె గురువారం 4వ డివిజన్ సుబ్బారావు కాలనీ, 8వ డివిజన్ రెవిన్యూ కాలనీ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి ఎవరు చేశారో గుర్తించి ఓట్లు వేయాలన్నారు. అంతేకాకుండా కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించినట్లు పేర్కొన్నారు. మంచి మనస్సుతో మంచి పనులు చేసిన వారిని ఆదరించాలని ఆమె కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్‌లకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు.

దేవినేని క్రాంతి విస్తృత ప్రచారం....

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం 10వ డివిజన్‌లో ఆర్టీసీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ పర్యటించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్, దేవినేని అవినాష్‌లను గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో మంచి పనులు చేసిన వారి ఆదరించాలన్నారు. వారి వెంట 4వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు గల్లా రవి, కో ఆప్షన్ సభ్యుడు ముసునూరు సుబ్బారావు, 10వ డివిజన్ ఇన్‌చార్జి హరీష్ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి



స్థానికులతో మాట్లాడుతున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

ఆటోనగర్(విజయవాడతూర్పు): సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. రామలింగేశ్వరనగర్‌లోని ఆళ్ల చెల్లారావురోడ్డు, ఎస్ఆర్‌కెఎం రోడ్డు, అయ్యప్పస్వామి రోడ్డుతోపాటు రఘురోడ్డులో విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ తరపున గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిని ఆమె వివరించారు. ఈ సందర్భంగా బెల్లం దుర్గ మాట్లాడుతూ 15వ డివిజన్‌లో సుమారు 95 శాతానికి పైగా సంక్షేమం, అభివృద్ధి చేసినట్టు చెప్పారు. మరలా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కరకట్ట ప్రజలకు తాగునీటి సౌకర్యం కోసం పైపులైన్ కనెక్షన్ ఇచ్చినట్టు చెప్పారు. మాదాసు భాను, నూకల సత్యన్నారాయణ, చంటి, దశరథ రామయ్య, అక్కిరయ్య, శ్రీను, నారాయణలు పాల్గొన్నారు.

9న ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):శ్రీ క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన వేడుకలను నిర్వహించనున్నట్లు ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిశెట్టి వెంకటేశ్వరరావు, సందక కృష్ణ తెలిపారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని అసోసియేషన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉగాది వేడుకల వివరాలను వెల్లడించారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఆవంచ వేణుగోపాల రాధాకృష్ణమూర్తి పంచాంగ పఠనం చేస్తారని చెప్పారు. అనంతరం నిర్వహించే సభా కార్యక్రమంలో విశ్రాంత ఉన్నతాధికారులు సాలి ఆంజనేయులు (ఏపీ జెన్‌కో–డైరెక్టర్), అబ్బిలి ఆంజనేయులు (ఎంపీడీఓ – పంచాయతీరాజ్), తెలగరెడ్డి సత్యానంద్ (జాయింట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్) అతిథులుగా పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో భాగంగా సూరిశెట్టి రామయ్య – మహాలక్ష్మి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారమ్స్ పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని చెప్పారు. అనంతరం విశ్రాంత సంస్కృత అధ్యాపకులు పమిడిపాటి పట్టాభి రామారావు కవితలు వినిపిస్తారని పేర్కొన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు దేవరకొండ శేషగిరిరావు, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాది వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను విడుదల చేశారు.

సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలి



కరపత్ర ఆవిష్కరణలో నారాయణరావు, వెంకటేశ్వ రెడ్డి, ఆంజనేయరాజు, డాక్టర్ సాంబశివరావు

విజయవాడ కల్చరల్: పోలవరపు కోటేశ్వరరావు ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, జనవిజ్ఞాన వేదిక, తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఊరూరా జనవిజ్ఞానం, ప్రజాస్వామ్య పరిరక్షణ చర్చాపత్రం ఆవిష్కరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ విజయవంతం కావాలంటే ప్రజలు సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జనవిజ్ఞాన వేదిక బాధ్యుడు కోట వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలపట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూఢనమ్మకాలు ప్రగతి నిరోధకాలుగా అభివర్ణించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు సామాజిక శాస్త్రం, రాజనీతి శాస్త్రంపై అవగాహన పెంచుకోవడానికి విస్తృతంగా పర్యటించాలని సూచించారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ వెన్నావల్లభరావు, సాంస్కృతిక, కళా సంస్థల ఐక్యవేదిక అధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు, డీవీ రంగారెడ్డి ప్రసంగించారు. డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, ప్రిన్స్, దుర్గా నాగమణి, ఝాన్సీ తదితరులు దేశ భక్తి గీతాలను ఆలపించారు.

'మణిపాల్'లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలు ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణం మహానాడులో ఉన్న మణిపాల్ హాస్పిటల్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో బుధవారం డాక్టర్ కంటిపూడి సుధాకర్ విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, వయోవృద్ధుల్లో న్యూమోకాకల్, ఇన్‌ఫ్లూయెంజ వంటి శ్వాసకోస ఇన్ఫెక్షన్ల నివారణకు ముందస్తుగా టీకాలు వేయడం, వారి క్రమబద్ధమైన ఆరోగ్య పరిరక్షణకు ఈ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మణిపాల్ హాస్పిటల్ విజయవాడ ఫైజర్‌తో భాగస్వామ్య కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. హాస్పిటల్‌లో వయోవృద్ధులకు వ్యాక్సినేషన్ కోసం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రోగి ఆరోగ్య సంరక్షణ, టీకాలపై అవగాహన, నివారించగల వ్యాధుల కోసం హాస్పిటల్‌లో సమగ్ర ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ డాక్టర్ లోకేష్ గుత్తాతో జరిగిన ప్యానెల్ చర్చలో నిపుణుల సూచనలతో పాటు, చర్చకు నాయకత్వం వహించిన ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ మనోజ్‌కుమార్, సీనియర్ డాక్టర్లతో సైంటిఫిక్ సమ్మిట్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ ఎన్. మురళీకృష్ణ, మెడికల్ ఆంకాలజీలో డాక్టర్ కృష్ణారెడ్డి, నెఫ్రాలజీ డాక్టర్ వీఎస్ఎస్ఎన్ శ్రీధర్, జనరల్ మెడిసిన్ డాక్టర్ యు.హారిక సమష్టి దృష్టిసారించారన్నారు. రిస్క్ గ్రూపులకు ప్రాధాన్యం ఇవ్వడంపై చర్చించామన్నారు.

6న పతంజలి శాస్త్రి అభినందన సభ

విజయవాడ కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత తల్లావఝుల పతంజలి శాస్త్రి అభినందన సభను 6 వ తేదీ సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కవి రచయిత బండ్ల మాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో సాహితీవేత్తలు రమణమూర్తి, బాలాంత్రపు ప్రసూనా, పాపినేని శివశంకర్, చినుకుమాస పత్రిక సంపాదకుడు నండూరి రాజగోపాల్ పాల్గొంటారని పేర్కొన్నారు.

కూలింగ్ ఫ్రీజర్ వితరణ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎండలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు జాగ్రత్తగా ఉండాలని కళ్ళే లలితా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. 59వ డివిజన్ శానిటరీ కార్యాలయానికి ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీటి కూలింగ్ ఫ్రీజర్‌ను గురువారం అందించారు. వేసవి తాపం వల్ల ఎండకు రాకపోకలు సాగించే వారు నీటి ఎద్దడికి గురవుతుంటారని తెలిపారు. సాధ్యమైనంత వరకూ ప్రజలు ఎండ వేళల్లో బయటకు రాకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. పలు విభాగాల్లో పనిచేసే కార్మికులు, రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎప్పుడు మంచినీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూలింగ్ ఫ్రీజర్‌ను అందించినట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.రామకృష్ణ, ముప్పూరి హరీష్, సైకం సాయిబాబా, బలుసుపాటి మహేష్, చల్లగాలి అనిల్, రమేష్ పాల్గొన్నారు.

పానీపూరి వ్యాపారిపై యువకుడి దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):పానీపూరి వ్యాపారిపై ఓ యువకుడు దాడిచేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన బాలకుమార్ అనే వ్యక్తి పానీపూరి వ్యాపారం చేస్తుంటాడు. వాంబేకాలనీకి చెందిన వర్ధన్ అనే యువకుడు పానీపూరి కోసం ప్రతిరోజూ ఆ బండి దగ్గరకు వస్తుంటాడు. బుధవారం రాత్రి కూడా పానీపూరి కోసం రాగా పానీపూరి అయిపోయిందని బాలకుమార్ బదులిచ్చాడు. సరే ఒక ప్లాస్టిక్ కవర్ ఇవ్వమని అడగ్గా కవర్ ఇచ్చి ముందుకు వెళ్తుండగా వర్ధన్ ఒక్కసారిగా బాలకుమార్‌ను అడ్డుకొని నాకే పానీపూరి లేదని చెబుతావా అంటూ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాలకుమార్ మొహం మీద గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
ఫ్యాషన్
విజయవాడ
శుక్రవారం ॥ 5-4-2024



తెలుగింటి వెలుగులు

ఏ సంప్రదాయ వేడుకైనా అమ్మాయిలను ముందుగా ఆకట్టుకునేది లంగాఓణీ, గాగ్రాచోలీలు. తెలుగు సంవత్సరాది సందర్భంగా ఎంచుకోదగిన హాఫ్‌శారీ కలర్ కాంబినేషన్స్, తక్కువ ఖర్చుతో డిజైన్ చేసుకోవడం ఎలా .. అనే విషయాలపై అవగాహన ఎప్పుడూ అవసరం ఉంటూనే ఉంటుంది.

పండగల సమయంలో ముదురు, కాంతిమంతమైన రంగులున్నవి ఎంచుకుంటే కళగా కనిపిస్తుంది. పెళ్లిళ్లకు కూడా పై విధం గానే ఎంచుకోవాలి. పుట్టినరోజులు, రిసెప్షన్ వంటి వెస్ట్రన్ టచ్ ఉన్న వేడుకలకు పేస్టల్ షేడ్స్ రిచ్‌గా ఉంటాయి.

డార్క్ కలర్స్ లెహంగా చోలీలు ధరించినప్పుడు గోల్డ్, టెంపుల్ జ్యూయలరీ బాగుంటుంది. పేస్టల్ కలర్స్‌కి డైమండ్స్, కుందన్, ముత్యాలను కూర్చిన ఆభరణాల అలంకరణ అందంగా ఉంటుంది.

హాఫ్ శారీస్ ఫ్యాబ్రిక్, ఎంబ్రాయిడరీ వర్క్‌ను బట్టి ఖర్చు పెరుగుతుంటుంది. గ్రాండ్ లుక్‌తోనూ కావాలనుకుంటే ఫ్యాబ్రిక్ ఎంపిక సరైనదిగా ఉండాలి. పెద్ద పెద్ద జరీ బార్డర్స్ ఉన్న మెటీరియల్‌ను ఎంచుకుంటే బాగుంటుంది. మగ్గం వర్క్స్ డిజైన్స్ బట్టి ఖర్చు పెరుగుతుంటుంది.

పిల్లలు కూడా పండగలు, వివాహ వేడుకలలో ముదురు, కాంతిమంతమైన రంగులను ఇష్టపడుతున్నారు. పిల్లల డ్రెస్ డిజైన్స్‌లో కలర్స్, ఆభరణాల విషయంలో సింపుల్‌గా ఉంటేనే బాగుంటుంది.

సంయుక్తారెడ్డి,
ఫ్యాషన్ డిజైనర్,
హైదరాబాద్

న్యూస్‌మేకర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిహార్ నుంచి 25 ఏళ్ల శాంభవి చౌదరి ఎన్నికల్లో పోటీ చేయనుంది. దేశంలో అతి చిన్నవయసు మహిళా దళిత అభ్యర్థిగా శాంభవి వార్తల్లో నిలిచింది. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినా తాను వేయదగ్గ ముద్ర... తనదైన దృష్టికోణం ఉన్నాయంటున్నది శాంభవి.

అతి చిన్న వయసు దళిత అభ్యర్థి

‘నేను పనిచేసే చోట స్త్రీలు, యువతే నా లక్ష్యం. వీరికి ఆర్థిక స్వావలంబన, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుంది’ అంటోంది శాంభవి చౌదరి. 25 ఏళ్ల 9 నెలల వయసు వున్న ఈ డాక్టరేట్ స్టూడెంట్ బిహార్‌లోని ‘సమస్తిపూర్’ పార్లమెంట్ స్థానం నుంచి లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) తరఫున పోటీ చేయనుంది. ఇది రిజర్వ్‌డ్ స్థానం. బహుశా శాంభవి దేశంలోనే అత్యంత చిన్న వయసు కలిగిన దళిత మహిళా అభ్యర్థి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో. అందుకే అందరూ ఆమెవైపు ఆసక్తిగా చూస్తున్నారు.

రాజకీయ కుటుంబం నుంచి

ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎం.ఏ. సోషియాలజీ చేసి ఇప్పుడు ‘బిహార్ రాజకీయాల్లో కులం, జెండర్ ప్రాధాన్యత’ అనే అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్న శాంభవి రాజకీయ కుటుంబం నుంచి వచ్చింది. ఈమె తండ్రి అశోక్ కుమార్ చౌదరి జెడి (యు)లో మంత్రి. తాత మహదేవ్ చౌదరి కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పని చేశారు. శాంభవి భర్త సాయన్ కునాల్ సామాజిక రంగంలో ఉన్నాడు. ఈమె మామగారు మాజీ ఐ.పి.ఎస్ అధికారి ఆచార్య కిశోర్ కునాల్ దళితుల కోసం చాలా పోరాటాలే చేశాడు. చాలా గుడులలో దళిత పురోహితులను ఆయన నియమించాడు. వీరందరి మధ్యలో చదువు మీద దృష్టి పెట్టి, పరిశోధన కొనసాగిస్తున్న శాంభవి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో దిగింది.



నాకంటూ వ్యక్తిత్వం ఉంది

శాంభవి పోటీ చేస్తున్న లోక్ జనశక్తి పార్టీ ఎన్‌డిఏ కూటమిలో ఉంది. బిజెపి కుటుంబ వారసత్వం గురించి అభ్యంతరం చెప్పడం తెలిసిందే. ‘మీ నాన్నగారు మంత్రి. మరి మీకు సీటిచ్చారు’ అనే ప్రశ్నకు ‘నిజమే. కాని నాకు సీటు రావడంలో ఆయన ప్రమేయం మాత్రం లేదు. చిన్నప్పటి నుంచి నేను మా తాత, నాన్న పేదవాళ్ల సమస్యలు వింటూ వారి కోసం పనిచేయడం చూస్తూ పెరిగాను. అది నామీద ఎక్కడో ప్రభావం చూపింది. దళితుల్లో పుట్టి పెరిగిన వ్యక్తిగా, చదువుకున్న మహిళగా దళితుల పట్ల నాకు అవగాహన ఉంది. రాజకీయ కుటుంబం నుంచి రావడం వల్ల ప్రజలను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసు. ఎలక్షన్లు సమీపించేవరకూ నేను నిలబడాలని అనుకోలేదు. కాని సమీపించాక లోక్ జనశక్తి చీఫ్ చిరాగ్ పాశ్వాన్‌తో చెప్పాను. ఆయన నా భర్తను సొంత తమ్ముడిలా చూస్తారు. అంతేకాదు, బిహార్ రాజకీయాలలో యువత రాణించాలని భావిస్తారు. నాకు అన్ని అర్హతలు ఉన్నాయన్న కారణం రీత్యానే సీట్ ఇచ్చారు’ అని తెలిపిందామె.

అత్తగారి ఊరు

పట్నాలో పుట్టి పెరిగిన శాంభవి తన అత్తగారి ఊరైన సమస్తిపూర్‌లో గెలవడానికి సిద్ధమవుతోంది. ‘ఆ ఊరి గురించి నిజం చెప్పాలంటే నాకేమీ తెలియదు. ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. మొదట అక్కడ ఒక ఇల్లు కొని అక్కడే ఉంటానన్న భరోసా కల్పించాలి. ఆ ఊరి యువతతో ఇప్పటికే కాంటాక్ట్‌లోకి వెళ్లాను. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపిస్తారు. అవి వమ్ము చేయకుండా ఉండటమే నా ప్రథమ లక్ష్యం’ అంటున్న శాంభవి రాజకీయ జీవితాన్ని త్వరలో ఓటర్లు నిర్ణయిస్తారు.

ఉగాది వంటిల్లు

ఉగాది వస్తోంది... క్రోధి నామంతో కొత్త ఏడాదిని తెస్తోంది. కొత్తబెల్లంతో ఉగాది పచ్చడి ఎలాగూ కలుపుకుంటాం. పండుగ రోజు పచ్చడి తర్వాత ఇంకా ఏమేమి తిందాం. కొబ్బరి పాల గారెలు... మజ్జిగ వడలు చేసుకుందాం. మరికొంత సులువుగా ఓట్స్ స్మూతీ కూడా చేసుకుందాం.



క్రోధంగా చూడకండి! క్రోధికి స్వాగతం పలకండి!!

ఉగాది పచ్చడి

కావలసినవి: మామిడి పిందె – ఒకటి; వేప పువ్వు – టేబుల్ స్పూన్; బెల్లం పొడి– టేబుల్ స్పూన్; చింతకాయ – ఒకటి (లేకపోతే కొత్త చింతపండు చిన్న గోళీ అంత); ఉప్పు – చిటికెడు; పచ్చిమిర్చి – ఒకటి (తరగాలి).

తయారీ: ● వేప పువ్వును తొడిమలు, ఈనెలూ తీసేసి శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి ● చింతపండును నీటిలో నానబెట్టి రసం తీసుకోవాలి ● మామిడికాయను శుభ్రంగా కడిగి తొక్క తీయకుండా సన్నగా తరగాలి ● ఒక పాత్రలో బెల్లం పొడి, చింతపండు రసం, మామిడికాయ ముక్కలు, వేపపువ్వు, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి కలిపితే ఉగాది పచ్చడి రెడీ. గమనిక: ఇష్టమైతే చెరుకు ముక్కలు, రుచి కోసం అరటిపండు గుజ్జు కలుపుకోవచ్చు.



ఓట్స్ స్వీట్ స్మూతీ



కావలసినవి

ప్లెయిన్ సఫోలా ఓట్స్ – అరకప్పు; అరటిపండు – 1; బాదం పాలు – అరకప్పు; నీరు – అర కప్పు; చక్కెర – పావు కప్పు.

తయారీ: ఓట్స్‌ని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో బాదం పాలు, నీరు, అరటి పండు గుజ్జు, చక్కెర, ఓట్స్ పొడి వేసి బీటర్‌తో కలిపితే స్మూతీ రెడీ. గ్లాసులో పోసుకుని తాగడానికి వీల్లేనంత చిక్కగా ఉంటే మరికొంత నీటిని చేర్చుకోవచ్చు. స్మూతీని చల్లగా తాగాలనుకుంటే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి లేదా స్మూతీ కోసం వాడే నీటిని ముందుగా ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరుచుకోవాలి. బాదం పాలు రెడీమేడ్‌వి తీసుకోవచ్చు లేదా బాదం పప్పులు– నీటిని కలిపి మిక్సీ వేసి పాలను తయారు చేసుకోవాలి. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

పాల గారెలు

కావలసినవి: మినప్పప్పు – పావు కేజీ; నూనె – వడలు వేయించడానికి తగినంత; కొబ్బరిపాలు – లీటరు; యాలకుల పొడి– అర టీ స్పూన్; ఉప్పు– చిటికెడు; బాదం పప్పు – 10 (నానబెట్టి పొట్టు తీసి తరగాలి); జీడిపప్పు – 20; కిస్‌మిస్– టేబుల్ స్పూన్; పిస్తా– టేబుల్ స్పూన్; నెయ్యి– టేబుల్ స్పూన్; బెల్లం లేదా చక్కెర – అర కేజీ.

తయారీ: ● మినప్పప్పును శుభ్రంగా కడిగి నాలుగు గంటల సేపు మంచినీటిలో నానబెట్టిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పప్పును ఒక గిన్నెలోకి తీసుకుని బీటర్ లేదా స్పూన్‌తో రెండు నిమిషాల పాటు చిలకాలి. ● స్టవ్ మీద అడుగు మందంగా ఉన్న పాత్రను పెట్టి కొబ్బరి పాలు పోసి మరిగించాలి. వేడెక్కుతున్నప్పుడు అందులో చక్కెర వేసి కలుపుతూ మరిగించాలి. చిక్కబడేటప్పుడు యాలకుల పొడి వేసి మరో నిమిషం పాటు మరిగించి దించేయాలి. ● ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాణలి పెట్టి నెయ్యి వేడి చేసి అందులో బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి కొబ్బరి పాలు బెల్లం మిశ్రమంలో కలపాలి ● బాణలిలో నూనె వేడి చేసి అందులో మినపపిండిని పాలిథిన్ పేపర్ మీద వేసి వత్తి (నిమ్మకాయంత గోళీలుగా కూడా వేసుకోవచ్చు) నూనెలో వేయాలి. రెండువైపులా కాలనిచ్చి తీసి టిష్యూపేపర్ మీద వేయాలి. అదనంగా ఉన్న నూనెను పేపర్ పీల్చుకున్న వెంటనే (వేడిగా ఉండగానే) వడలను ఒక వెడల్పు పాత్రలో పరిచినట్లు అమర్చి కొబ్బరిపాల మిశ్రమాన్ని పోయాలి. వడలు ఐదు నిమిషాల్లో కొబ్బరి పాలను పీల్చుకుంటాయి. వడలు పీల్చుకున్న తర్వాత కూడా పాలు ఇంకా మిగులుగా ఉండాలి. సర్వ్ చేసేటప్పుడు కప్పులో ఒక వడ ఒక గరిటె కొబ్బరి పాలు వేసి ఇవ్వాలి.



మజ్జిగ వడ



కావలసినవి: అటుకులు – కప్పు; రవ్వ – పావు కప్పు; మజ్జిగ– అర కప్పు; పచ్చిమిర్చి – 2 (తరగాలి); అల్లం తరుగు – టేబుల్ స్పూన్; నువ్వులు – టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు (తరగాలి); కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; బియ్యప్పిండి లేదా ఓట్స్ – టేబుల్ స్పూన్; ఉల్లిపాయ తరుగు – 2 టేబుల్ స్పూన్లు; కొబ్బరి తురుము – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పచ్చి శనగపప్పు– టేబుల్ స్పూన్; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను వెడల్పు పాత్రలో వేసి నీటిని పోసి కడిగి వేరొక పాత్రలోకి తీసుకోవాలి. అటుకులను నీటి నుంచి వేరు చేయడానికి నీటిని వంపకూడదు. నీటిలో తేలుతున్న అటుకులను చేత్తో తీసి మరొక పాత్రలో వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల అటుకుల్లో ఇసుక ఉంటే నీటి అడుగుకు వెళ్లిపోతుంది. అటుకులు శుభ్రంగా ఉంటాయి. ● పచ్చి శనగపప్పు కడిగి అటుకుల్లో వేయాలి. ● అందులో రవ్వ, ఉప్పు, మజ్జిగ వేసి కలిపి ఇరవై నిమిషాల సేపు నాననివ్వాలి. ● ఇప్పుడు నానిన అటుకుల్లో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, నువ్వులు, కరివేపాకు, కొత్తిమీర, కొబ్బరి తురుము, నువ్వులు, బియ్యప్పిండి వేసి కలిపి పది నిమిషాల సేపు ఉంచాలి. ● ఇప్పుడు మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని వడకు సరిపోయేటట్లు ఉందా లేదా అని సరి చూసుకోవాలి. మరీ జారుడుగా ఉంటే మరికొంత బియ్యప్పిండి కలుపుకుని పిండి అంతటినీ పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసి పక్కన పెట్టాలి. ● బాణలిలో నూనె వేడి చేసి అటుకుల గోళీని వత్తి మధ్యలో చిల్లు పెట్టి నూనెలో వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చి తీయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి. వేడి వేడి వడల్లోకి పుదీనా చట్నీ రుచిగా ఉంటుంది.